మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

మంగళవారం TUESDAY 20.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 76 ‖ వెల (Price) రూ.6.50 | పాడ్యమి

సూర్యోదయం: 6-00, సూర్యాస్తమయం: 6-38. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: పాడ్యమి రాత్రి 8-33 వరకు. నక్షత్రం: శతభిషం రాత్రి 3-09 వరకు. వర్జ్యం: పగలు 12-11 నుంచి పగలు 1-37 వరకు. రాహుకాలం: పగలు 3-28 నుంచి సాయంత్రం 5-02 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-10 నుంచి రాత్రి 11-56 వరకు. అమృతకాలం: రాత్రి 8-44 నుంచి రాత్రి 10-09 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

రైతన్నలపై పోలీసు ఉక్కుపాదం

ఆదిలాబాద్ జిల్లాలో 15 మందిపై కేసులు.. సీఎం రేవంత్‌ను అవమానించారని ఆరోపణ

పోలీస్ స్టేషన్‌కు పిలిపించి 5 గంటలు కూర్చోబెట్టిన వైనం.. మాఫీ అడిగితే అణచివేత


రుణమాఫీ అయిపోయిందంటూ ఆర్భాటంగా ప్రకటించి, సవాళ్లు విసిరి, ముఖ్యమంత్రి అడ్డగోలు భాషలో మాట్లాడి నాలుగు రోజులైనా కాకముందే మంత్రులు నాలుక మడతేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రగిలిపోతున్న రైతన్నలు ఊరూరా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు దహనం చేస్తుంటే, ఆ వేడికి మంత్రుల నోట అసలు మాట బయటకు వస్తున్నది. వడ్డీ, అదనపు రుణం కడితేనే మిగతావి మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల మొన్నటికి మొన్న వ్యాఖ్యానించగా, మరో 12 వేల కోట్లు ఇస్తామంటూ మంత్రి పొంగులేటి చెప్పారు.

ఇక నిన్నటికి నిన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసలు సంగతి బయటపెట్టారు. రాష్ట్రంలో రుణమాఫీ పూర్తిగా కాలేదని, దాదాపు 9 లక్షల మందికి డబ్బు చెల్లింపు జరగలేదని ఉత్తమ్ చెప్పగా, సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీలో సమస్యలు తలెత్తినట్టు మంత్రి జూపల్లి అంగీకరించారు. మరి రుణమాఫీ అయిపోయిందన్న ముఖ్యమంత్రి కరెక్టా? కాలేదని అంగీకరిస్తున్న మంత్రులు కరెక్టా? రుణమాఫీ జరగలేదనడానికి రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చేస్తున్న ధర్నాలే నిదర్శనం.

అయితే ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తున్న ప్రభుత్వం, పోలీసు బలగాలతో రైతులను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నది. వారు బయటకు రాకుండా, దిష్టిబొమ్మల దహనాలు, శవయాత్రలు చేయకుండా అడ్డుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు మౌఖిక ఆదేశాలు అందినట్టు తెలిసింది. అంతే కాదు; ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించిన 11 మంది రైతులపై ఏకంగా కేసులు నమోదు చేశారు.



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీస్‌స్టేషన్ ఎదుట రైతులు



కామారెడ్డి జిల్లా పెద్ద రాంపూర్ గ్రామంలోని దక్కన్ గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నిరసనలు చేస్తే ఇదే శిక్ష అనేలా హెచ్చరికలు

రైతుల ధర్నాలపై సీఎం రేవంత్ సీరియస్?.. ఏం చేస్తున్నారంటూ ఇంటెలిజెన్స్‌కు క్లాస్

రైతులను అదుపు చేయాలని అధికారుల హుకుం.. గంటలపాటు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధం

అన్నదాతను నట్టేట ముంచారు: హరీశ్.. రైతురాజ్యం కాదిది.. పోలీస్ రాజ్యం: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్/ఆదిలాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పూర్తి చేశామంటూ శుద్ధ అబద్ధాలు చెప్తున్న ప్రభుత్వం.. తమకు మాఫీ కాలేదని రైతులు నెత్తీనోరు బాదుకొని అరిచినా పట్టించుకోవడం లేదు. పైగా.. అన్నదాతలు గొంతెత్తకుండా పోలీసులతో ఉక్కుపాదం మోపుతున్నది. ప్రభుత్వం చేసిన మోసంతో ఆగ్రహం కట్టలు తెంచుకొని, రోడ్డెక్కిన రైతులపై నిర్దాక్షిణ్యంగా పోలీసు కేసులు పెడుతున్నది. బాధిత రైతుల గోడు వినాల్సిన ప్రభుత్వం వారి గొంతు నొక్కుతున్నది. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే రెండు రోజుల్లో 15 మంది రైతులపై కేసులు నమోదు చేసింది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి హెచ్చరికలు పంపుతున్నది. దీంతో 'మా హామీ మా ఇష్టం.. మేం చేసిందే రుణమాఫీ.. ప్రశ్నిస్తే కటకటాల వెనక్కే' అన్నట్టుగా పరిస్థితి తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఆదివారం రైతులు రోడ్డెక్కడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో రైతులు ధర్నాలు చేయకుండా కట్టుదిట్టం చేయాలని పోలీస్ ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలు వెళ్లినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మొత్తంగా రైతులు గొంతెత్తకుండా ఉక్కుపాదం మోపాలని విశ్వప్రయత్నం చేస్తున్నది.

మరో నలుగురిపై కేసులు

తమకు రుణమాఫీ కాలేదంటూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో వారిని అదుపు చేసేందుకు ప్రభుత్వం పోలీసు కేసులు పెడుతున్నది. ఆదిలాబాద్ జిల్లాలో రుణమాఫీ చేయాలంటూ నిరసన తెలిపినందుకు రెండు రోజుల్లో 15 మందిపై కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడిలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు › 2వ పేజీలో

రుణమాఫీ పూర్తికాలే





డాటా క్లియర్‌గా ఉన్నవాళ్లకే జరిగింది

ఇంకా 9.14 లక్షల మందికి కావాలి

వడ్డీ చెల్లిస్తేనే రూ. 2 లక్షల రుణమాఫీ

మాఫీ కానివారు దరఖాస్తు చేసుకోవాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ

రైతులకు డూప్లికేట్ ఖాతాలు.. వాటిని పరిశీలించాల్సి ఉన్నది: జూపల్లి › 2

దళిత బిడ్డ సుమన్ రైతే



ప్రభుత్వ ఉద్యోగి కాదన్న వ్యవసాయ శాఖ

నమస్తే తెలంగాణ కథనంపై ప్రభుత్వం ఆరా

నివేదికను కోరిన వ్యవసాయశాఖ కమిషనర్

దళిత రైతుకు త్వరలోనే రుణమాఫీ వర్తింపు › 2

మంత్రుల ఇలాకా.. రైతులకు ధోకా

ఉత్తమ్ — **పంచోత్కులపల్లిలో పావువంతే!**
- 155 మందిలో 32మందికే మాఫీ
- సర్కారు నిబంధనలతో రైతులకు నష్టం › 2

పొన్నం — **గొల్లుమంటున్న గొల్లకుంట**
- 35 మంది రైతులకు కాని రుణమాఫీ
- సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహం › 2

స్పీకర్.. — **పెండ్లిమడుగు.. మాఫీ మళ్లీ అడుగు**
- గ్రామంలో 70% రుణమాఫీకి దూరం
- 553 మందిలో 200 మందికే లబ్ధి › 5

స్పీకర్‌కు మాఫీ


రూ. 1.5 లక్షలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం

వికారాబాద్ జిల్లాలో 80వేల మందికి టోపీ

అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

అన్యాయంపై మండిపడుతున్న అన్నదాతలు

సర్కారుకు మాఫీ మొత్తం తిరిగి ఇవ్వాలని స్పీకర్ నిర్ణయం?



వికారాబాద్, ఆగస్టు 19, (నమస్తే తెలంగాణ): పేద రైతులకు లేనిపోని నిబంధనలు పెట్టి రుణమాఫీకి దూరం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సొంత పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ వర్తింపజేసింది. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం, రైతుల వివరాలను తప్పుగా చేర్చడం వంటి కారణాలతో అర్హులైన పేద రైతులను రుణమాఫీకి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో పేద రైతులను అప్పులపాలు చేస్తున్న ప్రభుత్వం › 2వ పేజీలో

దళితుడికి ఇయ్యలే

మేము ఓటేసినోళ్లకు రుణమాఫీ చేసింద్రు

మాకు మాత్రం అన్యాయమా?

ఇదేం ప్రభుత్వం.. ఇదేం పాలన

రైతు బేగరి బాలయ్య ఆగ్రహం



వికారాబాద్, ఆగస్టు 19, (నమస్తే తెలంగాణ): అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. దళిత రైతులకు ధోకా చేస్తున్నది. సాక్షాత్తూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు 1.50 లక్షలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం.. అదే నియోజకవర్గంలోని దళిత రైతులకు మాత్రం మొండిచేయి చూపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేము ఓట్లేసి గెలిపించిన నాయకుడికి స్పీకర్ పదవిచ్చి రుణమాఫీ చేసిన ప్రభుత్వం మాకెందుకు అన్యాయం చేస్తున్నదని దళిత రైతులు మండిపడుతున్నారు. పేదలకు › 2వ పేజీలో

రాజీవ్ విగ్రహం తీసేస్తం



నిరుడు వీధికుక్కల దాడిలో గాయపడి కేటీఆర్ సాయంతో కోలుకున్న కృత్తిక తెలంగాణ భవన్‌లో సోమవారం ఇలా రాఖీ కట్టి కృతజ్ఞత తెలిపింది

సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తం

ఎయిర్‌పోర్టు పేరు మారుస్తం.. తెలంగాణ ప్రముఖుడి పేరు పెడతం

అధికారంలోకి వచ్చేది మేమే.. రాగానే ఆ పని చేస్తం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేస్తున్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించి తీరుతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం నందినగర్‌లోని తన నివాసంలో మీడియా అడిగిన ఒక ప్రశ్నకు కేటీఆర్ సమాధానమిస్తూ.. నాలుగేండ్లలో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, ఆ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో తరలించి, కాంగ్రెస్ కోరుకున్న చోట ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణ పౌరుషం, తెలంగాణ వైభవాన్ని చాటేలా అద్భుతమైన డిజైన్‌తో సచివాలయాన్ని › 5వ పేజీలో



తెలంగాణ తల్లి కోసం

సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండటమే చారిత్రక న్యాయం!

(లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ శ్రీ రాహుల్‌గాంధీ గారికి తెలంగాణ కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, బుద్ధిజీవుల పక్షాన బహిరంగ లేఖ) › 4

• **గురుకులంలో రాఖీ గోస**



ఈ ఫొటో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోనిది. తోబుట్టువులతో రాఖీ కట్టించాలని పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులను ప్రిన్సిపల్, సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో ఇదిగో.. ఇలా కిటికీ లోంచి రాఖీ కట్టించుకోవాల్సి వచ్చింది. మరికొందరు చేసేది లేక నిరాశగా వెనుదిరిగారు.

డీఎస్సీ పరీక్ష పేపర్ లీక్?

- ఎస్జీటీ పేపర్ లీక్ అయ్యిందంటున్న అభ్యర్థులు
- ఒకే ప్రశ్న 2 సార్లు పునరావృతం.. అదీ ఒకే పోస్టుకు
- ఒకే ప్రశ్న మరో పేపర్‌లో.. ఇలా 19 ప్రశ్నలు రిపీట్
- డీఎస్సీ పరీక్షల నిర్వహణలో భారీగా అక్రమాలు
- ఉద్దేశపూర్వకంగానే చేశారంటున్న అభ్యర్థులు
- పరీక్షలను రద్దుచేయాలని పలువురి డిమాండ్
- కొందరు అధికారుల పాత్రపైనా అనుమానాలు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పేపర్ లీకయిందా? ప్రశ్నలను కావాలనే కొందరు అధికారులు లీక్ చేశారా? అన్న ప్రచారం ఇప్పుడు సోషల్‌మీడియాలో జోరుగా సాగుతున్నది. గత నెలలో డీఎస్సీ కోసం ఒక పరీక్షలో వచ్చిన ప్రశ్నలు.. అదే పోస్టు భర్తీకి మరోరోజు నిర్వహించిన పరీక్షలో పునరావృతం కావడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా 18 ప్రశ్నలు పునరావృతం అయ్యాయి. నాలుగు రోజుల ముందు వచ్చిన ప్రశ్నలే ఐదోరోజూ రిపీట్ అయ్యాయి. జూలై 19న మొదటి షిఫ్ట్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) అభ్యర్థులకు › 6వ పేజీలో

రాష్ట్రంలో కుండపోత

పిడుగుపాటుతో ఆరుగురు మృతి › 6

మేఘా కోసం తొండాట

- **చిన్న సంఘటన కావడంతోనే బయటికి రాలేదన్న మంత్రులు**
- **ఈ నెల 7న తమ దృష్టికి వచ్చిందని జీవోలో చెప్పిన ప్రభుత్వం**
- **కానీ, సంఘటన జరిగిన వెంటనే ఖైరతాబాద్ ఆఫీస్‌కు ఫోన్**
- **అసెంబ్లీ జరుగుతుండగానే జలమండలికి సమాచారం**
- **నేటిదాకా మేఘా ఇంజినీరింగ్‌పై కించిత్తు చర్యలు తీసుకోని సర్కారు**

సుంకిశాల ఘటనపై వెలుగులోకి సరికొత్త వాస్తవాలు



సుంకిశాల ఘటన చిన్నది. అందుకే అక్కడ ఇంజినీర్లు, ఏజెన్సీవాళ్లు సరిదిద్దుకోవచ్చనే ఉద్దేశంతోనే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదు.

- సుంకిశాలను సందర్శించిన సమయంలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల చేసిన వ్యాఖ్యలు

ఈ నెల 2న సుంకిశాల ఘటన జరిగినా 7వ తేదీనే ప్రభుత్వం దృష్టికి వచ్చింది. › 6

- సుంకిశాల ఘటనపై ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ 14న సర్కారు జారీచేసిన ఉత్తర్వుల్లో ఇలా..

ఇసుక తోడేందుకు ఈపీసీ విధానం!



అప్పడే పనులు త్వరగా పూర్తి

గ్లోబల్ టెండర్లు పిలవండి

జలాశయాల్లో ఇసుక, మట్టి నిల్వలను అంచనా వేయండి

క్యాబినెట్ సబ్ కమిటీ ఆదేశం

వివిధ శాఖల అధికారులతో సమీక్ష › 10

కరెంట్ ఇట్లనే పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి

వినియోగదారుడికి ఏడీఈ ఉచిత సలహా

తరచూ కోతలపై ఎల్లారెడ్డిగూడ వాసి ఫోన్

రోజంతా నరకం చూపిస్తున్నారని ఆవేదన › 10

అధికారి నిర్లక్ష్యపు సమాధానంపై అసహనం

అంధకారంలో కేఎంసీ దవాఖాన

కరెంట్ లేక 3 గంటల పాటు రోగుల అవస్థలు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మనింట్ల మన అమ్మ

మన ముంగిట్లో మన చెట్టు
మనింట్లో మన అమ్మ
ఆ తర్వాతే ఎవరైనా...
తోవకు తంగేడు పూలెట్లనో
భాగ్యనగరానికి చార్మినారెట్లనో
సచివాలయం ముందల తెలంగాణ తల్లి!

అమ్మ నాయన యాదిలో
బిడ్డలకు అవ్వయ్య పేర్లే పెడుతం
ఊరులవున్న పేర్లన్నీ పెడుతమా?
మనింటికి
మన అమ్మనాయినలే
వెలుగు దివ్వెలు

ఉనికికి
ఎడంచేతి పనులు
ఎటమటం వ్యవహారాలు
తోటలో పావురాలు ఎన్నో
వాటి పాత్రలు వాటివే... గౌరవించాల్సిందే!
మన దర్వాజకు మన కాకతీయ తోరణం!

అరవై ఏండ్ల స్వేచ్ఛకై మట్టి పిడికిలెత్తింది
సబ్బండ వర్గాలు మానవహారాలైండ్రు
సకల జనుల దుఃఖం సాగరహారమైంది
జమ్మిచెట్టున పాలపిట్టలా
గెలిచి నిలిచిన వాకిట్ల తల్లి విగ్రహం ఉండాలి
మన కడపకు మన బొట్టె అందం

మహోద్యమం ఉప్పెనలై ఉరికిన నేలన
పాటపాడితే పొలంల నారు వడాలి
రాస్తే శిలకు ప్రాణం రావాలి
కాలువతీస్తే చెరువు శిఖం మురవాలి
మన వాకిట్ల మన మందారం పరిమళించాలి
మన గనుమల మన తల్లి సూర్యబింబం

అవినీతిని నిర్మూలించి
న్యాయానికి వారధై నిలువు
ఆకలిని వెంటాడి వేటాడి
పదిమంది కడుపునింపు
చరిత్రను నిర్మించు
మహనీయులను గౌరవించు
రాయబడని వెలుగుల్ని లిఖించు

అవకాశం కోసం
ఆశయాలకు పిండాలు
అధిష్ఠానం మెప్పుకై
మతిలేని పాకులాటలు
వెలుగు కుర్చీమీదుండి
చీకట్లకు తోసెయ్యడం ప్రజాస్వామ్యమా?

రత్నాన్ని తీసి రాయిని పాతాలె
చెరువును పూడ్చి బోరింగ్ ఏయాలె
మార్పంటే ఆనవాళ్లను చెరిపేయడమా?
యాపకు రంగేస్తే
మామిడి అవుతుందా?
పేరును మార్చితే
దొంగ దేశభక్తుడవుతాడా?

పేరును మార్చినోడు
ఊర్లను మార్చుతడు
జిల్లాలను కూడా...
మార్చుతడు
పేర్లు, తావులను
యాది మర్సేటట్లు
ఉమ్మడి కుట్రలకు
సలువచేస్తున్నడు
నీ వెలుగు కోసం
చీకట్ల ఉండాలా?


మహనీయులే లేనట్లు
అమరులే గొడ్డుపోయినట్లు
చంద్రవంకల జాడలే లేనట్లు
పరిపాలన గుండె
ఎదుట పరాయి విగ్రహం
అనాలోచిత చర్యలకు ప్రతిరూపం
తెలంగాణ అస్తిత్వ
గౌరవానికి సమాధి

తెలంగాణ తల్లికి కిరీటం
బంగారు కిరీటమని
చేతిలో మక్కజొన్న కంకికాదు
బంగారు కంకని
పట్టుచీర కట్టడానికి
అంత ధనవంతురాలా? అని
దొరల తల్లని... గడీల తల్లని?
తెలంగాణతల్లే కాదని ఎద్దేవా చేసి
ఎదలను చింపుకున్నోళ్లంతా
ఎవరి సంకల్లో సేదతీరిండ్రు
ఏ చెట్టు నీడన ఉయ్యాలలూగుతూ
ఎవరి బూట్లకు లేసులు తొడుగుతున్నరు
వినండి! మిత్రులారా!మాట్లాడుదాం!!
తెలంగాణ తల్లికి అస్తిత్వ అక్షరమై సాగుదాం!!



(సచివాలయం ఎదుట
తెలంగాణ తల్లి విగ్రహం
ప్రతిష్ఠించాలని కోరుతూ...)

వనపట్ల సుబ్బయ్య
94927 65358



తెలంగాణ తల్లి కోసం..

సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండటమే చారిత్రక న్యాయం!

(లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ శ్రీ రాహుల్‌గాంధీ గారికి తెలంగాణ కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, బుద్ధిజీవుల పక్షాన బహిరంగ లేఖ)

తెలంగాణ అస్తిత్వ వైభవానికీ, స్వరాష్ట్ర ప్రతిపత్తికీ, స్వాభిమానానికీ, సాధికారతకు ప్రతీక తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లి ప్రస్తావన ఈనాటిది కాదు, తెలంగాణ రైతాంగ పోరాటం కాలంలోనే దాశరథి, రావెళ్ల వెంకటరామారావు వంటి కవులెందరో తెలంగాణ తల్లిని ప్రస్తుతిస్తూ పద్యాలూ, పాటలూ రచించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన తెలంగాణ తల్లి భావన తిరిగి మలిదశ తెలంగాణ ఉద్యమంలో పునర్జీవం పొందింది. సమైక్యవాదులు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు విరుద్ధంగా, సమైక్య రాష్ట్ర ప్రతీకగా తెలుగుతల్లిని నిలిపే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బుద్ధిజీవులూ, సాహిత్యకారులూ, కళాకారులూ తెలంగాణ తల్లి రూపురేఖలను గురించి చర్చించటం ప్రారంభించారు. చర్చల పర్యవసానంగా తెలంగాణ తల్లి ఇప్పుడున్న విధంగా రూపుదాల్చింది. ఉద్యమకారులు స్వచ్ఛందంగా తెలంగాణ ఎల్లెడలా వేలాది విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. కనుక తెలంగాణ తల్లి ఈ మట్టిలోనుంచి, తెలంగాణ ఉద్యమ భావోద్వేగాల నుంచి పుట్టిన అస్తిత్వ ప్రతీక.

సమైక్య రాష్ట్ర అస్తిత్వ ప్రతీకగా తెలుగుతల్లి విగ్రహం గతంలో సెక్రటేరియట్ ముందు ఉండేది. తెలంగాణ స్వరాష్ట్రం సిద్ధించి నూతన సెక్రటేరియట్ భవనం కూడా నిర్మాణమైన నేపథ్యంలో, నేడు తెలంగాణ సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండటం చారిత్రక న్యాయం. సెక్రటేరియట్‌కు అమరవీరుల స్మారక కేంద్రానికి మధ్యనున్న స్థలంలో తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించాలని తెలంగాణ కవులు, కళాకారులు, పాత్రికేయుల పక్షాన శ్రీరాహుల్‌గాంధీ గారికి విజ్ఞప్తి చేస్తున్నాం. సెక్రటేరియట్ ఎదురుగా తెలంగాణ తల్లిని పెట్టాల్సిన చోట భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టాలనే ప్రభుత్వ ఆలోచన పట్ల మాకు అభ్యంతరాలున్నాయని తెలియజేస్తున్నాం. రాజీవ్‌గాంధీ గారి మీద మాకు గౌరవం ఉంది. నగరంలో ఆయన విగ్రహం పెట్టాలనే ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ ఆలోచన పట్ల మాకేమీ అభ్యంతరం లేదు. అయితే, సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి ఉండవలసిన చోట కాకుండా మరెక్కడైనా ప్రతిష్ఠించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు నెలకొల్పినప్పుడే తెలంగాణ అస్తిత్వ ప్రతీకకు కావాల్సిన సాధికారత, ప్రతిపత్తి సిద్ధిస్తుంది. తెలంగాణ చరిత్రతో గానీ పరిణామాలతో గానీ ప్రత్యక్ష సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అక్కడ పెట్టడం ద్వారా తెలంగాణ భావోద్వేగాలను గాయపర్చవద్దని కోరుతున్నాం. ఎన్నికల సమయంలో మీరు తెలంగాణ సాంస్కృతిక ఆకాంక్షలను గౌరవిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలుపుకొంటూ సెక్రటేరియట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని నెలకొల్పేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి మీరు సూచించాలని కోరుకుంటున్నాం.

తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక ఆకాంక్షలకు మద్దతుగా నిలుస్తారని ఆశిస్తున్నాం.

అభినందనలతో...

ప్రొఫెసర్ హరగోపాల్
డాక్టర్ నందిని సిధారెడ్డి
టంకశాల అశోక్
అల్లం నారాయణ
గోరేటి వెంకన్న
మల్లేపల్లి లక్ష్మయ్య
అయాచితం శ్రీధర్
హిమజ్వాల
(ఇరివెంటి వెంకట్రమణ)
పరాంకుశం వేణుగోపాల స్వామి
డాక్టర్ నాళేశ్వరం శంకరం
దేశపతి శ్రీనివాస్
ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి
కట్టా శేఖర్ రెడ్డి
తిగుళ్ల కృష్ణమూర్తి
కూతురు శ్రీనివాస్ రెడ్డి
ప్రొఫెసర్ దంటు కనకదుర్గ
రసమయి బాలకిషన్
సంగిశెట్టి శ్రీనివాస్
ఏలె లక్ష్మణ్
శ్రీధర్‌రావు దేశ్‌పాండే
బుద్ధా మురళి
ఎస్జీవీ శ్రీనివాస్ రావు
అనిశెట్టి రజిత
ఐనంపూడి శ్రీలక్ష్మి
కొమర్రాజు రామలక్ష్మి
శ్రీదేవి మంత్రి
రాజ్యశ్రీ కేతవరపు
వెంకటేశ్వర్లు వర్దెల్లి
మంగళంపల్లి విశ్వేశ్వర్
పెద్దింటి అశోక్ కుమార్
వేముగంటి మురళి
కందుకూరి శ్రీరాములు
మల్లావఝల విజయానంద్
డాక్టర్ ఆంజనేయ గౌడ్
బద్రి నర్సన్
శ్రీరామోజు హరగోపాల్
రమేశ్ హజారి
కాంచనపల్లి
నవీన్ ఆచారి
జూలూరి గౌరీశంకర్
వఝుల శివకుమార్
ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
వేముగంటి మురళీకృష్ణ
ధ్యావనపల్లి సత్యనారాయణ
పెన్నా శివరామకృష్ణ
కోట్ల వెంకటేశ్వర రెడ్డి
లక్ష్మణ్‌గౌడ్
డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
వనపట్ల సుబ్బయ్య
లక్ష్మణ్ మురారి (బందూక్)
కార్టూనిస్ట్ మృత్యుంజయ్
చిమ్మని మనోహర్
ఎదిరెపల్లి కాశన్న
డా.ఎ.జయంతి
స్వర్ణ కిలారి
బోల యాదయ్య
కె.వీరయ్య
యన్.బాల్ రాం
ఉప్పరి తిరుమలేష్
అమర్ నాథ్
చిక్కొండ్ర రవి
బైరోజు చంద్రశేఖర్
బైరోజు రాజశేఖర్
బైరోజు శ్యాంసుందర్
వహీద్ ఖాన్
వేదార్థం మధుసూదన శర్మ
ఆర్.రత్నాకర్‌రెడ్డి,
సి.హెచ్.ఉషారాణి
బెల్లంకొండ సంపత్ కుమార్
పొన్నాల బాలయ్య
కె.అంజయ్య
సిద్దెంకి యాదగిరి
చమన్ సింగ్
కె.రంగాచారి
తైదల అంజయ్య
నాగిళ్ల రామశాస్త్రి
ఘనపురం దేవేందర్
వీరేంద్ర కాపర్తి
ప్రగతి
పరదా వెంకటేశ్వర్‌రావు
ఆచార్య పిల్లలమర్రి రాములు
సంగాని మల్లేశ్వర్...



నమస్తే తెలంగాణ

ఉమ్మడి పౌరస్మృతి

ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగంలో దేశానికి లౌకిక పౌరస్మృతి కావాలని ప్రకటించడం ఒక విరోధాభాసలా కనిపిస్తున్నది. ఎందుకంటే, మతపరమైన రాజకీయాలకు పెట్టింది పేరైన బీజేపీ నేతగా, హిందూత్వ అతివాదిగా పేరొందిన ప్రధాని లౌకికవాదం గురించి మాట్లాడటం విచిత్రమే మరి. బీజేపీ ఇదివరకటి ఉమ్మడి పౌరస్మృతి నినాదానికి ఇది లౌకిక తొడుగు వేయడమే తప్ప మరొకటి కాదని భావించాలి. ఉమ్మడి పౌరస్మృతి విషయమై దేశంలో ఏకాభిప్రాయం లేకపోవడం, ముఖ్యంగా లౌకికవాదులంటూ బీజేపీ ఈసడించుకునే ప్రస్తుత 'ప్రధాన మిత్రపక్షాలు' దానికి అంగీకారం తెలపడం అసాధ్యం కావడం నేపథ్యంలో మోదీ ఈ కొత్త పదబంధాన్ని సృష్టించారు! అందుకే ఉమ్మడి పౌరస్మృతి విధానానికి మద్దతు కూడగట్టుకోవడంలో భాగంగానే ప్రధాని సరికొత్త రూపంలో ఆ నినాదాన్ని ప్రజల ముందు లేదా రాజకీయ పార్టీల ముందు ఉంచడానికి ప్రయత్నించారని భావించవచ్చు. ఎన్డీయే ప్రధాన మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ పార్టీలు బీజేపీ మతపరమైన ఎజెండాకు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపే అవకాశాలు అంతంతమాత్రమేననేది తెలిసిందే. ఇది పరస్పర అవసరాల ఆధారంగా ఏర్పడిన పొత్తు కావడమే అందుకు కారణం.

ప్రధాని చేసిన లౌకిక పౌరస్మృతి ప్రతిపాదనపై జేడీయూ, టీడీపీ స్పందనలు ఊహించిన విధంగానే ఉన్నాయి. 2017లో కేంద్రానికి నితీశ్‌కుమార్ రాసిన లేఖనే పౌరస్మృతిపై తమ ప్రవచిత విధానమని జేడీయూ అంటున్నది. విస్తృతస్థాయి సంప్రదింపులు, ఏకాభిప్రాయ సాధన తర్వాతనే పౌరస్మృతి మార్పు గురించి నిర్ణయం జరగాలని ఆ లేఖలో నితీశ్ పేర్కొన్నారు. కాగా, ఇంకా ఈ అంశంపై సంప్రదింపులు జరగాల్సి ఉందని టీడీపీ స్పష్టం చేసింది. ఉమ్మడి పౌరస్మృతి అయినా, లౌకిక పౌరస్మృతి అయినా ముందుగా విస్తృతస్థాయి సంప్రదింపులు జరగాలనేదే తమ అభిమతమని టీడీపీ అంటున్నది. కేంద్రం తెచ్చిన వివాదాస్పద వక్ఫ్ చట్టాన్ని టీడీపీ సమర్థించినప్పటికీ దాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించాలని సూచించడం గమనార్హం. మైనారిటీల విషయంలో ఎన్డీయేలోని ప్రాంతీయ పార్టీల విధానం, బీజేపీ విధానం ఒకేవిధంగా లేదనడానికి ఇదే నిదర్శనం. ఈశాన్య ప్రాంతానికి చెందిన బీజేపీ మిత్రపక్షాలు కూడా ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకమనేది ఇక్కడ గుర్తుంచుకోవాలి.

1996 నుంచి వరుసగా ఎన్నికల మ్యానిఫెస్టోల్లో ఉమ్మడి పౌరస్మృతి గురించి బీజేపీ ప్రస్తావిస్తూ వస్తున్నది. ఉమ్మడి పౌరస్మృతిపై అన్ని పక్షాల, అదేవిధంగా ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు 22వ లా కమిషన్ నిరుడు ఒక నోటిఫికేషన్ జారీచేసింది. అంతకుముందు వేసిన 21వ లా కమిషన్ 2018లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉమ్మడి పౌరస్మృతి అవసరం కాదు, వాంఛనీయమూ కాదని చెప్పడం విశేషం. అయితే ప్రధాని మోదీ మాత్రం గత 75 ఏండ్లుగా దేశం మతపరమైన పౌరస్మృతి కిందే ఉన్నదని, ఇక ఇప్పుడు లౌకిక పౌరస్మృతి వైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైందని ఎర్రకోట ప్రసంగంలో చెప్పడం గమనార్హం. రాజ్యాంగంలోని లౌకికవాద విలువల్ని కాపాడేందుకే ఉమ్మడి పౌరస్మృతి స్థానంలో లౌకిక పౌరస్మృతిని తీసుకువస్తున్నట్టు బీజేపీ నేతలు అంటున్నారు. నిజానికి ఉమ్మడి పౌరస్మృతి బీజేపీ, సంఘ్ పరివార్ మూల సిద్ధాంతాల్లో ఒకటి. సొంత బలం లేక మిత్రపక్షాల మీద ఆధారపడే పరిస్థితి రావడం వల్లే ప్రస్తుతం బీజేపీ భాష చాలా వరకు మారిందని అర్థమవుతున్నది. బీజేపీ మాట మారినట్టు పైకి కనిపిస్తున్నప్పటికీ లోపల అసలు విషయం ఉమ్మడి పౌరస్మృతేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు!

ప్రజావాణి అరణ్యరోదనేనా?


ఒక విషయం ఎందువల్లనో గాని అంతగా వార్తలకు ఎక్కటం లేదు. చర్చకు అంతకన్నా రావటం లేదు. దాని పేరు 'ప్రజావాణి'. రాష్ట్ర ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని ప్రకటించి ఎనిమిది నెలలు గడిచి పాతబడిపోయినందున ఎక్కువమందికి గుర్తుండకపోవచ్చు. ఆసక్తి తగ్గవచ్చు. కనుక చర్చలోకి వెళ్లేముందు ఆ విషయం ఒకసారి మననం చేసుకోవటం అవసరం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుడు డిసెంబర్ 7వ తేదీన ఏర్పడిన వెంటనే తీసుకున్న తొలి చర్యలలో ఒకటి, గత ప్రభుత్వ పాలనలో నిర్మించిన ప్రగతి భవన్ పేరును జ్యోతిరావు పూలే భవన్‌గా మార్చి, దాని ముందున్న 'కంచెలను బద్దలు కొట్టి', ఇకనుంచి ప్రజలు అందులోకి స్వేచ్ఛగా ప్రవేశించి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చునని ప్రకటించటం. ఆ విధంగా వినతిపత్రాల స్వీకరణ కార్యక్రమానికి మొదట ప్రజా దర్బార్ అనే పేరు పెట్టి, రెండురోజుల తర్వాత 'ప్రజావాణి'గా మార్చారు. ఈ చర్యలపై సర్వత్రా ప్రశంసలు రాగా, ప్రజలు తమ వినతులతో పోటెత్తటం మొదలైంది. అంతవరకు అంతా బాగున్నది. కానీ, కార్యక్రమం మొదలై ఇప్పటికి ఎనిమిది నెలలు గడిచినా ఏదీ పరిష్కారం కాక, 'ప్రజావాణి' కాస్తా అరణ్యరోదనగా మిగిలినట్లు కనిపిస్తున్నది.



టంకశాల అశోక్

ప్రజావాణిమొదలైనప్పుడు సామాన్య ప్రజలకు రెండు కారణాల వల్ల ఎనలేని ఉత్సాహం, ఆశలు కలిగాయి. ప్రగతిభవన్‌లో ప్రవేశించి తమ సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పుకునే అవకాశం లభిస్తున్నదనేది మొదటి కారణం. ఇందుగురించి స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలను, అధికారులకు ఇచ్చారంటున్న ఆదేశాలను విన్న మీదట, ఇక తమ వినతిపత్రం సమస్యలు సత్వరమే పరిష్కారం కాగలవన్న ఆశలు కలగటం రెండవది. మన రాష్ట్రంలో గాని, దేశంలో గాని ప్రజల సమస్యలు నిజమైనవి, ఒకవిధంగా అంతులేనివి అయినందున, పాలకులు ఆ విధమైన హామీలను ఎంతో నమ్మకంగా ఇచ్చినప్పుడు ప్రజలలో ఆశలు కూడా అదేస్థాయిలో కలగటం సహజం. పైగా వారానికి రెండుసార్లు మంగళ, శుక్రవారాలలో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్వయంగా హాజరై దరఖాస్తులను తానే స్వీకరించగలరని ప్రకటించారు. దానితో ఆ రోజులలో ప్రజలు రాష్ట్రం నలుమూలల నుంచి ఒకరోజు ముందుగానే బయల్దేరి రావటం, కార్యక్రమం ఉదయం 10 నుంచి మొదలవుతుంది గనుక తాము వెనుకబడిపోరాదన్న ఆరాటంతో ఇంకా సరిగా తెల్లవారక ముందు నుంచే ప్రజాభవన్ వద్ద తండోపతండాలుగా చేరి బారులు తీరటం, ఆ లైన్లు రోడ్డు పైకి కూడా రావడంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పడిన శ్రమ వంటివన్నీ మనం చూశాం. ప్రభుత్వ మార్పు కోసం ఎంతో కృషి చేసిన జెండా మేధావులైతే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయి వ్యాఖ్యానాలు చేశారు. అప్పటినుంచి ఎనిమిది నెలలు గడిచేసరికి ప్రజావాణి అరణ్యరోదనగా మిగులుతుండగా వారెందుకో ఏ వ్యాఖ్యానాలూ చేయటం లేదు. అసలు ఇటువంటి కార్యక్రమం అంటూ ఒకటున్నదనే విషయం వారికి ఇంకా గుర్తున్నదా లేక మరిచిపోయారా అనే సందేహం కలుగుతున్నది.

పైన అనుకున్నట్టు మనవంటి అంతులేని సమస్యల వ్యవస్థలో ప్రజావాణి కార్యక్రమానికి ఎటువంటి అర్జీలు వస్తాయి? ఇది అది అని గాక సకల సమస్యలపైనా వస్తాయి. అందుకు అదనంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరిట పదమూడు హామీలనిచ్చింది. ఆ విధంగా ఇతర సమస్యలు, వాటితో పాటు ఆరు గ్యారంటీలతో ప్రత్యక్ష నిమిత్తం గల సమస్యలతో రోజుకు కొన్ని వేల దరఖాస్తులు రావటం మొదలైంది. ఆ వెల్లువను చూసి కలవరపడినందుకో, సమయం లేనందుకో గాని, ప్రతిసారి రాగలరన్న ముఖ్యమంత్రి అసలు రావటం ఆపివేశారు. తన స్థానంలో వస్తారన్న మంత్రులు మానివేశారు. వారికి బదులుగా అన్న అధికారులు ఆగిపోయారు. క్లర్కులు మాత్రం మిగిలారు. ప్రతిరోజు అన్నది వారానికి రెండురోజులైంది. దరఖాస్తుల స్వీకరణను కొంతవరకు జిల్లాలకు బదిలీ చేశారు. అక్కడ ఏమవుతున్నదో ఎవరికీ తెలియదు. ఆ క్రమంలో రెండు జరిగాయి. ఒకటి ప్రజలకు ఆశలు, నమ్మకం తగ్గిపోతుండటం. రెండు, అసలు ఆ కార్యక్రమం పట్లనే చాలామందికి ఆకర్షణ లేకుండాపోవటం. పనులు జరగనప్పుడు నమ్మకాలు, ఆకర్షణ ఉండవు కదా.



> ఈ పరిస్థితికి అదనంగా మరికొన్ని చేరాయి. వినతిపత్రాలు ఇచ్చినవారికి నంబర్లు ఇచ్చారు. వాటి పరిస్థితి ఏమిటో చెక్ చేసుకోవటానికి అధికారికంగా పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అంతవరకు బాగున్నది. కానీ సామాన్య ప్రజలలో అట్లా చెక్ చేసుకోవాలన్న మాట తెలిసింది కొందరికే.

ఈ పరిస్థితికి అదనంగా మరికొన్ని చేరాయి. వినతిపత్రాలు ఇచ్చినవారికి నంబర్లు ఇచ్చారు. వాటి పరిస్థితి ఏమిటో చెక్ చేసుకోవటానికి అధికారికంగా పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అంతవరకు బాగున్నది. కానీ సామాన్య ప్రజలలో అట్లా చెక్ చేసుకోవాలన్న మాట తెలిసింది కొందరికే. చెక్ చేసుకోగలవారు ఇంకా తక్కువ. తీరా చెక్ చేసుకున్నవారికి ఎంతకాలం గడిచినా తమ సమస్య పరిష్కారమైందన్నమాట కన్పించలేదు. దరఖాస్తులో ఫోన్ నంబర్లు ఇచ్చినవారికి ఏ సమాచారాలు లేవు. స్వయంగా అధికారులను కలిసినవారికి వస్తున్న సమాధానం తమకేమీ తెలియదని. ఇది ఒకటి కాగా, అసలు ప్రభుత్వం వద్ద ఒక నిర్దిష్టమైన, పారదర్శకమైన ఏర్పాట్లు లేవు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయో, ఏ సమస్యకు ఎన్నో, పరిష్కారమైనవి ఏవి ఎన్నో, పరిష్కార క్రమంలో ఉన్నవి ఎన్నో, పరిశీలనలో ఉన్నవి ఎన్నో, తిరస్కరించినవి ఎన్నో నెలకొకసారి లెక్కలు ప్రకటించవచ్చు. ఆయా దరఖాస్తుదారుల ఫోన్లకు మెసేజ్‌లు పంపవచ్చు. ఇటువంటి బాధ్యతాయుత వ్యవహరణ వల్ల పారదర్శకత కలుగుతుంది. ప్రజలకు విశ్వాసం ఏర్పడుతుంది. ఇంకా తమ పనులు కానివారు కూడా ఆశాభావంతో ఓపికపడతారు. కానీ ప్రభుత్వం ఇవేమీ చేయటం లేదు.

ప్రజావాణి వంటి కార్యక్రమానికి ఒక స్వభావం, ఒక సీరియస్ లక్ష్యం ఉంటాయి. అది కోట్లాది జన సామాన్యపు జీవన సంఘర్షణలకు సంబంధించినది అయినందున దానిని ప్రవేశపెట్టడమంటే తేనెతుట్టెను కదిలించటమే. అంతే తప్ప అది రాజకీయ అవసరాల రొమాన్స్ కాదు. అందులో గ్లామర్ ఉండదు. అందువల్ల, ఒక పాలకునికి సీరియస్‌నెస్, నిజాయితీ ఉంటే ఇవన్నీ ముందుగానే ఆలోచించాలి. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. మధ్యలో సమీక్షలు జరపాలి. కాని ప్రజావాణి కార్యక్రమాన్ని ఎనిమిది నెలల క్రితం ప్రకటించిన పటాటోపపు తీరును చూసినా, తర్వాత ఎనిమిది నెలలుగా అది అమలవుతున్న పద్ధతిని గమనించినా ఇందులో కనీసం రొమాన్స్ అయినా కనిపించటం లేదు. రాజకీయ వంచనా కళ తప్ప. ఈసరికి ఆ కళ సైతం వెలవెలబోతున్నట్టు కనిపిస్తున్నది. ఈ మాటపై సందేహాలున్న జెండా మేధావులు ఒకసారి ప్రజాభవన్‌కు వెళ్లి అక్కడి దరఖాస్తుదారులు చూపించే అద్దంలో తమ మొహాలు చూసుకోవచ్చు.

నిజానికి సీరియస్‌గా ఆలోచిస్తే, దరఖాస్తుదారుల సమస్యల పరిష్కారం ఎంతమాత్రం తేలిక కాదు. అవన్నీ ఎక్కువగా ఇళ్లు, భూములు, ఉద్యోగాలు, ఆరోగ్య సమస్యలు, రెవెన్యూ వివాదాలు, పోలీసు కేసుల వంటి వాటికి సంబంధించినవి. వాటి పరిష్కారం ఏ ప్రభుత్వానికైనా కష్టమే. కొన్ని ఇప్పటికిప్పుడు అసాధ్యం కూడా. వీటిలో అత్యధికం సాధారణ పరిపాలనాక్రమంలో అభివృద్ధి క్రమంలో తేలవలసినవే తప్ప వ్యక్తుల వారీగా కాదు. ఏవో కొన్నింటికి తప్ప గడువులు కూడా వీలు కాదు. అందువల్ల కావలసింది చిత్తశుద్ధి గల పాలన, అభివృద్ధి. కాని మన రాష్ట్రంలో గాని, ఉమ్మడి రాష్ట్రంలో గాని, దేశంలో గాని మొదటినుంచి గల పరిపాలనా వ్యవస్థలు, ఆర్థిక-రాజకీయ-సామాజిక వ్యవస్థలు, రాజకీయ పార్టీలూ ప్రభుత్వాల స్వభావాలు, స్వప్రయోజనాలు, నిజాయితీరాహిత్యాలు అనేకానేక ప్రజా సమస్యలను పరిష్కరించకుండా అరకొర చర్యలతో మభ్యపెట్టి సాగదీసి దాటవేస్తున్నాయి. పరిష్కారాలు తేలిక కాదని ప్రభుత్వ నాయకులకు, అధికార యంత్రాంగానికి పూర్తిగా తెలుసు. అయినప్పటికీ 'ప్రజావాణి' వంటి దాటవేత కార్యక్రమాలతో ప్రజలకు భ్రమలు కల్పిస్తుంటారు. పైన పేర్కొన్న పరిస్థితుల వల్ల, ఆ భ్రమాత్మక కార్యక్రమాలు విఫలమయ్యే పరిస్థితులు కూడా వాటిలో అంతర్నిహితంగా ఉంటాయి. కనుక అది చివరికి అరణ్యరోదనగా మిగలటం అనివార్యమవుతుంది. ఇటువంటి అనుభవాల నెగెటివ్ ప్రభావాలు ప్రజలపై సూక్ష్మస్థాయి (మైక్రోలెవెల్)లో ఉంటాయి.

ఆమె డైరీలో చిరిగిన పేజీ!

- ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో కోణం
- పూర్తి వివరాలు చెప్పని బాధితురాలి తండ్రి
- నేడు నిందితుడికి సీబీఐ 'లై డిటెక్టర్' పరీక్ష!
- సుప్రీంకోర్టు సుమోటో విచారణ కూడా నేడే



ఆర్‌జీ కర్ దవాఖానలో ఏర్పాటు చేసిన బాధిత విద్యార్థిని బొమ్మకు వైద్యుల నివాళి

కోల్‌కతా: దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో కొత్త విషయాన్ని బాధితురాలి తండ్రి వెల్లడించారు. తన కుమార్తె వ్యక్తిగత డైరీలో ఒక పేజీ చిరిగి ఉన్నదని పేర్కొన్నారు. తన కుమార్తె బ్యాగ్‌లో ఎప్పుడూ ఒక డైరీ ఉంటుందని, దాన్ని తామెప్పుడూ చదవలేదని తెలిపారు. డైరీలో చిరిగిన ముక్కకు సంబంధించిన ఫొటో తన వద్ద ఉందని చెప్పిన బాధితురాలి తండ్రి.. అందులో ఏమున్నదనే వివరాలు వెల్లడించలేదు. కేసుకు సంబంధించిన విషయాలను బహిరంగంగా మాట్లాడొద్దని తనకు సీబీఐ సూచించిందని అన్నారు. కాగా, ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. మంగళవారం విచారణ జరుపనున్నది. మరోవైపు ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ వరుసగా మూడు రోజులు ప్రశ్నించింది. ఘటనకు ముందు, తర్వాత ఆయన ఫోన్స్ కాల్స్‌ను పరిశీలిస్తున్నది.

లై డిటెక్టర్ టెస్టుకు హైకోర్టు అనుమతి

ట్రైనీ డాక్టర్ హత్యాచార నిందితుడికి లై డిటెక్టర్ టెస్ట్ నిర్వహించొచ్చని కలకత్తా హైకోర్టు పేర్కొన్నది. దీంతో కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు నిందితుడు సంజయ్ రాయ్‌కు మంగళవారం పాలీగ్రాఫ్ టెస్టు నిర్వహించే అవకాశం కనిపిస్తున్నది. లై డిటెక్టర్ టెస్టుకు అనుమతి ఇచ్చిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 29కు వాయిదా వేసింది.

మమతపై పోస్టు.. విద్యార్థి అరెస్టు

పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై వివాదాస్పద పోస్టు పెట్టిన కీర్తి శర్మ అనే విద్యార్థిని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో మమతకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా, హింసను ప్రేరేపించేలా పోస్టులు పెట్టాడని పోలీసులు ఆరోపించారు. సీఎం మమతను హత్య చేయాలంటూ ఇతరులను ప్రోత్సహిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా నిందితుడు హత్యాచార బాధితురాలి గుర్తింపు, ఆమె ఫొటోను కూడా బయటపెట్టాడని తెలిపారు.

బాధితురాలి శరీరమంతా గాయాలే!

హత్యాచారానికి గురైన బాధితురాలి శరీరంలో చాలా చోట్ల గాయాలైనట్టు పోస్టు మార్టం నివేదిక వెల్లడించిందని ఎన్డీటీవీ పేర్కొంది. ఆమెను గొంతు పిసికి హత్య చేశారని, లైంగిక దాడి జరిగినట్టు మెడికల్ ఆధారాలు కూడా ఉన్నాయని నివేదిక కాపీని ఉటంకిస్తూ పేర్కొన్నది. అయితే బాధితురాలి శరీరంలో 150 జీఎం/ఎంజీ వీర్యం ఉందని జరుగుతున్న ప్రచారాన్ని రిపోర్టు తిరస్కరించింది. ఆమె శరీరంలో 'తెల్లటి చిక్కని జిగురు వంటి ద్రవం' ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపిన పోస్టు మార్టం నివేదిక, అది ఏంటో వెల్లడించలేదు. బాధితురాలికి తల, పెదవులు, ముక్కు, బుగ్గలు, కుడి దవడ, గడ్డం, మెడ, ఎడమ చేయి, ఎడమ భుజం, ఎడమ మోకాలుతో పాటు జననాంగం లోపల కూడా గాయాలు అయ్యాయని నివేదిక తెలిపింది. ఊపిరితిత్తుల్లో రక్తస్రావం అయిందని, శరీరంలోని ఇతర భాగాల్లో బ్లడ్ క్లాట్స్ అయిందని పేర్కొన్నది.

కేంద్ర దవాఖానల్లో 25% భద్రతా సిబ్బంది పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: కోల్‌కతా రేప్ ఘటనపై నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో తమ ప్రభుత్వ దవాఖానల్లో 25 శాతం భద్రతా సిబ్బందిని పెంచుతూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అవసరాన్ని బట్టి మార్షల్స్ సంఖ్యనూ పెంచాలని ఆదేశాల్లో పేర్కొంది. వైద్యుల సమస్యలపై సలహాలు స్వీకరించేందుకు డీజీహెచ్ఎస్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పింది. వైద్యుల కోసం విశ్రాంతి గది, సీసీటీవీ లాంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దవాఖానల్లో హింసాత్మక ఘటనలు జరిగితే ఆరు గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని తెలిపింది. మరోవైపు సోమవారం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ దవాఖానల్లో జూనియర్ డాక్టర్లు కోల్‌కతా రేప్ ఘటనపై నిరసనలు కొనసాగించారు. న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

విమాన ప్రయాణంతో అనారోగ్యం!

- అపరిశుభ్రత కారణంగా సీట్లు, ట్రే టేబుళ్ల వంటి వాటిపై బ్యాక్టీరియా, వైరస్‌లు
- కొన్ని రోజుల పాటు వాటిపైనే తిష్ఠ
- డయేరియా, తలనొప్పి, కడుపు నొప్పి వంటి అనారోగ్య సమస్యలకు గురయ్యే చాన్స్
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



న్యూఢిల్లీ, ఆగస్టు 19: విమాన ప్రయాణం చేస్తున్నారా? ఫ్లైట్‌లో మీరు కూర్చొంటున్న సీటు, సీట్ బెల్ట్, ఆహార పదార్థాలు పెట్టుకొనే ట్రే టేబుల్ వంటివి శుభ్రంగా ఉన్నాయా? లేవా? అని చూసుకొంటున్నారా?. అవి శుభ్రంగా లేకుంటే విమాన ప్రయాణం తర్వాత డయేరియా, తలనొప్పి, కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలకు గురవుతారని జైపూర్‌కు చెందిన సుదీప్తో అనే డాక్టర్ హెచ్చరిస్తున్నారు. విమాన ప్రయాణం పలు అనారోగ్య సమస్యలకు ఎలా దారితీస్తుందో ఆయన తన ఎక్స్ ఖాతాలో వివరించారు. చాలా మంది ఇలాంటి అనారోగ్య సమస్యలతో తన వద్దకు వచ్చారని తెలిపారు. విమానంలో సీట్లు, ట్రే టేబుళ్లు, సీట్ బెల్ట్‌లు, ఆర్మ్ రెస్టులు వంటివి ప్రయాణాల్లో అందరూ సాధారణంగా టచ్ చేసేవి ఉంటాయని, వాటిపై ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లు, ఇతర వ్యాధికారకాలు అనారోగ్యం కలిగిస్తాయనే విషయాన్ని పలు అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయని పేర్కొన్నారు. వెంటనే తిరుగు ప్రయాణం చేయాల్సి రావడం వలన విమానంలో పూర్తిగా శుభ్రం చేసేందుకు అవకాశం ఉండదని, సీట్ల వరకు ఏదో కొంత మేర క్లీనింగ్ చేస్తారని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా ఫ్యాబ్రిక్ సీట్లు తేమను పీల్చుకొని ఎక్కువ సేపు ఉంచుతాయని, దీని వలన బ్యాక్టీరియా, వైరస్‌ల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ముఖ్యంగా వేడి వాతావరణంలో ప్రయాణాలు చేసే సమయంలో వ్యక్తి చెమట హెడ్ రెస్టులకు అంటుకుంటుందని చెప్పారు. అదేవిధంగా ప్రయాణికులు దగ్గరదగ్గరగా కూర్చోవడం వలన సూక్ష్మక్రిములు ఒకరి నుంచి మరొకరికి సులభంగా ట్రాన్స్‌ఫర్ అవుతాయని పేర్కొన్నారు. సాధారణ పరిశుభ్రతను పాటించకపోతే ఏ ప్రజా రవాణాలోనైనా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.

సీట్లపై వారం రోజుల వరకు బ్యాక్టీరియాలు

డాక్టర్ సుదీప్తో పలు అధ్యయనాలను ప్రస్తావించారు. సెప్టిక్ ఆర్థ్రిటిస్, ప్రాస్టెటిక్ డివైజ్ ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, గ్యాస్ట్రోఎంటెరిటిస్, మెనిన్‌గిటిస్, టాక్సిక్ షాక్ సిండ్రోమ్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధులను కలిగించే స్టెఫిలోకాకస్ ఆరియస్ అనే బ్యాక్టీరియా విమాన సీట్లపై ఏడు రోజుల వరకు జీవించి ఉంటుందని 2015లో ఆబర్న్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారని పేర్కొన్నారు. నీళ్ల విరేచనాలకు కారణమయ్యే ఈ.కోలి అనే మరో బ్యాక్టీరియా ఆర్మ్ రెస్టులపై నాలుగు రోజుల పాటు ఉంటుందని తేలిందన్నారు.

ప్రతి దశలోనూ జాగ్రత్తలు తప్పనిసరి

వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను డాక్టర్ సుదీప్తో ఈ సందర్భంగా సూచించారు. విమాన ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హ్యాండ్ శానిటైజర్ తీసుకెళ్లాలని, దాన్ని బోర్డింగ్, సీట్‌లో కూర్చొనే సమయంలో, తర్వాత రాసుకోవాలని అన్నారు. విమానం దిగిన తర్వాత బస్సు లేదా రైలు ప్రయాణంలోనూ ఇది పాటించాలన్నారు. ముఖ్యంగా స్వల్ప దూర దేశీయ ప్రయాణాల్లో విమానంలో పేపర్ కప్పుల్లో ఇచ్చే ఆహారం, నీరు, జ్యూస్‌లను తీసుకోకూడదని సూచించారు. దూర ప్రయాణాల్లో దాహం తీర్చుకొనేందుకు ఒక నీళ్ల బాటిల్ కొనుక్కోవాలన్నారు. కూర్చొనే ముందు సీట్, హ్యాండ్ రెస్ట్‌లు, ట్రే టేబుల్ ఉపరితలాలను డిస్ఇన్ఫెక్ట్ వైప్స్‌తో శుభ్రం చేసుకోవాలని, ఆహారం, పానీయాల విషయంలో విచక్షణ చూపాలని సూచించారు.

23న ఉక్రెయిన్‌కు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 23న ఉక్రెయిన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరిక మేరకు ఈ పర్యటన ఖరారైందని విదేశాంగ శాఖ సోమవారం తెలిపింది. ఈ నెల 21న మోదీ పోలెండ్‌ను సందర్శించి ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో సమావేశమవుతారని చెప్పింది. 30 ఏండ్లుగా ఉక్రెయిన్-భారత్ మధ్య దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయని.. ఆ దేశంలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని మోదీనేనని విదేశాంగ శాఖ వెల్లడించింది.

రష్యాలో కేరళ యువకుడి మృతి

బలవంతంగా ఆ దేశ మిలటరీలో ఉద్యోగం

తిరువనంతపురం: ఉక్రెయిన్ సైనిక బలగాలు జరిపిన దాడుల్లో కేరళ యువకుడు రష్యాలో మరణించాడు. రష్యా మిలటరీ తరఫున పనిచేస్తున్న త్రిస్సూర్‌కు చెందిన సందీప్ (36), ఉక్రెయిన్ యుద్ధంలో మరణించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విదేశాల్లోని మలయాళీ సంఘాల నుంచి సందీప్ కుటుంబానికి ఈ మేరకు సమాచారం అందింది. రెస్టారెంట్‌లో ఉద్యోగం లభించిందని సందీప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో మాస్కోకు చేరుకోగా, బలవంతంగా అతడ్ని ఆ దేశ మిలటరీలో చేర్చారని స్థానికులు చెబుతున్నారు. రష్యాలో ఉద్యోగాలంటూ ఏజెంట్లు చేస్తున్న మోసాలకు కేరళ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన యువకులు బలవుతున్నారు.

మలయాళ సినీ పరిశ్రమలో మహిళలపై వేధింపులు

జస్టిస్ హేమ కమిటీ నివేదిక

తిరువనంతపురం: మలయాళం సినిమా పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ నివేదిక సంచలన విషయాలను వెల్లడించింది. ఇండస్ట్రీలో మహిళా ప్రొఫెషనల్స్ లైంగిక వేధింపులు, దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నది. అమానవీయ ప్రవర్తనకు బాధితులుగా ఉన్నారని తెలిపింది. ఇండస్ట్రీని కొంత మందితో కూడిన ఒక 'క్రిమినల్ గ్యాంగ్' నియంత్రిస్తున్నదని పేర్కొన్న కమిటీ.. లొంగని మహిళలను ఇండస్ట్రీ నుంచి బయటకు పంపేస్తారని వెల్లడించింది. కొంత మంది ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, నటులు, ప్రొడక్షన్ కంట్రోలర్స్ మధ్య ఒప్పందం ఉన్నదని కమిటీ నివేదిక ఆరోపించింది. 2017లో ఓ నటిపై దాడి కేసు తర్వాత ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

ఏచూరికి అస్వస్థత

న్యూఢిల్లీ, ఆగస్టు 19: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆయన్ని సోమవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్చారు. ఏచూరి గత కొంతకాలంగా నిమోనియాతో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఆయన్ని దవాఖానలోని అత్యవసర విభాగంలో చేర్చామని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. వైద్య పరీక్షల నిమిత్తం ఎయిమ్స్‌కు వచ్చిన ఏచూరి, నిమోనియా తగ్గకపోవటంతో దవాఖానలో చేరారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందన్నారు. కొద్ది రోజుల క్రితమే ఏచూరి కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్నారు.

బాలికను నిర్బంధించి.. 5 రోజులు గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకున్నది. 13 ఏండ్ల బాలికను ఐదు రోజులపాటు నిర్బంధించి ఐదుగురు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అప్పర్ సుబన్‌సిరి జిల్లా డపోరిజో పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసు సూపరింటెండెంట్ థూటన్ జంబ ఆదివారం మాట్లాడుతూ, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కోర్టు వీరికి జ్యుడిషియల్ కస్టడీ విధించిందన్నారు. వీరంతా 20-30 ఏళ్ల మధ్య వయస్కులని చెప్పారు.

13 మంది బాలికలపై లైంగిక వేధింపులు

ఎన్‌సీసీ క్యాంప్ పేరుతో అకృత్యం

తమిళనాడులో ఆలస్యంగా వెలుగులోకి

చెన్నై: తమిళనాడులో కృష్ణగిరి జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు చేస్తామని నమ్మబలికిన నిందితులు.. ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు మరో 12 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ నెల మొదటి వారంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పాఠశాల ప్రిన్సిపాల్, ఇద్దరు టీచర్లతో సహా 11 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. ఎన్‌సీసీ క్యాంపు సందర్భంగా బాలికలకు స్కూల్ ఆడిటోరియంలో, బాలురకు గ్రౌండ్ ఫ్లోర్‌లో వసతి ఏర్పాటు చేశారు. పిల్లలను పర్యవేక్షించేందుకు ఒక్క టీచర్‌ను కూడా నియమించలేదు. దీన్ని అదనుగా తీసుకొన్న నిందితులు ఓ బాలికపై లైంగిక దాడి చేయడంతో పాటు మరో 12 మందిపై వేధింపులకు పాల్పడ్డారు. నిందితులపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. తమపై లైంగిక వేధింపులు జరిగిన విషయాన్ని బాధిత బాలికలు స్కూల్ యాజమాన్యానికి తెలిపారని, అయితే వారు పోలీసులకు సమాచారం అందించకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని కృష్ణగిరి జిల్లా ఎస్పీ పీ తంగదురై తెలిపారు.

యూపీలో దళిత నర్సుపై రేప్

మొరాదాబాద్: యూపీలోని మొరాదాబాద్‌లో ఓ దళిత నర్సుపై(20) ఆమె పనిచేస్తున్న ప్రైవేట్ దవాఖాన వైద్యుడు లైంగిక దాడి చేశాడని పోలీసులు వెల్లడించారు. బాధితురాలు ఆదివారం విధులకు వెళ్లారు. అర్ధరాత్రి మెహనాజ్ అనే నర్సు బలవంతంగా ఆమెను దవాఖానలోని మొదటి అంతస్తులోని ఒక గదిలోకి తీసుకెళ్లి తాళం వేశారు. అనంతరం షానవాజ్ ఆ గదిలోకి వెళ్లి నర్సును రేప్ చేశాడు. కులం పేరుతో దూషించి, చంపేస్తానని బెదిరించాడు.


ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

మంచు లింగాన్ని దర్శించుకున్న 5 లక్షల మంది భక్తులు

న్యూఢిల్లీ: అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య గత 52 రోజులుగా సాగిన అమర్‌నాథ్ యాత్ర సోమవారం శ్రావణ పూర్ణిమతో ముగిసింది. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలు, ఉగ్రదాడుల్ని సైతం లెక్కచేయకుండా అయిదు లక్షల మంది భక్తులు మంచు లింగాన్ని దర్శించుకున్నారు. ఈ ఏడాది జూన్ 29న యాత్ర మొదలైంది. రెండు మాసాలు మాత్రమే దర్శనమిచ్చే మంచు లింగాన్ని సాక్షాత్తు కైలాస నాథుడు పరమేశ్వరుడిగా భక్తులు భావిస్తారు.

ఎంపాక్స్‌పై కేంద్రం అప్రమత్తం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఎంపాక్స్‌పై కేంద్రం అప్రమత్తమైంది. బొబ్బలు, పొక్కులున్న రోగులను గుర్తించి ఐసొలేషన్ వార్డులో ఉంచాలని దవాఖానలను కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశించింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్, లేడీ హార్డింగ్, రామ్ మనోహర్ లోహియా దవాఖానలను నోడల్ హాస్పిటల్స్‌గా ప్రకటించింది. అనుమానిత రోగులకు ఆర్‌టీ-పీసీఆర్, నాసల్(ముక్కు) స్వాబ్ పరీక్షలు నిర్వహించనున్నారు. విమానాశ్రయాల్లోనూ ముందుజాగ్రత్త చర్యలు తీసుకోనున్నారు.




ఆర్మీ మాజీ చీఫ్ పద్మనాభన్ కన్నుమూత

చెన్నై: భారత సైన్యం మాజీ చీఫ్ జనరల్ సుందరరాజన్ పద్మనాభన్ (83) సోమవారం కన్నుమూశారు. వృద్ధాప్య కారణాల వల్ల ఆయన తుది శ్వాస విడిచినట్లు సమాచారం. ఆయన 2000 సెప్టెంబరు 30 నుంచి 2002 డిసెంబరు 31 వరకు ఆర్మీ చీఫ్‌గా పని చేశారు. 15 కోర్ కమాండర్‌గా ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అతి విశిష్ట్ సేవా పతకాన్ని ప్రభుత్వం ప్రదానం చేసింది.

ల్యాటరల్ ఎంట్రీపై వివాదం

- ఎన్డీఏకు స్వపక్షంలోనే వ్యతిరేకత
- తప్పుబట్టిన కేంద్రమంత్రి పాశ్వాన్
- రిజర్వేషన్లను లాక్కునే కుట్ర అంటూ విపక్షాల ధ్వజం
- యూపీఏ హయాంలోనే ప్రతిపాదన: కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంలోని 45 కీలక పదవుల్లోకి కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు వారిని నియమించడానికి యూపీఎస్సీ జారీ చేసిన 'ల్యాటరల్ ఎంట్రీ' ప్రకటన వివాదాస్పదమవుతున్నది. ఈ ప్రకటనను కేంద్రమంత్రి, ఎన్డీఏ భాగస్వామ్య లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌తో పాటు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సోమవారం ఈ విషయమై చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ.. ల్యాటరల్ ఎంట్రీ ప్రకటన పూర్తిగా తప్పని, ఇందులో ఎలాంటి 'అయినా, కానీ'లు లేవని కుండబద్దలు కొట్టారు. తమ పార్టీ ఈ చర్యను పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ నియామకాలు రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. తనకు ఈ ప్రకటన గురించి ఆదివారమే తెలిసిందని, తన ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు లాక్కునే కుట్ర: ప్రతిపక్షాలు

ల్యాటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా నియామకాలు చేపట్టడం దళిత, ఓబీసీ, ఆదివాసీలపై దాడి అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బహుజనుల నుంచి రిజర్వేషన్లు లాక్కోవాలని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని బీజేపీ వక్రీకరించిన రామరాజ్యం ప్రయత్నిస్తున్నదని పేర్కొంటూ ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నుంచి వెనుకబడిన వర్గాలను తొలగించేందుకు ఇది పక్కా ప్రణాళికతో చేస్తున్న కుట్ర అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సైతం ల్యాటరల్ ఎంట్రీ విధానాన్ని తప్పుపట్టారు. ఈ విమర్శలపై స్పందించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్.. ఈ విధానాన్ని యూపీఏ ప్రభుత్వ హయాంలో రెండో అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిషన్ ప్రతిపాదించిందని పేర్కొన్నారు.

ల్యాటరల్ ఎంట్రీ అంటే?

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మధ్య స్థాయి, సీనియర్ స్థాయి పదవులను సాధారణంగా ఐఏఎస్ వంటి సివిల్ సర్వీసుల అధికారులతో భర్తీ చేస్తారు. ఈ పదవులను సివిల్ సర్వీసులతో సంబంధం లేని బయటి వ్యక్తులు, నిపుణులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడాన్నే 'ల్యాటరల్ ఎంట్రీ' అంటారు. మూడేండ్లు లేదా ఐదేండ్ల ఒప్పందంతో వీరిని నియమిస్తారు. ఈ పద్ధతిని 2018లో మొదటిసారి అమలు చేశారు. ప్రస్తుతం పలు విభాగాల్లో జాయింట్ డైరెక్టర్, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ తదితర 45 పదవులను భర్తీ చేయడానికి యూపీఎస్సీ ప్రకటన జారీ చేసింది.

'ట్రిపుల్ తలాక్'తో వివాహ వ్యవస్థకు ప్రమాదం

రద్దును సమర్థించుకున్న కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్

న్యూఢిల్లీ, ఆగస్టు 19: వివాహ వ్యవస్థకు ''ట్రిపుల్ తలాక్' అనేది ప్రమాదకరమైన ఆచారమని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ట్రిపుల్ తలాక్ రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2017లో ఈ ఆచారాన్ని సుప్రీం కోర్టు పక్కకు పెట్టినప్పటికీ అది ట్రిపుల్ తలాక్‌తో చేసుకునే విడాకులను తగ్గించేందుకు సరైన నిరోధకత కాలేకపోయిందని తెలిపింది. ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు పొందుతున్న ముస్లిం వివాహితల హక్కులను కాపాడేందుకు పార్లమెంటు ఈ చట్టం చేసినట్టు పేర్కొన్నది. ఈ చట్టం ముస్లిం వివాహితలకు లింగ సమానత్వం, న్యాయం కల్పిస్తున్నదని, వివక్షను రూపుమాపేందుకు, వారి సాధికారతకు ప్రాథమిక హక్కులను కాపాడుతున్నదని తెలిపింది. 2017 ఆగస్టు 22న ట్రిపుల్ తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించింది. తర్వాత కేంద్రం ముస్లిం మహిళా(వివాహంపై హక్కుల రక్షణ) చట్టం చేయగా, పలు ముస్లిం సంస్థలు ఇది రాజ్యాంగ విరుద్ధమని కోర్టును ఆశ్రయించాయి.

సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీరమరణం

- జమ్ముకశ్మీర్‌లో మళ్లీ ఉగ్రదాడి
- ఈ ఏడాది ఇప్పటివరకు 21 మంది సైనికుల మృతి



జమ్ము: జమ్ముకశ్మీర్‌లో వరుస దాడులతో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. సోమవారం ఉదంపూర్ జిల్లాలో గస్తీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలపై ఉగ్రదాడి జరిగింది. ఉగ్రవాదుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కుల్‌దీప్ కుమార్ మరణించాడని అధికారులు వెల్లడించారు. బసంత్‌గఢ్‌లోని దూదే ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం లోకల్ పోలీసులతో కలిసి గస్తీగా వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ 187వ బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్‌కు బుల్లెట్ గాయాలయ్యాయని, దవాఖానకు తరలిస్తుండగా ఆయన మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. జమ్ము రీజియన్‌లో ఉగ్రవాదాన్ని పెంచేందుకు పాకిస్థాన్ గత కొంతకాలంగా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నది. ఐదు రోజుల క్రితం దోడా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఏడాది ఇప్పటివరకు ఉగ్రదాడుల్లో మొత్తం 74 మంది ప్రాణాలు కోల్పోగా, ఇందులో 21 మంది భద్రతా బలగాలకు చెందినవారు కాగా, 35 మంది టెర్రరిస్టులున్నారు.


'రిటైల్'లో 26 వేల ఉద్యోగాల కోత

తక్కువ డిమాండ్, విస్తరణ లేకపోవడం వల్లే

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో డజనుకు పైగా రిటైల్ కంపెనీలు 26 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. లైఫ్ స్టైల్, కిరాణా, క్విక్ సర్వీస్ రెస్టారెంట్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. వ్యాపార డిమాండ్ తక్కువగా ఉండటం, స్టోర్ల విస్తరణ నెమ్మదిగా చేయడం వల్ల ఉద్యోగాల్లో కోతలు విధించాల్సి వచ్చిందని ఆయా కంపెనీలు తెలిపాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ రిటైల్ విభాగం, టైటాన్, రేమండ్, పేజ్ ఇండస్ట్రీస్, స్పెన్సర్ ఉద్యోగులను ఎక్కువగా తొలగించిన కంపెనీల జాబితాలో ఉన్నాయి. మొత్తం ఉద్యోగుల్లో 17 శాతం మందిని ఈ కంపెనీలు తొలగించాయి. మరోవైపు కోతలపై రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో కుమార్ రాజగోపాలన్ మాట్లాడుతూ.. 'ప్రతిభకు కొరత ఉంది. ఈ విషయంలో మేము విశ్వవిద్యాలయాలతో కలిసి పని చేస్తున్నాం. వ్యాపారాలను మూసేయడం వల్ల కొన్ని కంపెనీలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. అయితే షాపర్స్ స్టాప్, ట్రెంట్ లాంటి కంపెనీలు స్టోర్ల విస్తరణ చేపడుతూ అదనపు సిబ్బందిని నియమించుకుంటున్నాయి' అని తెలిపారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వడ్డీ రేట్లు, స్టార్టప్, ఐటీ రంగాల్లో ఉద్యోగాల కోత, ఆర్థిక మందగమనం వల్ల అత్యవసరం కాని వస్తువుల కొనుగోళ్లు 2022 నుంచి తగ్గాయని ఓ నివేదిక తెలిపింది.

కర్ణాటకలో '108' స్కామ్

- ధనార్జనే లక్ష్యంగా ఆగడాలు.. రోగుల ప్రాణాలు గాలికి
- ఎక్కువ బిల్లుల కోసం ఐదారు అంబులెన్స్‌ల మార్పు
- కొత్త టెండర్లు పిలుస్తామని చేతులు దులుపుకొన్న మంత్రి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌పాలిత కర్ణాటక స్కామ్‌లకు అడ్డాగా మారిపోయింది. ముడా, వాల్మీకి, వక్ఫ్‌బోర్డ్ స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్ధరామయ్య సర్కారుకు '108 ఆరోగ్య కవచ్' అంబులెన్స్ సేవల్లో జరుగుతున్న అక్రమాలు మరో తలనొప్పిగా మారాయి. '108 ఆరోగ్య కవచ్' స్కామ్‌గా పిలుస్తున్న ఈ అక్రమాలకు కారణమైన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పెద్దయెత్తున డిమాండ్లు వస్తున్నాయి.

ఏమిటీ స్కామ్?

రోగులను కొంతదూరం ఒక అంబులెన్స్‌లో ఆ తర్వాత మరో అంబులెన్స్‌లో అనంతరం ఇంకో అంబులెన్స్‌లో తరలిస్తున్న ఘటనలు రాష్ట్రంలో ఇటీవల పెద్దయెత్తున వెలుగులోకి వచ్చాయి. ఎక్కువ బిల్లులు రాబట్టడం కోసమే ఇలా చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బయటపడింది ఇలా..

చిత్రదుర్గకు చెందిన సయ్యద్ ఇఫ్తిఖార్‌కు గత నెల 19న గుండెపోటు వచ్చింది. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని జయదేవ దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో సయ్యద్ సోదరుడు ముంతాజ్ 108 సర్వీసుకు ఫోన్ చేశాడు. గంట తర్వాత వచ్చిన అంబులెన్స్ డ్రైవర్ ఇఫ్తిఖార్‌ను ఎక్కించుకొని 20 కిలోమీటర్ల దూరం వరకు తీసుకెళ్లి అక్కడే రోడ్డుపై నిలిపేశాడు. అదేమిటని ప్రశ్నిస్తే, మా కంపెనీ నిబంధనలు ఇంతే.. ఇంకో అంబులెన్స్ వచ్చేవరకూ వేచి ఉండండి అని బదులిచ్చాడు. అలా ఆరు గంటల్లో ఆరు అంబులెన్స్‌లను మార్చారు. చివరకు దవాఖానలో చేరిన ఇఫ్తిఖార్ పరిస్థితి అత్యంత విషమంగా తయారైంది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో అసలు విషయం బయటపడింది. ఆగస్టు 5న కూడా ఓ గర్భిణికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీంతో ఆమె పురిట్లోనే బిడ్డను కోల్పోయింది. అంబులెన్స్‌ల మార్పుతో ఎక్కువ రోగులకు సేవలు అందించామని చూపించి.. ఎక్కువ బిల్లులు వసూలు చేయడానికే ఇలా చేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. 108 సేవలను అందిస్తున్న ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసులో పనిచేస్తున్న కొందరు అక్రమార్కుల వల్లే ఇదంతా జరుగుతున్నట్టు మండిపడుతున్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండురావు.. త్వరలోనే కొత్త టెండర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. అయితే, ఈ స్కామ్‌లో ప్రభుత్వ పెద్దల పాత్ర కూడా ఉండొచ్చన్న ఆరోపణలు వస్తున్నాయి.

29 వరకు సిద్ధరామయ్యపై చర్యలొద్దు

'ముడా'పై హైకోర్టు ఆదేశం

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలు ఉన్న 'ముడా' కుంభకోణంలో విచారణను ఆగస్టు 29 వరకు వాయిదా వేయాలని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. గవర్నర్ మంత్రిమండలి సలహా తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ ఉత్తర్వులను కొట్టేయాలని కోరారు. అయితే, సిద్ధరామయ్య విజ్ఞప్తి చేసినట్టుగా ఇప్పుడు గవర్నర్ ఉత్తర్వులను నిలిపివేస్తూ ఆర్డర్ ఇవ్వడం లేదని హైకోర్టు తెలిపింది.

బ్రిటన్‌లో అదుపు తప్పిన వీర్యదానం!

- విదేశాలకు సైతం ఎగుమతి
- డజన్ల కొద్దీ తోబుట్టువులు ఉండే అవకాశం: నివేదిక

లండన్: సంతానలేమితో బాధపడే వారికి సంతానం కలిగించే వీర్యదాన ప్రక్రియ బ్రిటన్‌లో అదుపు తప్పింది. బ్రిటన్ నుంచి విదేశాలకు వీర్యం ఎగుమతి అవుతున్నది. బ్రిటన్‌లోని నిబంధనల ప్రకారం ఒకరి వీర్యం పది కుటుంబాలకు మించి ఇవ్వడానికి వీలు లేదు. అయితే, ఎగుమతుల విషయంలో మాత్రం నిర్దిష్ట పరిమితి లేదు. బ్రిటన్ చట్టాల్లోని ఈ లోపాలను ఆసరాగా చేసుకొని వీర్యదానాన్ని పారిశ్రామిక స్థాయిలో చేపడుతున్నారట. దీంతో కొందరికి బ్రిటన్‌లో, విదేశాల్లో ఒక్కొక్కరికి డజన్ల కొద్దీ తోబుట్టువులు ఉండే అవకాశం ఉందని తాజాగా ఓ నివేదిక పేర్కొన్నది. ఈ మేరకు 'గార్డియన్' వార్తా పత్రికలో ఒక కథనం ప్రచురితమైంది. దీని ప్రకారం.. గతంలో బ్రిటన్‌కు అమెరికా, డెన్మార్క్ వంటి దేశాల నుంచి వీర్యం, అండాలు దిగుమతి అయ్యేవి. తర్వాత పరిస్థితి పూర్తి భిన్నంగా మారింది. 2019 నుంచి 2021 మధ్యనే యూకే నుంచి విదేశాలకు 7,542 స్ట్రాల వీర్యం ఎగుమతి అయ్యింది.

పంచోత్కులపల్లిలో పావువంతే!

155 మందిలో 32 మందికే రుణమాఫీ

సర్కారు అడ్డగోలు నిబంధనలతో రైతులకు నష్టం

మంత్రి సీతక్క ఇలాకాలో రైతుకు ధోకా!

వరంగల్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో మూడు దశల్లో రుణమాఫీ చేసినా.. పావువంతు మందికి మాత్రమే మాఫీ అయినట్టు తెలుస్తున్నది. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క సొంత నియోజకవర్గం ములుగు కేంద్రానికి సమీపంలోని పంచోత్కులపల్లిలో రుణమాఫీకాని రైతులే ఎక్కువగా ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పంట రుణాలమాఫీ ఒట్టిదేనని ములుగు జిల్లా ములుగు మండలం పంచోత్కులపల్లిలోని రైతుల పరిస్థితి చూస్తే స్పష్టమవుతున్నది. పంచోత్కులపల్లిలో 180 ఇండ్లు ఉన్నాయి. 450 మంది ఓటర్లు ఉన్నారు. పూర్తిగా వ్యవసాయమే ఆధారం. పంచోత్కులపల్లిలో 155 మంది రైతులకు వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నాయి. ములుగు పీఏసీఎస్, జంగాలపల్లిలోని యూనియన్ బ్యాంకులో వీరంతా పంట రుణాలు తీసుకున్నారు. బ్యాంకు ఖాతాలున్న 155 మంది రైతుల్లో భార్యభర్తలకు వేర్వేరుగా అకౌంట్లు ఉన్నాయి. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేయగా, మొదటి విడతలో 12 మందికి, రెండో విడతలో 15 మందికి, మూడో విడతలో ఐదుగురికి మాత్రమే మాఫీ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కుటుంబానికి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని ప్రకటించింది. రేషన్‌కార్డు ప్రమాణికంగా కుటుంబ నిర్ధారణ అని నిబంధనలు పెట్టింది. గ్రామాల్లో ఒకే ఇంటి పేరు ఉన్న కుటుంబాలు ఎక్కువగా ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనతో ఎక్కువ మంది రుణాలు మాఫీ కాలేదు. భార్య, భర్త ఒకే రేషన్ కార్డులో ఉంటారు. వీరిద్దరు వేర్వేరుగా లక్ష చొప్పున పంట రుణాలు తీసుకుంటే వీరికి మాఫీ కాలేదు. ఆధార్‌కార్డుల పేర్లలో పొరపాట్లు, ఇతర కారణాలతోనూ రుణమాఫీ దక్కలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 25 వేల చొప్పున నాలుగు విడుతల్లో రూ. లక్ష వరకు రుణమాఫీ జరిగింది. ఇప్పుడు పావు మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిందని, అందరికీ కాలేదని రైతులు అంటున్నారు.



ములుగు జిల్లాలోని పంచోత్కులపల్లి గ్రామం



రేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలి

భార్యకు, భర్తకు కలిపి రేషన్‌కార్డు ఒకటే ఉంటుంది. నా పేరు మీద రూ. 2 లక్షలు, నా భార్య పేరు మీద రూ. 2 లక్షల వరకు అప్పు ఉంది. గత ప్రభుత్వ హయాంలో పహాణీల ప్రకారంగా రూ. లక్ష చొప్పున రుణమాఫీ జరిగింది. రేషన్‌కార్డు నిబంధనతో మాకు రుణ మాఫీ వర్తించలేదు. ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డు నిబంధనలను ఎత్తివేయాలి.

- మాసిపెద్ది సత్యనారాయణరావు, పంచోత్కులపల్లి, ములుగు



సిద్దిపేట జిల్లా గొల్లకుంటలోని పోశమ్మగుడి వద్ద రుణమాఫీ అన్యాయంపై చర్చిస్తున్న గ్రామస్థులు

గొల్లుమంటున్న గొల్లకుంట

- **35 మంది రైతులకు కాని రుణమాఫీ**
- **సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహం**

మంత్రి పొన్నం ఇలాకాలో రైతుకు ధోకా!

సిద్దిపేట, ఆగస్టు 19 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఒకటో విడతలో రుణమాఫీ కాలే.. రెండోవిడతలో వస్తదనుకున్నారు.. అయినా రాలేదు. మూడో విడతలోనైన పేరు ఉంటుందని ఆశపడితే నిరాశే మిగిలిందని సిద్దిపేట జిల్లా గొల్లకుంట గ్రామ రైతులు గొల్లుమంటున్నారు. 2 లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టి రైతులకు మొండిచేయి చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గొల్లకుంట గ్రామాన్ని నమస్తే బృందం సందర్శించింది. గొల్లకుంటలో సుమారుగా 200 మందికి పైగా రైతు కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిందని సంబురపడ్డ రైతుల ఆశలకు ఆదిలోనే గండి పడ్డాయి. ఎక్కడ చూసినా రుణమాఫీ కాలేదని గ్రామ చావిడి వద్ద రైతులు ముచ్చటించుకుంటున్నారు. తొలి విడతలో లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తే కేవలం 71 మందికి, రెండో విడతలో 69 మందికి, మూడో విడతలో 35 మందికి రుణమాఫీ జరిగింది. ఈ చిన్న గ్రామంలో ఇంకా 35 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఒక్క 200 మంది రైతులు ఉన్న ఒక గొల్లకుంటలోనే కాదు, మిగతా గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. తక్షణమే గ్రామానికి అధికారులు వచ్చి రుణమాఫీ చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు.



రుణమాఫీ ఉత్తముచ్చటే

నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అక్కన్నపేట గ్రామీణ బ్యాంకులో రెండేండ్ల కింద సుమారు 1.60 లక్షల వరకు రుణం తీసుకున్న. ఇప్పుడు రుణమాఫీ రెండు లక్షల వరకు మాఫీ అంటే బ్యాంకు పోయి అడిగిన. రుణమాఫీ కాలేదు అని చెప్పిండ్రు. చాలా బాధ అనిపించింది. రుణమాఫీ లేదు. ఏం లేదు. అంతా ఉత్తముచ్చట్ల లెక్కాగా మారింది. రుణమాఫీ గురించి ఎవరిని అడుగాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ నెల నుంచి బ్యాంకుల చుట్టు, అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టు తిరుగుడే సరిపోతుంది. **-చింతల కనకయ్య, గొల్లకుంట, సిద్దిపేట జిల్లా**



నాలుగో విడత అంటుండ్రు..

నాకు రెండున్నర ఎకరాలు ఉంది. హుస్నాబాద్‌లోని కెనరా బ్యాంకులో 2018లో రుణం తీసుకున్న. రెగ్యులర్‌గా రెన్యువల్ చేయిస్తున్న. ప్రస్తుతం రూ. 1.32లక్షల రుణం ఉంది. నాకు రెండో విడతలో రుణమాఫీ కాలేదు. మూడో విడుతలో కూడా జరగలేదు. అగ్రికల్చర్ వాళ్లను అడిగితే అప్లికేషన్ ఇస్తే నాలుగో విడతల వస్తదనే ముచ్చట చెప్పుతున్నారు.

-కాశబోయిన మాధవి, గొల్లకుంట, సిద్దిపేట జిల్లా



మొత్తం కుటుంబానికి మాఫీలేదు

అక్కన్నపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మూడేండ్ల కిందట రూ. 60 వేలు లోను తీసుకున్నా. నా భర్త సమ్మయ్య కూడా ఇదే బ్యాంకులో రూ. 1.50 లక్షల రుణం తీసుకున్నడు. నాకు, నా భర్తకు ఎవరికీ రుణమాఫీ కాలేదు. మా తోటి కోడలు, మరిది కూడా బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. అసలు మొత్తం మా కుటుంబానికే రుణమాఫీ కాలేదు.

-కాశవేని చంద్రవ్వ, గొల్లకుంట, సిద్దిపేట జిల్లా

లోకం పోకడ



రుణమాఫీ చేయడం కుదరదంటారా? సరే.. దిష్టిబొమ్మలు కొనుక్కోవడానికి కొత్త రుణమైన ఇవ్వండి!

దళిత బిడ్డ రొడ్డ సుమన్ రైతే

- **వ్యవసాయ శాఖ స్పష్టీకరణ**
- **ప్రభుత్వ ఉద్యోగి కాదని వివరణ**
- **నమస్తే తెలంగాణ కథనంపై ప్రభుత్వం ఆరా**



నమస్తే ఎఫెక్ట్

నిజామాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతును ప్రభుత్వ ఉద్యోగిగా నమోదు చేసి రుణమాఫీకి మంగళంపాడిన వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దళిత రైతుకు జరిగిన అన్యాయంపై 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో 'దళిత రైతుకు దగా' శీర్షికన ప్రచురించిన కథనం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై సీఎంవో ఆరా తీసినట్టు తెలిసింది. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో ఉరుకులు పరుగులు పెట్టిన అధికారులు కమిషనరేట్‌కు పూర్తి వివరాలతో నివేదికను సమర్పించినట్టు సమాచారం. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రొడ్డ సుమన్ రైతేనని మండల వ్యవసాయాధికారి పద్మ క్షేత్ర స్థాయిలో పర్యటించి ధ్రువీకరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కూడా ఆయనకు అందుతున్నట్టు తేల్చారు. పొరపాటు ఎలా జరిగిందో వ్యవసాయ శాఖ చెప్పడం లేదు. 'నమస్తే' కథనం వల్ల రొడ్డ సుమన్‌ను ప్రభుత్వం రైతుగా గుర్తించి రుణమాఫీకి అర్హుడిగా నిర్ధారించారు. సుమన్ పేరిట ఉన్న రూ.1.92 లక్షల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసే అవకాశాలు ఉన్నాయి. రుణమాఫీ దక్కక తీవ్ర వేదనలో ఉన్న రొడ్డ సుమన్‌కు అండగా నిలిచిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికను పలువురు రైతులు అభినందించారు.

ప్రభుత్వానికి నివేదించాం

'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన దళిత రైతుకు దగా కథనంపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేశాం. రొడ్డ సుమన్ రైతే. అతను ప్రభుత్వ ఉద్యోగి కాదు. ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నాం. బాధిత వ్యక్తికి రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకుంటాం. డేటా కరెక్షన్‌కు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించేందుకు కృషి చేస్తున్నది. తద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

- వాజిద్ హుస్సేన్, వ్యవసాయాధికారి



రుణమాఫీ పూర్తికాలే

- **డాటా క్లియర్‌గా ఉన్నవాళ్లకే జరిగింది**
- **ఇంకా 9.14 లక్షల మందికి కావాలి**
- **వడ్డీ చెల్లిస్తేనే రూ. 2 లక్షల రుణమాఫీ**
- **మాఫీ కానివారు దరఖాస్తు చేసుకోవాలి**
- **మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ**
- **రైతులకు డూప్లికేట్ ఖాతాలు**
- **వాటిని పరిశీలించాల్సి ఉన్నది: జూపల్లి**

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, డాటా క్లియర్‌గా ఉన్న రైతులకే రుణమాఫీ అయిందని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ప్రభుత్వ పాలసీ ప్రకారం వడ్డీ కడితేనే రూ. 2 లక్షల రుణం మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఎర్రమంజిల్‌లోని జలసౌధ లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ పథకంపై ప్రతిపక్ష పార్టీలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రుణమాఫీ పూర్తయిపోయిందని రైతులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాలేదని పేర్కొన్నారు. తాము చేసినట్టుగా రుణమాఫీ దేశ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని, బీజేపీ ప్రభుత్వం ఏనాడూ రైతులను పట్టించుకోలేదని మండిపడ్డారు. అన్ని వివరాలు సరిగ్గా ఉన్న వారికి మాత్రమే ఆగస్టు 15 వరకు రుణాలు మాఫీ అయ్యాయని వివరించారు. ఆధార్‌లో తప్పులు, పాస్‌బుక్, ఆధార్‌లో పేర్లు సరిపోలకపోవడం, రేషన్‌కార్డు లేని కారణంగా 9.14లక్షల మందికి రుణమాఫీ కాలేదని, రూ 2 లక్షల లోన్‌కు సంబంధించి 8 లక్షల అకౌంట్లు ఉన్నాయని వెల్లడించారు. అవన్నీ కలిపితే దాదాపు 17.14లక్షల అకౌంట్లకు రుణమాఫీ కాలేదని తెలుస్తున్నది. అయితే, 8 లక్షల అకౌంట్లకు సంబంధించి రుణమాఫీ అయిందా? కాలేదా? అనే విషయంపై మాత్రం స్పష్టత నివ్వలేదు. రూ. 2 లక్షల పైన రుణం ఉన్నవారు వడ్డీ చెల్లిస్తేనే మాఫీ అవుతుందని పేర్కొన్నారు. ఏ కారణం చేతనైనా రుణమాఫీ పొందని రైతులు మండల వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డూప్లికేట్ అకౌంట్స్ ఉన్నాయని, వాటిని పరిశీలించాల్సి ఉందని చెప్పారు. ప్రచారం కోసమే రుణమాఫీపై ఖర్గేకు కేటీఆర్ లేఖ రాశారని విమర్శించా రు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొన్నారు.

రైతుల అరెస్టులు హేయం

- **నమ్మిన రైతులను నట్టేట ముంచారు**
- **అర్హులందరికీ రుణమాఫీ చేయాలి**
- **కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ ఆగ్రహం**



హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో రుణమాఫీ కాలేదని నిరసన తెలిపిన రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోలీసు యాక్ట్ పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రుణమాఫీకి పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించడం, అణగదొక్కే ప్రయత్నం చేయటం దుర్మార్గమని అన్నారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో అట్టర్‌ఫ్లాప్ అయ్యారని విమర్శించారు. నమ్మి ఓటేసిన రైతన్నను నట్టేట ముంచారని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతన్నలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రైతురాజ్యం కాదిది.. పోలీస్ రాజ్యం

- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రైతు రాజ్యం కాదిది ..పోలీసు రాజ్యం అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో సర్కారు తీరుపై ధ్వజమెత్తారు. రూ.15000 కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టి రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసి రూ. 2 లక్షల వరకు రుణాలు తీర్చేశాం అని చెప్పుకోవటం సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. రుణాలన్నీ మాఫీ చేస్తే రాష్ట్రంలో రైతులు రోడ్డెందుకు ఎక్కుతున్నారని ప్రశ్నించారు. సీఎం, మంత్రుల చేసిన అబద్ధపు ప్రకటనలే రైతుల ఆందోళనకు కారణమని చెప్పారు. రానున్న రోజుల్లో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి పాడె కడ్తారని చెప్పారు. రైతులకు క్షమాపణలు చెప్పి, కేసులను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయండి

- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**



కరీంనగర్ విద్యానగర్/ ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 19: రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చి పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అవినీతిపై బీజేపీ ఫోకస్ పెట్టిందని చెప్పారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని స్పష్టంచేశారు. సోమవారం కరీంనగర్‌తోపాటు గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ₹40వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి ₹17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి సోనియాగాంధీనే మోసం చేసిన ఘనులు కాంగ్రెస్ నాయకులని విమర్శించారు.

రైతన్నలపై పోలీసు ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

శవయాత్ర నిర్వహించారు. దీంతో పోలీసుల 11 మంది రైతులపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన నిమ్మల సుదర్శన్‌రెడ్డి, పుండ్రూ పోతారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కుమ్మరి భూమన్న, విపుల్‌రెడ్డి, సూర్యసేన్‌రెడ్డి, గోక లక్ష్మారెడ్డి, నక్క ధనుంజయ్, దత్తు, సతీశ్‌రెడ్డి, నర్సింహులపై కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు అదుపులోకి తీసుకొని రాత్రి 10.30 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని బాధితులు వాపోతున్నారు. తమపై ఎవరు ఫిర్యాదు చేశారని అడిగినా చెప్పలేదని పేర్కొన్నారు. జిల్లాలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి పోలీస్ యాక్ట్‌లోని సెక్షన్ 30 అమల్లో ఉన్నదని అధికారులు చెప్తున్నారు. నిబంధనలు ఉల్లంఘనతోపాటు పోలీసుల విధులకు ఆటంకం, సీఎం హోదాలో ఉన్న వారిని అవమానపర్చేలా వ్యవహరించినందుకు కేసు నమోదు చేసినట్టు అధికారులు చెప్తున్నారట. ఈ ఘటనపై సోమవారం రుయ్యాడి రైతు వేదికలో రైతులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అన్నదాతలపై ప్రభుత్వం కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. రుణమాఫీ అడిగితే కేసులు పెడతారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కొనసాగింపుగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మరో నలుగురు రైతులపై కేసు నమోదుచేశారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా ర్యాలీ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసినందుకు రైతులు డబ్బుల చంద్రశేఖర్,అలికె గణేశ్, తురాటి భోజన్న, చెట్ల వినీల్‌పై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై అప్పారావు తెలిపారు. ఒక్క ఆదిలాబాద్‌లో మాత్రమే కాదని, ఇతర అన్ని జిల్లాల్లోనూ రైతులు రోడ్డెక్కితే కేసులు పెట్టాలని పోలీసులు నిర్ణయించినట్టు చెప్తున్నారు.

మీరంతా ఏం చేస్తున్నట్టు?

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసనలపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనాలు ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పోలీసుల సమక్షంలోనే ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ఫొటోలపై ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీ, తదితర ఉన్నతాధికారులతో మాట్లాడారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కండ్ల ముందే దిష్టిబొమ్మలను తగలబెడుతుంటే ఏం చేస్తున్నట్టు? అని సీఎం ప్రశ్నించినట్టు సమాచారం. ఈ వ్యవహారంతో ప్రభుత్వం పరువు పోయిందని,రుణమాఫీ బూడిదలో పోసిన పన్నీరైందని అసహనం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రైతుల నిరసనలను కట్టుదిట్టం చేయాలని ఆదేశించినట్టు సమాచారం. పోలీసు ఉన్నతాధికారులు ఆదిలాబాద్ జిల్లా ఉన్నతాధికారులతో మాటాడినట్టు తెలిసింది.దీంతోపాటు ఆయా జిల్లాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రైతులు రోడ్డెక్కకుండా చూసుకోవాలని మౌఖికంగా ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఎవరైనా రైతులు, నేతలు అనుమతులు కోరినా ఇవ్వవద్దని స్పష్టంగా చెప్పినట్టు సమాచారం. నియంత్రణకు ఇంటెలిజెన్స్‌ను వాడాలని, ఎక్కడైనా రైతులు ఆందోళనకు దిగే పరిస్థితులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని గ్రామస్థాయి అధికారులకు చెప్పాలని సూచించినట్టు సమాచారం. ఎక్కడైనా నిరసన చేసే పరిస్థితులు ఉంటే.. పోలీసులు వెంటనే వెళ్లి 'ఏదో ఒక రకంగా' రైతులను ఒప్పించి, రోడ్డెక్కకుండా చూడాలని స్పష్టం చేసినట్టు తెలిసింది.



రైతుల గోస ఎందుకు అర్థంకావడం లేదు?

మా గ్రామంలో 80 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా గోసను ప్రభుత్వం అర్థం చేసుకోక కేసులు బనాయిస్తున్నది. గ్రామంలో రైతులందరం కలిసి పోలీసు కేసులను ఎదుర్కొంటాం. రైతుల ఆందోళనలు రాజకీయ పార్టీలకు ముడిపెట్టడం సరికాదు. శవయాత్రలో పాల్గొన్న వారు నిజమైన రైతులో కాదో ప్రభుత్వం నిర్ధారించుకోవాలి.

- విపుల్‌రెడ్డి, రైతు, రుయ్యాడి, తలమడుగు మండలం, ఆదిలాబాద్ జిల్లా



రైతులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

షరతులు లేని రుణమాఫీ చేస్తామన్నారు. ఇదే విషయాన్ని నిరసన ప్రదర్శన ద్వారా అడిగాం. నేను ఉన్నత విద్యాభ్యాసం చేసినా ఉద్యోగాలు లేక వ్యవసాయం చేస్తున్నా. ధర్నాను వక్రీకరించి రాజకీయ ఒత్తిళ్లతో ఓ మంత్రి ద్వారా రైతులపై కేసులు బనాయించారు. రైతులకు అన్యాయం జరిగితే ఎవరూ ప్రశ్నించవద్దన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

- సతీశ్‌రెడ్డి, రుయ్యాడి, తలమడుగు మండలం, ఆదిలాబాద్ జిల్లా




రుణమాఫీ చేయాలని అడిగే హక్కులేదా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చమని అడిగినందుకు ప్రభుత్వం పోలీసు కేసులు బనాయిస్తున్నది. రైతుగా పుట్టడం మేము చేసుకున్న తప్పా. రుణమాఫీ చేయమని అడిగే హక్కు రైతులకు లేదా? రాజకీయ ఒత్తిళ్లతో మాపై కేసులు బనాయించారు. తమపై ఎవరు ఫిర్యాదు చేశారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారని అడిగితే పోలీసులు సమాధానం చెప్పకుండా ఐదు గంటలకు పైగా నిర్బంధించారు.

- దత్తు, రైతు, రుయ్యాడి గ్రామం, తలమడుగు మండలం, ఆదిలాబాద్

'పోలీస్ హరాస్‌మెంట్.. షాప్ క్లోజ్డ్'

దుకాణం ముందు స్వీట్ హోం నిర్వాహకుల ఫ్లెక్సీ.. షాప్ యజమానిపై కేసు నమోదు



వినాయక్‌నగర్, ఆగస్టు 19: నిజామాబాద్‌లో ఓ మిఠాయి దుకాణం యజమాని పోలీసుల వేధింపులపై వినూత్నంగా నిరసన తెలిపారు. తన దుకాణం ఎదుట 'షాప్ ఈజ్ క్లోజ్‌డ్ డ్యూటూ పోలీస్ హరాస్‌మెంట్' అనే ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ఆదివారం ఫ్లెక్సీ ఏర్పాటుచేసి దుకాణం మూసి ఉండడంతో వినియోగదారులు విస్మయానికి గురయ్యారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌రోడ్డులో ఉన్న ఢిల్లీవాలా స్వీట్‌హోంకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకూడదని పోలీసులు తెలుపడంతో షాపు నిర్వాహకులు పోలీసుల వేధింపుల కారణంగానే షాపును మూసివేస్తున్నట్టు ఆదివారం పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. దుకాణ యజమాని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పోలీసులు సోమవారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

స్పీకర్‌కు మాఫీ

మొదటిపేజీ తరువాయి...

తమ ప్రజాప్రతినిధులకు మాత్రం ఏ మాత్రం ఆలోచించకుండా మాఫీ అమలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ప్రభుత్వం తాండూరు పీఏసీఎస్‌లో ఆయన తీసుకున్న రూ.1.50 లక్షల రుణాన్ని మాఫీ చేసింది. షరతులు పెట్టి జిల్లాలోని సుమారు 80 వేల మంది పేద రైతులకు నష్టం చేసిన ప్రభుత్వం.. స్పీకర్‌కు రుణమాఫీ వర్తింపజేయడంతో జిల్లాలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. తమకు సవాలక్ష కొర్రీలు పెట్టి కోత విధించి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల రుణాలను మాఫీ చేయడంతో జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీసుకున్న రూ.1.50 లక్షల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయడంతో సర్వత్రా విమర్శలు రావడంతో ఆయన అప్రమత్తమైనట్టు తెలిసింది. మాఫీ అయిన సొమ్మును తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్టు సమాచారం.

దళితుడికి ఇయ్యలే

మొదటిపేజీ తరువాయి...

కావాల్సిన రుణమాఫీ పెద్దలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా మదన్‌పల్లికి చెందిన బేగరి బాలయ్య నమస్తే తెలంగాణతో తన ఆవేదనను పంచుకున్నారు. గతంలో తనకున్న నాలుగెకరాలు పెట్టి 75వేలు రుణం తీసుకుంటే.. కేసీఆర్ ప్రభుత్వం ఒక దఫాలో మాఫీ చేసిందని గుర్తు చేశాడు. 2023 ఆగస్టులో వికారాబాద్ కెనరా బ్యాంక్‌లో రూ.1.10 లక్షల రుణాన్ని తీసుకున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షలు మాఫీ చేస్తదని చెప్పడంతో నమ్మి ఓటేశాడు. కాంగ్రెస్ రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించగానే తనకు కూడా మాఫీ అయిదని సంబురపడ్డాడు. రెండో విడతలో లక్షన్నర మాఫీ జాబితాలో తన పేరు ఉంటుందని ఆశించాడు. తీరాపేరు మాయం కావడంతో బ్యాంకులు, అధికారులను సంప్రదించాడు. మూడో విడతలో వస్తదని బ్యాంకు అధికారులు చెప్పిన మాటలు మళ్లీ నమ్మాడు. మూడో విడతలోనూ నిరాశే మిగలడంతో మరోసారి వ్యవసాయ అధికారులను, బ్యాంకులను సంప్రదించాడు. దరఖాస్తు పెట్టుకుంటే నాలుగోవిడతలో వస్తదని చెప్పడంతో విసిగిపోయి ఆగ్రహం వ్యక్తం చేశాడు. మేము ఓటేసిన వారికి రుణమాఫీ ఇచ్చి.. మేమేం పాపం చేశామని మండిపడ్డాడు. పేదోడికి న్యాయం చేయనిది.. ఇదేమి ప్రభుత్వం.. ఇదేమి పాలన అంటూ బేగరి బాలయ్య భగ్గుమన్నాడు.

జిందగీ
ఊపిరి
నమస్తే తెలంగాణ హైదరాబాద్
మంగళవారం 20 ఆగస్టు 2024
www.ntnews.com



సీజనల్ దాడిని.. తిప్పికొడదాం!

వానాకాలం అంటే జల్లులతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. అదే సమయంలో చుట్టూ ఉన్న పరిసరాలు ఎన్నో రకాలైన సూక్ష్మజీవులు పెరగడానికి అనువుగా ఉంటాయి. దీంతో సీజనల్ వ్యాధులు డేంజర్ బెల్స్ మోగిస్తుంటాయి. ప్రత్యేకించి ఈ మధ్య స్వల్ప విరామంతో అడపాదడపా కురుస్తున్న వానలతో దోమల వృద్ధి పెరిగింది. దీంతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా లాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఇక వాతావరణంలో మార్పుల కారణంగా జలుబు, దగ్గు, జ్వరం పీడిస్తున్నాయి. ఏటా సీజనల్ వ్యాధుల దాడి సర్వసాధారణమే. కానీ, చాలామందిలో వీటి గురించి అంతగా అవగాహన లేకపోవడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా రోగాల బారినపడి దవాఖానల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో వానాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి.

సాధారణంగా మనిషి శరీరం ఏదైనా ఒక కాలంలోని వాతావరణ పరిస్థితులకు అలవాటు పడుతుంది. అయితే, ఆ కాలం మారిపోయి కొత్త వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మన శరీరం వెంటనే ఆ మారిన పరిస్థితులకు తట్టుకోదు. దీనివల్ల కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. అంతే కాకుండా వాతావరణ మార్పుల కారణంగా దోమల వంటి కీటకాలు విజృంభించినప్పుడు అవి మనుషులపై దాడి చేయడం వల్ల కూడా వ్యాధులు ప్రబలుతాయి. ఈ విధంగా ఒక నిర్ణీతకాలంలోని వాతావరణ పరిస్థితుల కారణంగా వచ్చే వ్యాధులను సీజనల్ వ్యాధులుగా పరిగణిస్తారు. వీటిలో కొన్ని రకాల వ్యాధులు ఇతర సమయాల్లో కూడా వచ్చే అవకాశం ఉంటుంది. సాధారణంగా వర్షాకాలంలో ఎక్కువగా వాటర్ బొండ బుల్ డిసీజెస్ అంటే నీటివల్ల వచ్చే వ్యాధులు, దోమల్లాంటి కీటకాల వల్ల తలెత్తే వెక్టర్ బొండ బుల్ డిసీజెస్ వస్తాయి. ఇవికాకుండా వాతావరణ పరిస్థితుల వల్ల వైరల్ ఫీవర్స్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వంటివి కూడా పీడిస్తుంటాయి. అయితే, సీజనల్ వ్యాధులు అంత ప్రమాదకరం ఏమీ కాకపోయినా సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోతే అవి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి, సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు.

రాత్రి దోమలు - పగటి దోమలు

సాధారణంగా దోమలను రెండు రకాలుగా పరిగణిస్తారు. ఒకటి రాత్రిపూట కుట్టేవి, రెండు పగటి సమయంలో కుట్టేవి. అనాఫిలిస్, క్యూలెక్స్ రకం దోమలు రాత్రిపూట కుడతాయి. వీటి కారణంగా మలేరియా, ఫైలేరియా (బోదకాలు), మెదడువాపు, లాంటి వ్యాదులు వస్తాయి. మెదడువాపు ఎక్కువగా 5 ఏండ్ల లోపు పిల్లలకు వస్తుంది. దీనికి ప్రధాన కారణం పందులు. అంటే దోమలు పందులకు కుట్టి, ఆ తరువాత మనుషులను కుడితే వారికి మెదడువాపు వస్తుంది. దీనివల్ల పిల్లల్లో మెదడు వాచిపోతుంది. ఫిట్స్ వచ్చి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. కాకపోతే, ఇప్పుడు ఈ వ్యాధి తెలంగాణలో పెద్దగా లేదు.

ఇక 'ఈడిస్ట్ ఈజిప్టై' దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. అంతేకాకుండా ఇతర దోమల్లా ఇవి మురికి నీటిలో ఉండవు. మంచినీటిలో అంటే ఇళ్లలోని పూలకుండీలు, కూలర్‌లు, ఇంటి పరిసరాల్లో నీళ్లు నిలిచిన గుంతలు, పేరుకుపోయిన కొబ్బరినార, రబ్బరుటైర్లు వంటివాటిలో నిల్వ ఉన్న నీటిలో ఈ దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి కుట్టడం వల్ల డెంగీ, చికున్‌గున్యా వస్తాయి. దోమల వల్ల వచ్చే వ్యాధులు అంటువ్యాధులు కావు.



> **ముందు జాగ్రత్తలతో చెక్**
>
> సీజనల్ వ్యాధులను కొన్ని ముందు జాగ్రత్త చర్యల ద్వారా కట్టడి చేయవచ్చు. ముఖ్యంగా దోమల బెడద నుంచి రక్షణ పొందే విధంగా జాగ్రత్తలు పాటించాలి.
> ఇళ్లలో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇళ్లలో పాతసామాన్లు, పడేసిన కొబ్బరిచిప్పలు, రబ్బరు వస్తువులు, టైర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలి. రాత్రుళ్లు దోమలు కుట్టకుండా దోమతెరలు, మస్కిటో రిపెల్లెంట్లు లాంటివి వాడాలి. దీనివల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి విషజ్వరాల బారినుంచి తప్పించుకోవచ్చు. ఇక కలుషిత ఆహారం, కలుషిత నీరుతో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా బయటి ఆహార పదార్థాలు సాధ్యమైనంత వరకు తీసుకోవడం మానేయాలి. ఇలాచేస్తే డయేరియా, టైఫాయిడ్, కామెర్లు మొదలైన వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు.

కలుషిత నీటి కారణంగా...

వానాకాలంలో జలాశయాల్లోకి వరద ద్వారా కొత్తనీరు వచ్చి చేరుతుంది. ఈ క్రమంలో నీరు కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువ. అంతేకాకుండా వర్షకాలంలో వరదల కారణంగా ఇళ్లకు సరఫరా చేసే తాగునీరు కూడా కొన్నిసార్లు కలుషితం కావడానికి ఆస్కారం ఉంది. కలుషిత నీరు తాగినప్పుడు, ఆ నీటితో తయారుచేసిన ఆహార పదార్థాలను తీసుకున్నప్పుడు టైఫాయిడ్, డయేరియా, కామెర్లు, జీర్ణ వ్యవస్థకు సంబంధించిన గ్యాస్ట్రో ఎంటరైటిస్ తదితర వ్యాధులు వస్తాయి. ఇవే కాకుండా హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ కేంద్రాల్లో కల్తీ వస్తువులతో తయారుచేసే ఆహార పదార్థాల వల్ల కూడా జీర్ణవ్యవస్థకు సంబంధించిన వ్యాధులు వస్తాయి.

వైరల్ ఫీవర్స్ లేదా ఫ్లూ

వానాకాలంలో గాలిలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల వైరస్‌లు చురుగ్గా మారుతాయి. వైరస్ అనేది గాలిలో తేలడమే కాకుండా వేగంగా వ్యాప్తి చెందుతుంది. మనం శ్వాస తీసుకున్నప్పుడు ఇది శరీరంలోకి సులువుగా ప్రవేశిస్తుంది. వైరస్‌ల దాడి కారణంగా వచ్చేవే వైరల్ ఫీవర్స్. ఇవి ఇంట్లో ఒకరికి వస్తే మిగిలిన వారికి కూడా సోకుతాయి. అంటే వైరల్ ఫీవర్ అనేది అంటు వ్యాధి. వైరల్ ఇన్ఫెక్షన్ ఉన్న రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు అతని నోటి తుంపర్ల ద్వారా వైరస్ ఇతరులకు సోకుతుంది.

వైరల్ ఫీవర్స్ లక్షణాలు

- జలుబు
- దగ్గు
- జ్వరం
- కొంతమందిలో ఒంటినొప్పులు

చికిత్స: వైరల్ ఫీవర్స్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ ఉండదు. లక్షణాల ఆధారంగా సపోర్టివ్ ట్రీట్‌మెంట్ అందిస్తారు. జ్వరం ఉన్నవారికి జ్వరం తగ్గడానికి, జలుబు, దగ్గు ఉంటే వాటినుంచి ఉపశమనానికి అవసరమైన చికిత్స చేస్తారు.

డెంగీ లక్షణాలు

- తీవ్రమైన జ్వరం
- ఒంటినొప్పులు
- నీరసం
- వాంతులు వచ్చినట్టు అనిపించడం
- పిల్లల్లో ఒంటిపై చిన్నపాటి దద్దుర్లు
- కొంతమందిలో బ్లడ్ ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోతుంది

నిర్ధారణ పరీక్షలు: డెంగీ జ్వరాన్ని ఎన్‌ఎస్1 యాంటిజెన్ పరీక్షల ద్వారా నిర్ధారణ చేయవచ్చు. వారం తరువాత అయితే ఐజీఎం పరీక్ష ద్వారా గుర్తించవచ్చు.

చికిత్స: బీపీ పడిపోకుండా తరచు ద్రవ పదార్థాలు ఇవ్వడం తప్పనిసరి. డెంగీకి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీలేదు. లక్షణాల ఆధారంగా సింప్టమేటిక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. చాలా తక్కువమందికి మాత్రమే ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుంది.

జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా చూసుకోవాలి
- దోమలను తరిమి కొట్టేందుకు ఎలెక్ట్రిక్ బ్యాట్స్ వినియోగించవచ్చు
- మస్కిటో రిపలెంట్ ఓడొమాస్ క్రీమ్ ప్రతి 4-6 గంటలకు శరీరానికి ఒకసారి అప్లై చేసుకోవడం మంచిది
- దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి

మలేరియా లక్షణాలు

- సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో చలిజ్వరం
- నీరసం
- ఆకలి మందగించడం

నిర్ధారణ పరీక్షలు: రాపిడ్ యాంటిజెన్ పరీక్షల ద్వారా మలేరియాను నిర్ధారించవచ్చు.

చికిత్స: యాంటీమలేరియా మాత్రలు 3 రోజులు తీసుకోవాల్సి ఉంటుంది.

చికున్‌గున్యా

డెంగీ కారకమైన ఈడిస్ ఈజిప్టై అనే దోమకాటు వల్లనే చికున్‌గున్యా కూడా వస్తుంది. దీని ప్రధాన లక్షణాలు తీవ్రమైన కీళ్లనొప్పులు, జ్వరం. దీనికి కూడా లక్షణాల ఆధారంగానే చికిత్స ఇస్తారు. చికున్‌గున్యా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కీళ్లనొప్పులు ఎక్కువకాలం ఉండే అవకాశం ఉంటుంది.

టైఫాయిడ్ లక్షణాలు

- జ్వరం
- కడుపులో నొప్పి
- కాలేయం పెరగడం
- వాంతులు

నిర్ధారణ పద్ధతి: బ్లడ్ కల్చర్ టెస్ట్ ద్వారా నిర్ధారిస్తారు

చికిత్స: ఎజిత్రోమైసిన్ మాత్రలు 7 రోజులు లేదా సెఫ్ట్రై ఆగ్జోన్ అనే ఇంజెక్షన్ తీసుకోవాలి.

... మహేశ్వర్‌రావు బండారి



డా॥ కె.శంకర్
ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్
జనగాం ప్రభుత్వ హాస్పిటల్

క్యాన్సర్ గుప్పిట నవతరం

నవతరం జనాభాలో క్యాన్సర్ కేసులు ఇంతలంతలుగా పెరిగిపోతున్నాయి. 1980వ దశకం తర్వాతి తరం క్యాన్సర్ బారినపడటానికి అనేకానేక కారణాలు ఉన్నాయి. ఊబకాయం, నాసిరకం ఆహారం, పర్యావరణ కారకాలు, వ్యాయామం లేకపోవడం, తగినంత నిద్ర లేకపోవడంతో సంబంధం ఉందంటున్నారు నిపుణులు. లాన్సెట్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం నవతరం వారిలో 17 రకాల క్యాన్సర్లు పెరిగిపోతున్నట్టు వెల్లడైంది. ఇక క్యాన్సర్ రావడానికి జన్యుపరమైన, పర్యావరణ పరమైన కారణాలతోపాటు జీవనశైలి కూడా కారణమవుతున్నది. కాబట్టి, ఈ దిశగా మన రోజువారీ అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



బరువు

ఇటీవలి కాలంలో ఊబకాయంతో ముడిపడిన క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. అధిక బరువు కారణంగా పేగు– విసర్జక వ్యవస్థకు సంబంధించిన కొలరెక్టల్, గర్భాశయ లోపలి పొర (ఎండోమెట్రియల్), కిడ్నీ, అన్నవాహిక, క్లోమగ్రంథి, కాలేయం, పిత్తాశయ క్యాన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించి బరువు తగ్గించుకోగలిగితే క్యాన్సర్ ముప్పు కూడా తగ్గుతుంది.

శాకాహార విధానం

గింజలు, పండ్లు, ముతక ధాన్యాలు, టోఫు, చిక్కుళ్లు వంటి మొక్కల నుంచి వచ్చే ఆహారం క్యాన్సర్‌ను ఆమడదూరంలో ఉంచుతుంది. ఓ అధ్యయనం ప్రకారం మొక్కల ఆధారిత ఆహారం క్యాన్సర్ వచ్చే ముప్పును 47 శాతం తగ్గిస్తుందని తేలింది. పండ్లు, కూరగాయలు, గింజలు, ఆలివ్ నూనె వాడకం ద్వారా ప్రొస్టేట్ క్యాన్సర్ ఉన్న పురుషులు వ్యాధి ముదరడాన్ని తగ్గించుకోవచ్చని ఈ అధ్యయనం వెల్లడించింది.

ఎక్కువసేపు కూర్చోవద్దు

రోజులో 10 నుంచి 12 గంటలపాటు ఒకే దగ్గర కూర్చోవడం, తగినంత శారీరక శ్రమ చేయకపోవడం కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతుంది. శారీరకంగా చురుగ్గా ఉండేవారితో పోలిస్తే ఒకే దగ్గర కూర్చుని గడిపేవాళ్లలో క్యాన్సర్‌తో మరణించే ముప్పు 82 శాతం ఎక్కువని ఎండీ ఆండర్సన్ క్యాన్సర్ సెంటర్ తెలిపింది.

ప్రాసెస్డ్ ఆహారం వద్దు

చిప్స్, బర్గర్లు, పిజ్జా, కోలా, సమోసాలు మన జీవితంలో భాగమైపోయాయి. అయితే, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాల్లో చక్కెరలు, సోడియం ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ క్యాలరీలు, తక్కువ పోషకాలు ఉండే ఇలాంటి ఆహారం కారణంగా ఊబకాయం బారినపడతాం. ఇది క్యాన్సర్ ముప్పును పెంచుతుంది.

ఫైబర్ ఎక్కువగా

ఎక్కువ కొవ్వు, తక్కువ ఫైబర్ ఉన్న ఆహారాలు మన ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపుతాయి. పొట్ట (బోవెల్), ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, గర్భాశయం (యూటరైన్) సహా ఎన్నో క్యాన్సర్లకు కారణమవుతాయి. కాబట్టి, ఫైబర్ సమృద్ధిగా ఉండే పండ్లు, కూరగాయలు, గింజలు తినాలి. రోజుకు ఎనిమిది నుంచి పది గ్లాసుల నీళ్లు తాగాలి.

ఎండలో గడపొద్దు

ఎండ ఎక్కువగా ఉండే మధ్యాహ్న వేళలో బయటికి వెళ్లొద్దు. ఈ సమయంలో సూర్యుడి కిరణాల వల్ల అల్ట్రా వయోలెట్ రేడియేషన్‌కు గురవుతాం. ఇది మన చర్మ కణాల్లో ఉండే డీఎన్ఏను ధ్వంసం చేస్తుంది. చర్మ క్యాన్సర్‌కు కారణమవుతుంది. అందువల్ల మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బయటికి వెళ్లాల్సి వస్తే ఎండ పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇంటి తిండే మంచిది

ఇంటి తిండి అయితే మనకు నచ్చినట్టుగా, ఆరోగ్యకరంగా, పరిశుభ్రంగా, తాజాగా చేసుకుంటాం. ఆయుర్వేదం కూడా అప్పుడే వండుకున్న ఆహారం తింటే మంచిదని చెబుతున్నది. ఇంటి వంటలోనూ క్యాలరీలు తక్కువ, ఫైబర్, ప్రొటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. క్యాన్సర్ సహా ఎన్నో రోగాలు ఇంటి భోజనంతో పరారవుతాయి.

ముప్పయ్ దాటాక.. ముప్పు రాకుండా


వయసు పెరిగే కొద్దీ శరీరం పట్టు తప్పుతుంటుంది. రకరకాల అనారోగ్యాలు చేరువవుతుంటాయి. వీటిలో మహిళలకు మొదటి శత్రువు ఆస్టియోపొరోసిస్. అంటే ఎముకలు గుల్లబారే జబ్బు. బోలు ఎముకలు పుటుక్కున విరిగితే మంచానికే పరిమితం కావాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ఇలాంటి బాధలు తలెత్తవద్దంటే.. 30 ఏండ్లు దాటిన మహిళలు ఎముకలను కాపాడుకోవడంపై దృష్టి సారించాలని వైద్యులు సూచిస్తున్నారు. మహిళల వయసు మెనోపాజ్‌కు చేరువయ్యే కొద్దీ.. వారిలో ఈస్ట్రోజన్ తగ్గుతూ ఉంటుంది.



ఈస్ట్రోజన్ ఎముకల సాంద్రతను నియంత్రించడంలో ముఖ్యమైన హార్మోన్. కాబట్టి హార్మోన్ సమస్యలు, పీరియడ్స్ సమస్యలు వస్తున్నాయంటే ఎముకల్ని కాచుకోవాల్సిన అవసరం వచ్చిందని జాగ్రత్తపడాలి. ఆహార విధానంలో మార్పులు చేసుకుంటే సమస్యను నియంత్రించవచ్చు. అందుకే ముప్పై దాటిన మహిళలు వాకింగ్, జాగింగ్, రన్నింగ్, డ్యాన్స్, యోగా.. ఏదో ఒకటి రెగ్యులర్‌గా చేయాలని నిపుణుల మాట. జిమ్‌లో వర్కవుట్స్ అయితే మరీ మంచిది. ప్రతిరోజూ 30 నిమిషాల శారీరక వ్యాయామం చేయాలి. రోజువారీ ఆహారంలో అధిక పోషకాలు ఉండేలా జాగ్రత్తపడాలి. పని ఒత్తిడి ఎంత ఉన్నప్పటికీ రోజుకు కనీసం గంటపాటైనా నడక సాగిస్తే మరీ మంచిది. అవకాశం ఉంటే ఏరోబిక్స్, జుంబా డ్యాన్స్ లాంటి మార్గాలను ఎంచుకుంటే.. మీ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

హిమోగ్లోబిన్ ఎక్కువైనా కష్టమే

శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయులు పరిమితికి మించి ఉంటే గుండెపోటు, పక్షవాతం, రక్తంలో గడ్డలు లాంటి వాటి ముప్పు పెరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎముక మూలుగలో అసాధారణ పరిస్థితుల కారణంగా రక్తంలో ఎర్ర రక్తకణాలు పెరిగిపోతాయి. దీన్ని పాలిసైథీమియా అని పిలుస్తారు. ఇలా ఎక్కువైన ఎర్ర రక్తకణాలు రక్తాన్ని మందంగా చేస్తాయి. దీంతో రక్త ప్రవాహం నెమ్మదిస్తుంది. ఇది రక్తంలో అవరోధాలు (బ్లడ్ క్లాట్స్) లాంటి తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. ఎముక మూలుగలో విపరీత పరిస్థితులు మాత్రమే కాకుండా, ధూమపానం లాంటి దుర్వ్యసనాలు, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, ఎక్కువ కాలంపాటు ఎత్తయిన ప్రదేశాల్లో నివాసం ఉండటం లాంటివి కూడా పాలిసైథీమియాకు దారితీస్తాయి. ఒక డెసీలీటర్ రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు పురుషుల్లో అయితే 16.5 గ్రాములు, స్త్రీలలో అయితే 16 గ్రాములకు మించితే అసాధారణంగా పరిగణిస్తారు. పాలిసైథీమియా లక్షణాలను గుర్తించలేం. కాబట్టి, రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు పెరిగిపోవడాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్యుల సాయం తీసుకోవాలి. లేకుంటే, ఇది బ్లడ్ క్లాటింగ్‌తోపాటు గుండెపోటు, కాళ్లు, ఉదర భాగం (అబ్డామెన్)లో రక్తం ప్రవాహంలో అవరోధాలకు దారితీస్తుంది. ఇక రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి ఎక్కువగా ఉన్నట్టు తేలితే, మరిన్ని వివరాలు, చికిత్స గురించి హెమటాలజిస్టును సంప్రదించాలి. కాగా పాలిసైథీమియా సమస్య తలెత్తినప్పుడు నిద్రలో శ్వాస సరిగ్గా ఆడని పరిస్థితి అయిన స్లీప్ ఏప్నియాతోపాటు గుండె, ఊపిరితిత్తుల సమస్యలు కూడా చుట్టుముట్టొచ్చు.



తగినంత వెలుగుంటే..

మన జీవితంలో కాంతి విడదీయలేని భాగం. వస్తువులను చూడటానికి ఉపయోగపడే కాంతి ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తుంది. ఇక కాంతి సహజమైనా, కృత్రిమమైనా అది మన శారీరక, మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. అయితే, ఆధునిక జీవితాల్లో సహజ కాంతి కంటే కృత్రిమ కాంతి ఆధిపత్యం చెలాయిస్తున్నది. ఫలితంగా నడివయసులోనే ఎందరో రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యం విషయంలో కాంతి ప్రభావాన్ని అర్థం చేసుకుంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరికినట్టే!

మన రోజువారీ జీవితాన్ని క్రమబద్ధీకరించడంలో సహజ కాంతిది కీలకపాత్ర. నిద్రించడం, మేల్కొనడం, హార్మోన్ల విడుదల, ఇతర శారీరక విధులను సూర్యకాంతి ప్రభావితం చేస్తుంది. పగటి వేళ సహజ కాంతిలో గడపడం వల్ల రోజువారీ జీవితం ఆరోగ్యకరంగా సాగిపోతుంది. శరీరం మీద తగినంత సూర్యకాంతి పడకపోతే విటమిన్ డి లోపం తలెత్తుతుంది. దీంతో ఆస్టియోపొరోసిస్, రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా స్పందించడం, కుంగుబాటు లాంటి సమస్యలు చుట్టుముడతాయి. సూర్యకాంతి మన శరీరంలో మూడ్‌ను క్రమబద్ధీకరించి, ఆనందాన్ని అనుభూతి చెందించే సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. అందుకే సీజనల్ అఫెక్టివ్ డిజార్డర్ (ఎస్ఏడీ), ఇతర కుంగుబాటు రూపాల చికిత్సలో భాగంగా సహజకాంతిలో గడపాలని డాక్టర్లు సూచిస్తారు. అంతేకాదు సహజకాంతి పిల్లలు, యువతలో హ్రస్వదృష్టి (మయోపియా) ముప్పును తగ్గిస్తుంది. పైగా సహజకాంతిలో గడిపితే మయోపియా మరింత ముదరకుండా అడ్డుకట్టపడుతుంది.



కృత్రిమ కాంతి


ఆధునిక జీవితాల్లో ఎంతగా అవసరమైనప్పటికీ సుదీర్ఘకాలంపాటు కృత్రిమమైన కాంతిలో గడిపితే ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుంది. డిజిటల్ తెరల నుంచి వచ్చే బ్లూలైట్, ఎల్ఈడీ బల్బులు, ఇతర బల్బులు కృత్రిమ కాంతి వనరులు. ఇవి మన జీవ గడియార క్రమాన్ని దెబ్బతీస్తాయి. ఇది నిద్రకు కారణమైన మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని అణచిపెడుతుంది. దీంతో నిద్ర పట్టకపోవడం, నాణ్యత తగ్గిపోవడం, నిద్రకు సంబంధించిన ఇతర రుగ్మతలు తలెత్తుతాయి. ఎక్కువసేపు కృత్రిమకాంతిలో గడిపితే కండ్ల మీద ఒత్తిడి పడుతుంది. కండ్లలో ఇబ్బందులు వస్తాయి. పొడిబారుతాయి. దీన్ని కంప్యూటర్ విజన్ సిండ్రోంగా వ్యవహరిస్తారు. రాత్రివేళల్లో కృత్రిమ కాంతిలో ఎక్కువసేపు గడిపితే దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఊబకాయం, గుండె రక్తనాళాల రుగ్మతలు, కొన్ని రకాలైన క్యాన్సర్ల ముప్పు పెరుగుదలకు కృత్రిమ కాంతికి సంబంధం ఉందని కొన్ని అధ్యయనాలు పేర్కొన్నాయి. జీవ గడియార క్రమం, నిద్రా చక్రం దెబ్బతినడం వల్ల ఈ ప్రమాదాలు తలెత్తుతాయని పరిశోధకులు భావిస్తున్నారు. సహజకాంతి పడకపోవడం, ఎక్కువసేపు కృత్రిమకాంతిలో ఉండటం మానసిక ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. భావోద్వేగాల్లో ఇబ్బందులు, ఒత్తిడి స్థాయులు పెరగడం, కుంగుబాటు, ఆందోళనకు కూడా అవకాశం ఉంది.

మంత్రి సురేఖ బర్త్‌డే వేడుకల్లో ఏసీపీ


మంత్రి కొండా సురేఖ బర్త్ డే వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

- కార్యకర్తలతో కలిసి సంబురాలు
- అనుచరుల అత్యుత్సాహం.. జనాల మధ్యే పటాకుల మోత
- ఓ బాలిక, ముగ్గురికి గాయాలు
- ఎంజీఎం దవాఖానకు తరలింపు

కాశీబుగ్గ, ఆగస్టు19: అది ప్రధాన రోడ్డు.. ఎటు చూసినా జనసందోహం నడుమ ఎలాంటి అనుమతి లేకుండా మంత్రి బర్త్‌డే వేడుకలు నిర్వహించారు. ఇందులో స్వయంగా ఓ ఏసీపీ, సీఐ, సిబ్బంది సైతం పాల్గొనడంతో ఇక 'అనుచరులు' అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇష్టం వచ్చినట్టు పటాకులు పేల్చడంతో ఏ సంబంధం లేని నలుగురు బాటసారులు గాయపడ్డారు. గ్రేటర్ వరంగల్‌లోని కాశీబుగ్గ ప్రధాన రోడ్డుపై సోమవారం నిర్వహించిన మంత్రి కొండా సురేఖ బర్త్‌డే వేడుకల్లో ఈ ఘటన జరిగింది. మంత్రి ముఖ్య అనుచరుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టగా కార్యకర్తల అత్యుత్సాహం బాటసారుల ప్రాణాలమీదికి తెచ్చింది. వారు పేల్చిన పటాకులతో దారిన వెళ్లే బాలిక హరిణి, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇంతెజార్ గంజ్ సీఐ మచ్చ శివకుమార్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, పోలీసు సిబ్బంది కూడా హాజరై కేక్‌కట్ చేసి చీరెలు పంపిణీ చేయడం చర్చనీయాంశమైంది. అసలే రాఖీ పౌర్ణమి కావడంతో రద్దీగా ఉన్న రోడ్డుపై పెద్ద ఎత్తున పటాకులు కాల్చడంతో ఈ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. రోడ్డుపై వెళ్తున్నవారంతా చెల్లాచెదురయ్యారు.


హరిణి కాలికి అయిన గాయం

వీరిలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఇంజపురి యాదగిరి కూతురు హరిణి తీవ్రంగా గాయపడింది. కాశీబుగ్గ సాగర్ హోటల్ జంక్షన్‌లో ఉండే తన పెద్ద నాన్న కొడుకుకు రాఖీలు కట్టేందుకు వచ్చిన హరిణి గాయాలపాలై రోడ్డు పైనే విలవిల్లాడుతుంటే అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. బాటసారులు, బంధువులే కలిసి బాధితులను ఎంజీఎం వైద్యశాలకు తరలించారు. జంక్షన్ నుంచి కాశీబుగ్గకు వెళ్లే రోడ్డును బ్లాక్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గంటల కొద్దీ ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. పండుగ రోజు ఇలా రోడ్డు బ్లాక్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఏమిటని స్థానికుల్లో అసహనం వ్యక్తమైంది. ఈ విషయం తెలిసి బాలికకు మెరుగైన వైద్యం అందిస్తామని, నయమయ్యేదాకా ఖర్చులు భరిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

రాఖీ కట్టడానికి వెళ్లి వృద్ధురాలి మృతి


చిన్నమ్మ

లక్ష్మణచాంద, ఆగస్టు 19: సోదరుడికి రాఖీ కట్టడానికి వెళ్లి ఓ వృద్ధురాలు మృత్యువాత పడింది. ఈ ఘటన సోమవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వడ్యాల్‌కు చెందిన రాల్లబండి చిన్నమ్మ(70) ఖానాపూర్ మండలం దిల్వార్‌పూర్‌లో ఉంటున్న సోదరుడు రసమల్ల బద్దయ్యకు రాఖీ కట్టడానికి ఆదివారం వెళ్లింది. సోమవారం ఉదయం గ్రామంలోని కాలువ సమీపంలో ప్రమాదవశత్తు కాలుజారి కాలువలో పడిపోయింది. బంధువులు వెతకగా కాలువలో ఆమె మృతదేహం లభించింది. ఆమె కుమారుడు ముత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపారు.

గుండెపోటుతో అన్న మృతి

గుండెలు పగిలేలా రోదించిన అక్కాచెల్లెళ్లు


దశరథ్(ఫైల్)

నర్సాపూర్, ఆగస్ట్19: రాఖీ కడుదామని బయలుదేరిన అక్కాచెల్లెళ్లు సోదరుడి మరణవార్త విని గుండెలవిసేలా రోదించారు. సోమవారం మెదక్ జిల్లా కాగజ్‌మద్దూర్‌లో రాఖీ పండుగ పూట విషాదం నిండింది. గ్రామానికి చెందిన బోగ దశరథ్ (50)కు ముగ్గురు అక్కలు, చెల్లెలు ఉన్నారు. వారు దశరథ్‌కు రాఖీ కడుదామని ఉదయమే బయలుదేరారు. ఇంతలోనే దశరథ్ గుండెపోటుతో మృతి చెందాడని తెలిసి ఆ అక్కాచెల్లెళ్లు గుండెలు పగిలేలా రోదించారు. బీఆర్‌ఎస్ నర్సాపూర్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు దశరథ్ సోదరుడు.

- గురుకులంలో రాఖీ గోస



గురుకులాల్లో రక్షాబంధన్‌కు సెలవు ఇవ్వలేదు. సోమవారం రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది కర్కశత్వంగా వ్యవహరించారు. తోబుట్టువులతో రాఖీలు కట్టిద్దామని పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులను సిబ్బంది అనుమతించలేదు. గంటల తరబడి వేచి చూసి కొంతమంది తిరిగి వెళ్లారు. ఇంకొంతమంది కిటికీలోంచి రాఖీ కట్టించుకున్నారు. ప్రిన్సిపాల్ పద్మ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహించారు. చివరకు చేసేదేమీ లేక సిబ్బంది గేటు తీశారు. – సిరిసిల్ల రూరల్

- చెట్లకు రాఖీలు కట్టి.. పర్యావరణ హితం చాటి



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రేమికురాలు బ్లెస్సీ కాగితాలతో సుమారు వంద రాఖీలను తయారు చేసి, రక్షా బంధన్ వేళ చెట్లకు కట్టి తన అనుబంధాన్ని చాటుకున్నది. సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి ప్రకాశ్ కూతురు బ్లెస్సీ ఐదేండ్లుగా చెట్లకు రాఖీలు కడుతుండడాన్ని పలువురు అభినందిస్తున్నారు. –కోనరావుపేట


కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో వైద్య విద్యార్థిని, నర్సింగ్ ఆఫీసర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఈ 'రాఖీ' వైద్య విద్యార్థిని, నర్సింగ్ ఆఫీసర్‌కు అంకితం

పండుగ జరుపుకోని కరీంనగర్ దవాఖాన నర్సింగ్ సూపరింటెండెంట్

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 19: రాఖీ అంటేనే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లకు ప్రేమతో కూడుకున్న పెద్ద పండుగ. తన సోదరులకు రాఖీ కట్టాల్సిన ఆ అధికారిణి ఈరోజు సమాజంలో జరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ పండుగ జరుపుకోలేదు. ఆమెది పెద్ద కుటుంబం. చాలా మంది అన్నాదమ్ముళ్లు ఉన్నారు. అయినప్పటికీ రెండు నెలల వ్యవధిలోనే ఒక నర్సింగ్ ఆఫీసర్, ఒక వైద్యురాలిపై అత్యాచార ఘటనలు తనను కలిసి వేసిందని, ఈ రోజు రాఖీ పండుగ జరుపుకోకుండా వారికి అంకితం ఇస్తున్నానని వెల్లడించారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో నర్సింగ్ సూపరింటెండెంట్(గ్రేడ్–2)గా పనిచేస్తున్న పోగుల శోభ అత్యాచార ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని, నర్సింగ్ ఆఫీసర్ చిత్ర పటాలకు దవాఖానలోని తన చాంబర్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ నవీన,డాక్టర్ రవిప్రవీణ్‌రెడ్డి,డాక్టర్ అశోక్, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల, ఏడీ షమీం సిబ్బంది పాల్గొన్నారు.

అప్పట్లో రోజుకు 26 గంటలు!

చైనా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

బీజింగ్, ఆగస్టు 19: రోజుకు ఎన్ని గంటలు అంటే ఠక్కున 24 గంటలు అని చిన్న పిల్లలు సైతం చెప్పేస్తారు. కానీ, ఒకప్పుడు ఈ లెక్క వేరేలా ఉండేదట. అవును, కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజుకు 26 గంటలు ఉండేవట. చైనాలోని చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. భూగ్రహం చరిత్రలోని నిర్దిష్టమైన రెండు కాలాల్లో చంద్రుడు భూమికి దూరం జరిగాడని, ఫలితంగా భూమిపై చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి తగ్గిందని పరిశోధకులు తేల్చారు. చంద్రుడి గురుత్వాకర్షణ భూభ్రమణంపై ప్రభావం చూపుతుందని, ఈ శక్తి తగ్గడం వల్ల భూభ్రమణ వేగం రెండు గంటల మేర పెరిగిందని తెలిపారు. దాదాపు 200 నుంచి 700 మిలియన్ సంవత్సరాల నాటివిగా భావిస్తున్న టైడలైట్స్ అనే రాతిపొరలను అధ్యయనం చేసి ఈ విషయాన్ని గుర్తించినట్టు పరిశోధకులు చెప్పారు. 500 మిలియన్ ఏండ్ల నుంచి 650 మిలియన్ ఏండ్ల మధ్య సంభవించిన కేంబ్రియన్ పేలుడు, 280 మిలియన్ సంవత్సరాల నుంచి 340 మిలియన్ సంవత్సరాల మధ్య జరిగిన మరో పేలుడు వల్లనే రోజు నిడివి పెరిగిందని వీరు పేర్కొన్నారు.

మేఘా కోసం తొండాట

సుంకిశాల ఘటనపై వెలుగులోకి సరికొత్త వాస్తవాలు

- చిన్న సంఘటన కావటంతోనే బయటికి రాలేదన్న మంత్రులు
- ఈ నెల 7న తమ దృష్టికి వచ్చిందని జీవోలో చెప్పిన ప్రభుత్వం
- కానీ, సంఘటన జరిగిన వెంటనే ఖైరతాబాద్ ఆఫీస్‌కు ఫోన్
- అసెంబ్లీ జరుగుతుండగానే జలమండలి అధికారులకు సమాచారం
- నేటిదాకా మేఘా ఇంజినీరింగ్‌పై కించిత్తు చర్యలు తీసుకోని సర్కారు



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఎంత దాచాలని ప్రయత్నించినా, కాస్త ఆలస్యమైనా దావానలంలా వ్యాపిస్తుంది. సుంకిశాల ఘటనపై అదే జరిగింది. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల వ్యధిలోనే జలమండలి ఉన్నతాధికారుల ఫోన్లు మోగాయి. కిందిస్థాయి ఇంజినీర్లు, ఏజెన్సీకి చెందిన ఇంజినీర్లు కూడా జరిగిన ఘటనను వివరించారు. కానీ ఆ వాస్తవాల్ని అక్కడే జలసమాధి చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు చివరి రోజు జరుగుతున్న సమయంలోనే ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయానికి ఈ సమాచారం వచ్చింది. అయినా.. 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చేవరకు ఎందుకు గోప్యత పాటించారు? బయటికి వచ్చినరోజు జలమండలి ఉన్నతాధికారులు ఇచ్చిన అధికారిక వివరణలోనూ ఎప్పుడు తమ దృష్టికి వచ్చిందనే అంశాన్ని ఎందుకు పొందుపరచలేదు? దీన్ని గోప్యంగా ఉంచడం వల్ల ఎవరికి ప్రయోజనం? ఎవరిని కాపాడే ప్రయత్నం? ప్రస్తుతం ఇంజినీరింగ్ వర్గాల మధ్య జరుగుతున్న చర్చ ఇదే. ఈ నేపథ్యంలో మేఘా ఇంజినీరింగ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం.. ఘటన తర్వాత చోటుచేసుకున్న కొన్ని ఆసక్తికరమైన పరిణామాలు ఇప్పుడు నెమ్మదిగా బయటికొస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తున్నది.

నల్లగొండ జిల్లాలోని సుంకిశాల వద్ద జరుగుతున్న జలమండలి పనుల్లో ఒక్కసారిగా రిటెయినింగ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలిన ఘటనపై రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తున్నది. దీనిపై ప్రభుత్వం గోప్యత పాటించటంపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో అసలు అప్పటి వరకు తమ దృష్టికే రాలేదని ప్రభుత్వమే చేతులెత్తేసిన విషయం తెలిసిందే. కారణాలు ఏవైనా.. సుంకిశాల వద్దే ఆ సమాచారం నిలిచిపోయింది తప్ప బయటికి రాలేదనే రీతిలో అటు మంత్రులు, ఇటు పురపాలకశాఖ ఉన్నతాధికారులు తమ ప్రకటనల్లో స్పష్టంచేశారు. వాస్తవానికి ప్రమాదం జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయానికి సమాచారం వచ్చినట్టు తాజాగా తెలిసింది. అంతేకాదు.. ఒకవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జలమండలి ఉన్నతాధికారులకు ఫోన్లలో పూసగుచ్చినట్టుగా ఘటన వివరాలు అందాయని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పాటు 3 రోజుల వ్యవధిలోనే లిఖితపూర్వకంగా కూడా సమాచారం వచ్చింది. అయినా.. విషయం బయటికి పొక్కకుండా శాయశక్తులా ప్రయత్నించారు.

లేఖను తిరస్కరించిన పైఅధికారులు

సుంకిశాల ఘటన జరిగిన సమయంలో సైట్ వద్ద వాస్తవానికి జలమండలి ఇంజినీర్లు లేరు. జలమండలి ఈ నెల 8న ఇచ్చిన వివరణలోనూ ఇదే అంశాన్ని పేర్కొన్నది. కానీ ఘటన జరిగిన వెంటనే మేఘా ఇంజినీరింగ్ సంస్థ ఇంజినీర్లు జలమండలి ఇంజినీర్లకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సుంకిశాల పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే (ఎగ్జిక్యూట్ చేసే) ఇంజినీర్ వెంటనే తన పైఅధికారులకు ఫోన్ చేసిన చెప్పారు. అంతేకాదు.. లిఖితపూర్వకంగా లేఖను ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఆపైఅధికారుల ఆదేశాల మేరకు దాన్ని తిరస్కరించినట్టు ఇంజినీరింగ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దనే మౌఖిక ఆదేశాలు రావటంతో అందరూ మిన్నకుండిపోయారు. జలమండలి ఉన్నతాధికారులకు ఈ సమాచారం తెలిసినపుడు అసెంబ్లీ బడ్జెట్ సమావేశం కొనసాగుతుండటం గమనార్హం. అయితే క్షేత్రస్థాయి ఇంజినీర్ మాత్రం పైఅధికారులకు చెప్పినా ఎందుకు గోప్యంగా ఉంచాలని అన్నదానిపై అనుమానం కలిగింది. మున్ముందు ఇది తనకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతో ఏం చేయాలనే దానిపై తర్జనభర్జన పడినట్టు తెలిసింది. చివరకు ముందుచూపుతో ఈ నెల 5న (ఘటన జరిగిన మూడు రోజులకు) లిఖితపూర్వకంగా తన పైఅధికారికి స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. స్పీడ్ పోస్టు కావటంతో అదేరోజు సదరు పైఅధికారికి అది చేరింది. శాఖాపరంగా ఒక ఇంజినీర్ తన పైఇంజినీర్‌కు మాత్రమే (త్రూ ప్రాపర్ చానెల్) లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అలా కాదని నేరుగా ఉన్నతాధికారులకు ఇవ్వడానికి వీలుండదు. దీంతో ఆ లేఖను డిప్యూటీ జీఎం స్థాయిలోనే నిలిపివేశారు.

ఆ లేఖలో ఉన్నది ఇదే..

అడిక్‌మెట్ ప్రాజెక్టు డివిజన్–3కి సంబంధించిన జనరల్ మేనేజర్‌కు ఈ నెల 5న వచ్చిన లిఖితపూర్వక నివేదికలో ఆ రోజు ఏం జరిగిందనే వివరాలు స్పష్టంగా ఉన్నాయి. 'ఈ నెల 2న ఉదయం 6.10 గంటలకు బ్లాక్–3, 4లోని ఎక్స్‌పాన్షన్ జాయింట్ వద్ద చిన్న సీపేజీ రావటం మొదలైంది. మేఘా ఇంజినీరింగ్‌కు చెందిన నైట్‌డ్యూటీ సూపర్‌వైజర్ జగదీశ్ దీన్ని గమనించి, వెంటనే అప్రమత్తమయ్యారు. సిబ్బంది, కార్మికులు, యంత్రాలను ఇన్‌టేక్ వెల్ నుంచి బయటికి తీసుకువచ్చారు. సీపేజీ ఒక్కసారిగా ఉధృతమై సొరంగంపై దక్షిణం వైపు రిటెయినింగ్ వాల్‌తో పాటు కౌంటర్ ఫోర్ట్ వాల్‌ను తన్నుకొచ్చి పంపుహౌజ్ జలదిగ్బంధమైంది. సాయంత్రం వరకు ఏ ఒక్కరూ గల్లంతు కాలేదనే సమాచారాన్ని మేఘా ఇంజినీరింగ్‌కు చెందిన ప్రాజెక్టు మేనేజర్ నర్సిరెడ్డితో మాట్లాడి ధ్రువీకరించుకున్నాం. తదుపరి చర్యల కోసం సమాచార నిమిత్తం ఇది పంపుతున్నాం' అని అందులో స్పష్టంగా ఉన్నది.

గోప్యతతో ఎవరికి ప్రయోజనం?

సుంకిశాల ఘటన తర్వాత జలమండలిలో ప్రకంపనలు రేగాయి. ప్రభుత్వం నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేయటంతో పాటు డైరెక్టర్‌ను బదిలీ చేసింది. దీనిపై జలమండలి ఇంజినీరింగ్ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. కిందిస్థాయి వారిని బలి చేస్తారా? అంటూ వాట్సాప్ గ్రూప్‌ల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల వరకు సమాచారం వెళ్లినా కిందిస్థాయి వారిని బాధ్యులు చేయటం ఎంతవరకు సమంజసమని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సస్పెండ్ అయిన ఇంజినీర్ల సంజాయిషీ సంతృప్తికరంగా లేదని ప్రభుత్వం పేర్కొన్నది. మేఘా ఇంజినీరింగ్‌కు కూడా షోకాజ్ నోటీసు ఇవ్వగా, తామే బాధ్యులమని లిఖితపూర్వకంగా అంగీకరించింది. కానీ ఇప్పటివరకు ఏజెన్సీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘటన వల్ల మేఘా ఇంజినీరింగ్‌పై ఒక మచ్చ పడింది. రూ.కోట్ల నష్టాన్ని కూడా భరించాల్సి ఉన్నది. కానీ 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకురాకపోతే సదరు ఏజెన్సీపై ఎలాంటి రిమార్కు ఉండేది కాదు. అకస్మాత్తు వరదతో పంపుహౌజ్‌లోకి నీళ్లు వచ్చాయంటూ దాని పునరుద్ధరణకు సర్కారు ఖజానా నుంచి రూ.కోట్ల బిల్లులు దండుకొనేవారు. ఇన్నిరోజులు ఉద్దేశపూర్వకంగా గోప్యత పాటించడం వెనక మేఘా ఇంజినీరింగ్‌ను కాపాడే ప్రయత్నం జరిగినట్టు రూఢీ అయ్యిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డీఎస్సీ పరీక్ష పేపర్ లీక్?

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన ప్రశ్నపత్రంలో వచ్చిన ప్రశ్నలు.. జూలై 23న నిర్వహించిన రెండో సెషన్‌లోనూ రిపీట్ అయ్యాయి. విచిత్రమేమంటే ప్రశ్న నంబర్ కూడా మారలేదు. రెండు పేపర్లలోనూ ఒకే నంబర్ ఇవ్వడం గమనార్హం. ఇక ప్రశ్నలు అచ్చుగుద్దినట్టుగా ఉండగా, ఆప్షన్లు సైతం ఒకే రకంగా వచ్చాయి. సహజంగా పరీక్షకు ముందే ప్రశ్నలు బయటికొచ్చినా.. పేపర్ బయటికొచ్చినా లీకేజీగా పరిగణిస్తారు. పరీక్ష ప్రారంభమయ్యాక బయటికొస్తే పేపర్ ఔట్‌గా పరిగణిస్తారు. 23న పరీక్ష ప్రారంభానికి ముందే 18 ప్రశ్నలు బయటకు వచ్చాయంటే దీనిని పేపర్ లీకేజీగా పరిగణించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, పోటీ పరీక్షల శిక్షకులు వెంటనే ఆన్‌లైన్‌లో, యూట్యూబ్‌లో కీ పేపర్‌ను ఇచ్చారు. కొన్ని ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానాలను ఆన్‌లైన్‌లో బయటపెట్టారు. 19న సైతం ఇలాగే పలు ప్రశ్నలకు ఆన్సర్లు బయటపెడితే, వాటిని చూసిన వారు 23న పరీక్షకు హాజరైతే వారికి లాభం చేకూరే అవకాశం ఉన్నదని కొందరు అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది పేపర్ లీకేజీయేనని అభిప్రాయపడుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం!

సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డియే విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన పరీక్షల్లో ఇంత పెద్ద తప్పిదం చోటుచేసుకోవడం సీఎం వైఫల్యమేనని అభివర్ణిస్తున్నారు. గతంలో ఎస్సెస్సీ పరీక్షల సమయంలో పరీక్ష ప్రారంభమైన తర్వాత ప్రశ్నపత్రం బయటకు రాగా అప్పట్లో కాంగ్రెస్ నేతలు పేపర్ లీకు అంటూ హడావుడి చేశా రు. ఇప్పుడు 23న వచ్చిన ప్రశ్నలు 19వ తేదీనే బయటికొచ్చాయి. దీనిని పేపర్ లీకేజీగా భావించి డీఎస్సీ పరీక్షలను రద్దు చేయాలని, ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల పాత్రపైనా అనుమానాలు

ప్రశ్నల పునరావృతం వెనుక పెద్ద కుట్ర ఉన్నట్టుగా అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. దీని వెనుక కొందరు అధికారుల పాత్ర ఉన్నదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ పరీక్షలను 26 ప్రశ్నపత్రాలను రూపొందించారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ నిపుణులతో కాన్ఫిడెన్షియల్ బృందాన్ని నియమించి రహస్యంగా ప్రశ్నపత్రాలను రూపొందించినట్టు అధికారులు ప్రకటించుకున్నారు. పలు ఆరోపణలు, తప్పిదాలకు కారణమైన, బాధ్యులైన ఎస్సీఈఆర్టీకే డీఎస్సీ ప్రశ్నపత్రాల రూపకల్పన బాధ్యతలు అప్పగించడంలో అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారు.. దర్యాప్తు సం స్థల విచారణ ఎదుర్కొన్న వారికి ప్రశ్నపత్రాల రూపకల్పన బాధ్యతలు ఎలా అప్పగిస్తారని, దీని వెనుక ఏదో గూడుపుఠాని ఉన్నదని, దర్యాప్తు సంస్థలచేత విచారణ జరిపించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అణచివేతపైనే శ్రద్ధ

డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు నెల రోజులపాటు రోడ్డెక్కారు. టెట్‌కు డీఎస్సీకి మధ్య వ్యవధి తక్కువగా ఉండగా, గ్రూప్–2 పరీక్ష ఆగస్టులోనే ఉండటంతో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు. ర్యాలీ నిర్వహించారు. పలువురు మహిళా అభ్యర్థులు కన్నీటిపర్యంతమవుతూ వీడియోలను విడుదల చేశారు. కానీ ఈ ఆందోళనలను లైట్‌గా తీసుకున్న రేవంత్‌సర్కారు తీవ్రంగా అణిచివేసింది.

తప్పిదాల మీద తప్పిదాలు

రేవంత్‌సర్కారు అవగాహన లేమితో చేసిన అనేక తప్పిదాలు వెలుగుచూశాయి. తొలుత టెట్ నిర్వహించకుండా డీఎస్సీ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేయడం, అభ్యర్థుల ఆందోళనలతో డీఎస్సీ పరీక్షలను వాయిదావేసి, టెట్‌ను నిర్వహించింది. పోటీ పరీక్షల అభ్యర్థుల నుంచి రూపాయి ఫీజుగా తీసుకోబోమని చెప్పి టెట్ పేపర్‌కు 1,000, రెండు పేపర్లకు 2,000 ఫీజుగా తీసుకోగా, తీవ్ర వ్యతిరేకత రావడంతో డీఎస్సీ పరీక్షల దరఖాస్తు సమయంలో ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. ప్రశ్నపత్రాల కూర్పులో వైఫల్యం చెందడం సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది.

జూలై 19న ఎస్జీటీ పేపర్‌లో మొదటి షిఫ్ట్‌లో ప్రశ్నలు

- ప్రశ్న సంఖ్య 111 – పీయూష గ్రంథిచే స్రవించబడే హార్మోన్‌ను గుర్తించండి
- ప్రశ్న సంఖ్య 113– పటంలో గోధుమ/మట్టి రంగు భూ అచ్ఛాదన ఈ భూ వినియోగాన్ని తెలియజేస్తుంది.
- ప్రశ్న సంఖ్య 114 – తెలంగాణలో చాలా ప్రాంతాలు సగటు సముద్ర మట్టానికి ఎగువన దాదాపు ఈ ఎత్తులో ఉంటాయి.
- ప్రశ్న సంఖ్య 115 – ఇచ్చిన ఉష్ణోగ్రతలను (12, 18, 0, -4 మరియు 25 సెల్సియస్ డిగ్రీలను ఆరోహణ క్రమంలో అమర్చగా వచ్చిన సరైన క్రమం.
- ప్రశ్న సంఖ్య 116 – ఎస్కిమోలు మొట్టమొదట చూసిన యూరోపియన్లు
- ప్రశ్న సంఖ్య 117 – భారతదేశంలోని ఈకింది రాష్ట్రాలను వాటి జనాభా ప్రకారం అవరోహణ క్రమంలో అమర్చండి
- ప్రశ్న సంఖ్య 118 – యూరఫ్ ఖండానికి దక్షిణ సరిహద్దు అయిన కాకేసియన్ పర్వతాలు వీటి మధ్య ఉన్నవి
- ప్రశ్న సంఖ్య 119 – పట్టణ ప్రజల జీవితాలను వివరిస్తూ శూద్రకుడు రచించిన ఆసక్తికరమైన నాటకం.
- ప్రశ్న సంఖ్య 120 – ప్రస్తుతం కుతుబ్‌మినార్ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రసిద్ధ మెహ్రౌలీ ఇనుప స్తంభాన్ని ఏర్పాటుచేసిన వారు
- ప్రశ్న సంఖ్య 121 – ఆఫ్రికాలో కోకోను ఈ దేశంలో ముఖ్యంగా పండిస్తారు.
- ప్రశ్న సంఖ్య 122 – పేపర్ తయారీ ప్రక్రియలో నాలుగో దశ
- ప్రశ్న సంఖ్య 123 – ఈ రాష్ట్రకూట రాజు చాళుక్యుల ప్రభువుని తొలగించి 'హిరణ్యగర్భ'అనే సంస్కారవిధిని నిర్వహించాడు.
- ప్రశ్న సంఖ్య 124 – ప్రష్యన్ వ్యాపారి అయిన అబ్దుల్ రజాక్ విజయనగర సామ్రాజ్యాన్ని వీరి కాలంలో సందర్శించాడు.
- ప్రశ్న సంఖ్య 125 – మార్చి 18, 1944న భారత జాతీయ సైన్యం బర్మా సరిహద్దులను దాటి ఈ నినాదంతో భారతదేశంలోకి ప్రవేశించింది.
- ప్రశ్న సంఖ్య 126 – హైదరాబాద్ రాష్ట్రంలోని నిజాం పాలకులు మాట్లాడిన భాష
- ప్రశ్న సంఖ్య 127– భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు మరియు రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్
- ప్రశ్న సంఖ్య 128– ప్రభుత్వ వ్యయాన్ని పర్యవేక్షిస్తూ మరియు నేరుగా భారత రాష్ట్రపతికి నివేదించే స్వతంత్య్ర సంస్థ
- ప్రశ్న సంఖ్య 129 – కింది వారిలో రాజ్యసభ సభ్యులను ఎన్నుకొనువారు.
- ప్రశ్న సంఖ్య 130 – డివిజనల్ స్థాయిలో క్రిమినల్ కేసులు, ఈ కోర్టులలో పరిష్కరించబడతాయి.

జూలై 23న ఎస్జీటీ పేపర్‌లో రెండో షిఫ్ట్‌లో పునరావృతమైన ప్రశ్నలు

- ప్రశ్న సంఖ్య 108 – క్రిందివానిలో పీయూష గ్రంథిచే స్రవించబడే హార్మోన్‌లను గుర్తించండి
- ప్రశ్న సంఖ్య 113 – పటంలో గోధుమ/మట్టి రంగు భూ అచ్ఛాదన ఈ భూ వినియోగాన్ని తెలియజేస్తుంది.
- ప్రశ్న సంఖ్య 114 – తెలంగాణలో చాలా ప్రాంతాలు సగటు సముద్రమట్టానికి ఎగువన దాదాపు ఈ ఎత్తులో ఉంటాయి.
- ప్రశ్న సంఖ్య 115 – ఇచ్చిన ఉష్ణోగ్రతలను (12, 18, 0, -4 మరియు 25 సెల్సియస్ డిగ్రీలను ఆరోహణ క్రమంలో అమర్చగా వచ్చిన సరైన క్రమం
- ప్రశ్న సంఖ్య 116 – ఎస్కిమోలు మొట్టమొదట చూసిన యూరోపియన్లు
- ప్రశ్న సంఖ్య 117 – భారతదేశంలోని ఈ కింది రాష్ట్రాలను వాటి జనాభా ప్రకారం అవరోహణ క్రమంలో అమర్చండి.
- ప్రశ్న సంఖ్య 118 – యూరఫ్ ఖండానికి దక్షిణ సరిహద్దు అయిన కాకేసియన్ పర్వతాలు వీటి మధ్య ఉన్నవి
- ప్రశ్న సంఖ్య 119– పట్టణ ప్రజల జీవితాలను వివరిస్తూ శూద్రకుడు రచించిన ఆసక్తికరమైన నాటకం.
- ప్రశ్న సంఖ్య 120 – ప్రస్తుతం కుతుబ్‌మినార్ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రసిద్ధ మెహ్రౌలీ ఇనుప స్తంభాన్ని ఏర్పాటు చేసినవారు
- ప్రశ్న సంఖ్య 121 –ఆఫ్రికాలో కోకోను ఈ దేశంలో ముఖ్యంగా పండిస్తారు.
- ప్రశ్న సంఖ్య 122 – పేపర్ తయారీ ప్రక్రియలో నాలుగో దశ
- ప్రశ్న సంఖ్య 123 – రాష్ట్రకూట రాజు చాళుక్యుల ప్రభువును తొలగించి 'హిరణ్యగర్భ'అనే సంస్కారవిధిని నిర్వహించాడు.
- ప్రశ్న సంఖ్య 124 – ప్రష్యన్ వ్యాపారి అయిన అబ్దుల్‌రజాక్ విజయనగర సామ్రాజ్యాన్ని వీరి కాలంలో సందర్శించాడు.
- ప్రశ్న సంఖ్య 125 – మార్చి 18, 1944న భారత జాతీయ సైన్యం బర్మా సరిహద్దులను దాటి ఈ నినాదంతో భారతదేశంలోకి ప్రవేశించింది.
- ప్రశ్న సంఖ్య 126 – హైదరాబాద్ రాష్ట్రంలోని నిజాం పాలకులు మాట్లాడిన భాష.
- ప్రశ్న సంఖ్య 127 – భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు మరియు రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్
- ప్రశ్న సంఖ్య 128 – ప్రభుత్వ వ్యయాన్ని పర్యవేక్షిస్తూ మరియు నేరుగా భారత రాష్ట్రపతికి నివేదించే స్వతంత్య్ర సంస్థ
- ప్రశ్న సంఖ్య 129 – కింది వారిలో రాజ్యసభ సభ్యులను ఎన్నుకొనువారు.
- ప్రశ్న సంఖ్య 130 –డివిజినల్ స్థాయిలో క్రిమినల్ కేసులు, ఈ కోర్టులలో పరిష్కరించబడతాయి.

నాలుగు రోజులు వర్షాలు

13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 24 గంటల్లో పెద్దపల్లి, జయశంకర్–భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ–గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 13 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.


నిజామాబాద్‌లో నీట మునిగిన బస్సు నుంచి మహిళలను తరలిస్తున్న స్థానికులు

దంచికొట్టిన వాన

- పిడుగుపాటుతో ఐదుగురి మృతి
- వరదనీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 19: రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లపైకి నీరు చేరింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పిడుగుపాటుకు గురై రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు మృతి చెందారు. ఒక జోగుళాంబ గద్వాల జిల్లాలోనే ముగ్గురు మృతి చెందారు. అలంపూర్ మండలం క్యాతూరులో రైతు వేముల రాజు (35), మల్దకల్‌లోని వడ్డె ఆదిలక్ష్మి(15), గట్టు మండలం ఆరగిద్ద శివారులో తలారి నల్లారెడ్డి(30) పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందారు. మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని బిట్టూరుపల్లిలో జక్కుల భాస్కర్‌గౌడ్(57), వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంకిరెడ్డిపల్లిలో విద్యార్థి కార్తీక్ (15) పిడుగుపడి మృతిచెందారు. గమనించని ఆర్టీసీ డ్రైవర్ ముందుకెళ్లడంతో బస్సు నీళ్లలో చిక్కుకుపోయింది. సగం మేర బస్సు నీటిలో మునిగిపోవడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. స్థానికులు హుటాహుటిన స్పందించి బస్సులోని మహిళలు, చిన్నారులను సురక్షితంగా బయటకు చేర్చారు. నల్లగొండ జిల్లాలోని పిట్టలగూడెంలో రామసాని నరేందర్‌రెడ్డికి చెందిన కోళ్ల షెడ్ కూలి అయిదు వేల కోడి పిల్లలు మృతి చెందాయి.

‘ఓవర్సీస్’ విడుదల బాధ్యత అధికారులదే

- **ఇంటిగ్రేటెడ్ గురుకులాల డిజైన్లు పూర్తి చేయండి**
- **5వేల కోట్లతో 120 గురుకులాలు: భట్టి**



హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత సంబంధిత అధికారులదేనని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి స్థలసేకరణ, డిజైన్లను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం ప్రత్యేక సమీక్షా సమావేశం సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ స్కూల్ భవనాల నిర్మాణాలకు కావాల్సిన స్థలాన్ని కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వేగవంతంగా సేకరించాలని, డిజైన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.5వేల కోట్లతో 30 కాంప్లెక్స్‌ల్లో 120 గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 8నెలల్లో భవనాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గురుకులాల్లో 100శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని కోరారు. 1029 గురుకుల పాఠశాలల్లో ఇప్పటి వరకు మంచాలు, బెడ్స్, బెడ్‌షీట్స్ ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎంత మందికి కావాలి? అనే జాబితాను తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన తర్వాత అక్కడ తీసుకున్న చర్యలపై గురుకులాల సెక్రటరీ రమణకుమార్‌ను డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధుల జాబితాను అందజేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సమీక్షలో ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణభాస్కర్, అలుగు వర్షిణి, శరత్ పాల్గొన్నారు.

భట్టికి విద్యుత్తు ఉద్యోగుల సన్మానం

దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగులు సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సన్మానించారు. ఉద్యోగ సంఘాల నేతలు శివాజీ, అంజయ్య, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పవర్ జేఏసీ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీరెడ్డి, వేణు, భూపాల్‌రెడ్డి, అనిల్, సదానందం, పీవీరావు, వెంకటనారాయణరెడ్డి, అంజయ్య, కిరణ్‌కుమార్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పురుడు పోసిన కండక్టర్



- **భారతికి ఎండీ సజ్జనార్ అభినందనలు**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ మహిళా కండక్టర్ బస్సులో గర్భిణికి పురుడుపోసి మానవత్వం చాటుకున్నది. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా గద్వాలకు చెందిన నిండు గర్భిణి సంధ్య సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్లేందుకు పల్లెవెలుగు బస్సు ఎక్కింది. బస్సు నాచహళ్లికి చేరగానే ఆమెకు పురిటినొప్పులు మొదలయ్యాయి. అప్రమత్తమైన మహిళా కండక్టర్ జీ భారతి బస్సును ఆపించింది. అదే బస్సులో ప్రయాణిస్తున్న ఓ నర్సు సాయంతో గర్భిణికి పురుడుపోశారు. పండంటి ఆడబిడ్డ జన్మించింది. అనంతరం 108సాయంతో తల్లీబిడ్డలను స్థానిక దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. విధుల్లో ఉండి సాటి మహిళకు పురుడుపోసి మానవత్వం చాటిన కండక్టర్‌కు టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. ‘శభాష్ భారతి’ అంటూ ఆయన పోస్ట్ చేసిన ట్వీట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

- **సోదరుడి విగ్రహానికి రాఖీ కట్టిన అక్కలు**



వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామంలో సోదరుడి విగ్రహానికి అక్కలు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. బోనగిరి సారయ్య-ఐలమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు హరిప్రసాద్ మూడేండ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు విగ్రహం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్కలు శిరీష, ప్రవళిక రాఖీలు కడుతున్నారు.

-చెన్నారావుపేట

కరెంట్ పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి!

- **వినియోగదారుడికి ఏడీఈ ఉచిత సలహా**
- **తరచూ కోతలపై ఎల్లారెడ్డిగూడ వాసి ఫోన్**
- **రోజంతా నరకం చూపిస్తున్నారని ఆవేదన**
- **అధికారి నిర్లక్ష్యపు సమాధానంపై అసహనం**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): నిమిషం కూడా కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నామని సాక్షాత్తూ విద్యుత్తు శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి డబ్బా కొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యుత్తు సరఫరా విషయంలో ఆ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కరెంటు సమస్య కోతలతో ఇబ్బంది పడుతున్నామని ఓ వినియోగదారుడు ఏడీఈ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్)కి ఫోన్ చేస్తే ‘కరెంటు ఇట్లనే పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి’ అంటూ ఉచిత సలహా ఇవ్వడంతో నివ్వెరపోయాడు. అమీర్‌పేట పరిసర ప్రాంతమైన ఎల్లారెడ్డిగూడకు చెందిన ఓ విద్యుత్తు వినియోగదారుడు (ప్రొఫెసర్) తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌తో పాటు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో కలిగిన విద్యుత్తు అంతరాయాలపై మాట్లాడుతూ ‘నేను ఎల్లారెడ్డిగూడ జేపీనగర్‌లోని కీర్తి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటాను. మా అపార్ట్‌మెంట్‌తో పాటు చుక్కల ప్రాంతాల్లో తరచూ కరెంటు పోతున్నది. కరెంట్ కోతలతో నరకం చూపిస్తున్నారు. ఈ విషయంలో చాలాసార్లు విద్యుత్తు అధికారులతో మాట్లాడిన. నిన్న చాలా సార్లు పోయింది, ఈ వాళ మధ్యాహ్నం కూడా ఎక్కువ సేపు పోయింది. ఇప్పుడు కూడా కరెంటు లేదు. నిన్న పొద్దున ఏడీఈతో మాట్లాడితే కరెంటు ఇట్లనే పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి సార్ అని చెప్పిండు. ఇన్వర్టర్, జనరేటర్ పెట్టుకునేట్టు ఉంటే మీకెందుకు కరెంటు బిల్లులు కట్టాలి? అని అడిగితే దానికి ఆయన రకరకాల సమాధానం చెప్పారు. సమస్యలో తమ ప్రమేయమే లేదని తప్పించుకున్నారు. మళ్లీ సోమవారం ఉదయం కరెంట్ పోతే ఆపరేటర్‌కు ఫోన్ చేసిన. కేబుల్ కట్ అయిందని చెప్పాడు. మొన్ననే బాగు చేసినం.. మళ్లీ పోయిందన్నాడు. కొద్ది రోజులకే ఎట్లా పోయిందని అడిగితే అది కాంట్రాక్టర్‌కు తెలుసు అని చెప్పాడు. ఇక నాకర్థమైందేంటంటే ఎవరికి వారు తప్పించుకునేందుకు ఒకరిపై ఒకరు తోసుకుంటున్నారే తప్ప, సమస్య పరిష్కారానికి మాత్రం కృషి చేస్తలేరు’ అని తనకు కలిగిన అసౌకర్యాన్ని ‘నమస్తే తెలంగాణ’తో పంచుకున్నారు.

అంధకారంలో కేఎంసీ హాస్పిటల్

- **మూడు గంటలు కరెంట్ లేక రోగుల అవస్థలు**
- **జనరేటర్‌కు ఇంధనం కూడా దిక్కులేని వైనం**

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 19 : వరంగల్‌లోని కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తీరు పేరుగొప్ప.. ఊరు దిబ్బ అన్నచందంగా తయారైంది. మౌలిక వసతుల విషయంలో అధ్వాన పరిస్థితి నెలకొన్నది. సోమవారం కురిసిన వర్షానికి హాస్పిటల్‌కు 3గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడి పూర్తిగా అంధకారంగా మారింది. వెంటనే సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంతో రోగులు, అటెండెంట్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన జనరేటర్‌కు ఇంధనం అందుబాటులో లేకపోవడంతో అది పనిచేయక వైద్యసేవలకు సైతం అంతరాయం కలిగింది. ఇకనైనా అధికారులు మౌలిక వసతులు మెరుగుపరచడంపై దృష్టిపెట్టాలని రోగులు, అటెండెంట్లు కోరుతున్నారు.



విద్యుత్ అంతరాయం కారణంగా అంధకారంలో ఉన్న వార్డులు

‘ట్రిపుల్ ఆర్’ భూములకు మంచి ధరలు

ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ) : రీజినల్ రింగు రోడ్డు(ట్రిపుల్ ఆర్)నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మంచి ధరలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రైతులు అధైర్యపడకుండా భూసేకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి కావాల్సిన 1,941.65 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయినట్టు చెప్పారు. రోడ్డు నిర్మాణంలో ప్రభావితమవుతున్న అటవీభూములకు ప్రత్యామ్నాయంగా మహబూబాబాద్ జిల్లాలో 73.04 హెక్టార్ల భూమిని అటవీశాఖకు కేటాయించినట్టు తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణంలో వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్-65ని 6 లేన్లుగా విస్తరించేందుకు డీపీఆర్ రూపకల్పనకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్టు, త్వరలోనే కన్సల్టెంట్‌ను నియమించనున్నట్టు వెల్లడించారు. నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయినందున అపాయింటెడ్ డేట్ వచ్చేలోగా పెండింగ్ భూసేకరణ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పురోగతి లేని ఆయిల్‌పామ్ కంపెనీలపై చర్యలు

- **ఇతర రాష్ట్రాలకు గెలలు తరలింపును అనుమతించం**
- **ఆయిల్‌పామ్ సాగుపై సమీక్షలో మంత్రి హెచ్చరిక**



హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పురోగతి చూపెట్టని ఆయిల్ కంపెనీల మీద ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. సచివాలయంలో సోమవారం ఆయిల్‌పామ్ సాగు పథకం అమలుపై రాష్ట్రంలో పనిచేస్తున్న 14 కంపెనీల నిర్వాహకులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా సాగు విస్తీర్ణంతోపాటు కంపెనీలవారీగా పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు లక్ష్యాలను చేరుకోలేని, ఏ మాత్రం పురోగతి చూపని కంపెనీ నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. పురోగతి చూపెట్టని కంపెనీల మీద ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణలో ఉత్పత్తి చేస్తూ వేరే రాష్ట్రాలకు ఆయిల్‌పామ్ గెలలను తరలించడాన్ని అనుమతించబోమని స్పష్టంచేశారు. ఆయా కంపెనీలు వెంటనే ఇక్కడ ఫ్యాక్టరీలు నిర్మించి, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మొదలుపెట్టాలని ఆదేశించారు. కచ్చితమైన ప్రణాళిక లేకుండా, తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కంపెనీలు ప్రవర్తిస్తే సహించబోమని మంత్రి హెచ్చరించారు. ఫ్యాక్టరీ పూర్తయ్యేనాటికి దాని పరిధిలో కనీసం 10వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యాన సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఉద్యానశాఖ అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

‘అల్లుడా మజాకా’పై ఇంటెలిజెన్స్ ఆరా!

- **ఉలిక్కిపడ్డ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు**
- **ఎవరా మంత్రి? ఎవరా అల్లుడు? అని చర్చ**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ కంపెనీలకు సంబంధించి ‘అల్లుడా మజాకా’ పేరిట ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన కథనం వ్యవసాయశాఖలో సోమవారం కలకలం రేపింది. ప్రభుత్వ పెద్దలు, శాఖలోని పలువురు ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడ్డారు. ఫ్రీ యూనిక్ ఇండియా ఆయిల్‌పామ్ కంపెనీ హస్తగతానికి ఓ మంత్రి అల్లుడు, కొడుకు స్కెచ్ వేస్తున్నారు. దాన్ని విక్రయించాలని ఓనర్లను బెదిరింపులకు గురిచేస్తూ ఒత్తిడి చేస్తున్నారు. రూ.కోట్లలో పెట్టబడి ఇంతకాలం నిర్వహించిన కంపెనీని పంటచేతికొచ్చే సమయానికి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇదే విషయమై ‘అల్లుడా మజాకా’ పేరిట నమస్తే తెలంగాణలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో అటు ప్రభుత్వవర్గాలు, ఇటు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడ్డట్టు తెలుస్తున్నది. ఎవరా మంత్రి? ఎవరా అల్లుడు? అని జోరుగా చర్చ కొనసాగుతున్నది. మరోవైపు ఆ కథనంపై ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ఆరా తీసినట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా మంత్రి తుమ్మల ఆయిల్‌పామ్ కంపెనీలపై సోమవారం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించటం గమనార్హం. ఆ సమావేశంలోనూ ‘నమస్తే తెలంగాణ’ కథనంపై అంతర్గతంగా చర్చించుకున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.



ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న సింఘ్వీ, సీఎం రేవంత్

కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వి నామినేషన్

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున అభిషేక్ మను సింఘ్వి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. తొమ్మిది రాష్ట్రాలలో 12 రాజ్యసభ స్థానాలకు సెప్టెంబర్ 3న ఉపఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో కే కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని అధిష్ఠానం ప్రకటించింది. పార్టీ ముఖ్య నేతలతో కలిసి అసెంబ్లీకి చేరుకున్న సింఘ్వీ రిటర్నింగ్ అధికారికి నాలుగు సెట్ల నామినేషన్‌ను సమర్పించారు. ఆయనవెంట సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పలువురు ఎమ్మెల్యేలు తదితరులు ఉన్నారు.

ఏపీ వ్యక్తి తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడా?

- **తక్షణమే తొలగించాలంటూ అధిష్ఠానానికి విద్యార్థుల లేఖాస్త్రం**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంధ్రాప్రాంతానికి చెందిన వ్యక్తిని నియమించడం కాంగ్రెస్‌లో నిప్పురాజేసింది. ఆంధ్రా వలసవాదులు వద్దు.. తెలంగాణ విద్యార్థులు ముద్దు.. మా పదవులు మాకే కావాలి అంటూ కాంగ్రెస్ శ్రేణులు అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించాయి. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఈ నెల 13న ఏపీకి చెందిన యడవల్లి వెంకటస్వామిని ఏఐసీసీ నియమించింది. దీనిపై తెలంగాణ విద్యార్థి నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లేఖాస్త్రాన్ని సంధించారు. వెంకటస్వామిని తొలగించాలని, తెలంగాణ వ్యక్తికే అధ్యక్షపదవిని కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. 1200 మంది విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా మళ్లీ ఆంధ్రా వలసవాదిని నియమించడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే’ అని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇసుక తోడివేతకు ఈపీసీ విధానం

- **అప్పడే పనులు త్వరగా పూర్తి**
- **గ్లోబల్ టెండర్లు పిలవండి**
- **జలాశయాల్లో ఇసుక, మట్టి నిల్వలను అంచనా వేయండి**
- **క్యాబినెట్ సబ్ కమిటీ ఆదేశం**
- **వివిధ శాఖల అధికారులతో సమీక్ష**

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): జలాశయాల్లో పూడికతీత పనులను ఈపీసీ విధానంలో చేపట్టాలని, అప్పుడే నిర్దేశిత సమయంలో పూర్తవుతాయని అధికారులకు మంత్రి వర్గ ఉపసంఘం చైర్మన్, సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గ్లోబల్ టెండర్లు ఆహ్వానించి పనులు అప్పగించాలని సూచించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో పూడికతీతకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం వేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఇప్పటికే సమావేశమై ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులకు సూచించగా, ఆ మేరకు వివరాలు అందించారు. తాజాగా నివేదికపై రాష్ట్ర నీటి పారుదల, రెవెన్యూ, ఖనిజాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కాంట్రాక్టర్లను ఆహ్వానించి గ్లోబల్ టెండర్లు పిలిచి పనులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. జలాశయాల్లో ఉన్న ఇసుక, మట్టి నిల్వలను ఖనిజాభివృద్ధి సంస్థ అంచనా వేయాలని సూచించారు. ఇసుక, మట్టి ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతో రిజర్వాయర్ల నిర్వహణ చేపట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అన్ని జలాశయాలలో పూడికతీత పనులు చేపట్టి వేగంగా పూర్తిచేయాలని, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా చూడాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసి జలాశయాల్లో నీటి నిల్వలు పెరిగేలా కృషి చేయాలని, వాటిని పటిష్టంగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏజెన్సీల్లో ఒకే సమయంలో ఎక్కువ పనులు చేపట్టేలా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

హైపవర్, టెక్నికల్ కమిటీల ఏర్పాటు

పూడికతీతకు సంబంధించి హైపవర్, టెక్నికల్ కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఖనిజాభివృద్ధి సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి, ఫిషరీస్ తదితర డిపార్ట్‌మెంట్ల నిపుణులతో హైపవర్ కమిటీ వేయాలని సూచించింది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో హైడ్రాలజీ, డ్యామ్ సేఫ్టీ, డిజైన్స్ నిపుణులతో టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- **ఫొటోజర్నలిస్టులతో ఫొటోకు జీవం: పొంగులేటి**
- **ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఫొటో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో 8 నెలలుగా అభయహస్తం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి నేటి ఫొటోగ్రఫీ ప్రదర్శన నిదర్శనమని చెప్పారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్ర సమాచార- పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వేర్వేరు వేడుకల్లో ఆయన పాల్గొని, ఫొటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభించారు. అభయహస్తం హామీలపై నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలకు వచ్చిన ఎంట్రీలను ప్రదర్శించారు. 5 క్యాటగిరీలలో జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన ఫొటోగ్రాఫర్లకు మెమెంటో, నగదు పురస్కారాలు అందజేసి, అభినందించారు. ఫొటోతో కూడిన వార్తకు పరిపూర్ణత చేకూరుతుందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.



మంత్రి పొంగులేటి నుంచి అవార్డులు అందుకుంటున్న ‘నమస్తే తెలంగాణ’ ఫొటోగ్రాఫర్లు సైదిరెడ్డి, బందగి గోపి, మెరుగు ప్రతాప్

‘నమస్తే’ ఫొటోజర్నలిస్టులకు అవార్డులు

నమస్తే తెలంగాణ ఫొటోజర్నలిస్టులు పలు అవార్డులు దక్కించుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విభాగంలో గృహజ్యోతి పథకం చిత్రానికి పీ సైదిరెడ్డి (సూర్యాపేట) ప్రథమ బహుమతి, రూ.20వేల నగదు, ఉత్తమ వార్త చిత్రానికి బందిగే గోపి(మహబూబ్‌నగర్) కన్సోలేషన్ బహుమతి, గృహజ్యోతి పథకానికి మెరుగు ప్రతాప్(వరంగల్) కన్సోలేషన్ బహుమతి, రూ.5వేల నగదు దక్కించుకున్నారు. మంత్రి పొంగులేటి వారిని సత్కరించారు. అదనపు పీఆర్వో చింతల శ్రీనివాస్, ఏవీఎస్ అధికారులు నాగరాజశర్మ, ప్రసాద్, లక్ష్మీనారాయణకు అవార్డులు దక్కాయి.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా కొత్త భూచట్టం

- **మంత్రి పొంగులేటి వెల్లడి**
- **ట్రెసా ఆధ్వర్యంలో చర్చావేదిక**

హైదరాబాద్, ఆగస్ట్ 19 (నమస్తే తెలంగాణ): రైతులు ఎదుర్కొంటున్న అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించేలా నూతన రెవెన్యూ చట్టానికి రూపకల్పన చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ ద్వారా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొత్త చట్టం వీటికి పరిష్కారం చూపుతుందని అన్నారు. ప్రతి గ్రామానికి కనీసం ఒక రెవెన్యూ ఉద్యోగిని నియమించి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఇతర శాఖలకు బదలాయించిన వీఆర్వోలను, వీఆర్ఏలను రెవెన్యూలోకి తీసుకోవాలనే అంశంపై చర్చిస్తున్నామని తెలిపారు. ధరణి కమిటీ సభ్యుడు, భూచట్టాల నిపుణుడు భూమి సునీల్ మాట్లాడుతూ.. నూతన రెవెన్యూ చట్టంలో పొందుపరచిన అంశాలను వాటి ప్రత్యేకతలను రైతులకు, పట్టేదార్లకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కే చంద్రమోహన్ తదితరులు మాట్లాడారు.

వైద్య సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు

- **మంకీ పాక్స్‌పై అప్రమత్తంగా ఉండండి**
- **వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ**



హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలో టీవీవీపీ, డీపీహెచ్ పరిధిలోని దవాఖానల్లో మౌలిక సదుపాయాలు, వైద్యసేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దవాఖానల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అదనపు సేవలైన సెక్యూరిటీ, శానిటేషన్, డైట్, లాండ్రీ సేవలు అందించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంకీ పాక్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. గాంధీ, ఫీవర్ దవాఖానల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని సూచించారు.

వైద్య సిబ్బందికి భద్రత కల్పిస్తాం..

ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జూడా ప్రతినిధులు డాక్టర్ కొమ్ము రాహుల్, జే ఐజాక్‌న్యూటన్, శ్రీనాథ్, సందీప్‌అరోలా, సందీప్‌చారి పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ



నల్లగొండ జిల్లా మండల కేంద్రంలో చివరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన రాస్తారోకోను విరమించాలని రైతులను లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు -మాడ్గులపల్లి



మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి సాంఘిక సంక్షేమ గురుకులంలో నీటి గోస తీర్చాలని ఆందోళన చేస్తున్న విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత - మహబూబ్‌నగర్ విద్యావిభాగం



వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో తాగునీటి కోసం రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న గ్రామస్తులు - పెద్దేముల్



నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం రావుట్లజంగిలోడితండాలో అటవీభూమిలో సాగు చేసిన పంటలను ధ్వంసం చేసేందుకు వచ్చిన పోలీసులను అడ్డుకుంటున్న రైతులు - సిరికొండ



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఆక్రమించుకున్న పేదలు - రుద్రూర్



డిసెంబర్ నాటికి అరబిందో చైనా ప్లాంట్ రెడీ


న్యూఢిల్లీ, ఆగస్టు 19: చైనాలో ఏర్పాటు చేసిన ఫార్మా యూనిట్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించనున్నట్టు, పూర్తి స్థాయిలో మాత్రం వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి అందుబాటులోకి రానున్నట్టు అరబిందో ఫార్మా సీఎఫ్‌వో సంతానం సుబ్రమణియన్ తెలిపారు. అలాగే ఏపీలో రూ.2,400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన పెన్-జీ ప్లాంట్‌కు పీఎల్‌ఐ స్కీం కింద అనుమతి లభించిందని, ప్రతియేటా ఈ యూనిట్‌లో 15 వేల టన్నుల ఔషధాలు ఉత్పత్తి కానున్నయన్నారు. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర సర్కార్ పీఎల్‌ఐ స్కీంను ప్రవేశపెట్టింది. ఈ స్కీం కింద ఎంపికైన ప్లాంట్లకు పలు రాయితీలు లభించనున్నాయి. అమెరికాలో ఔషధాల ధరలు తగ్గుముఖం పట్టడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సంస్థ లాభాలపై ప్రభావం చూపుతున్నదని, ఇదే ట్రెండ్ భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశాలున్నాయన్నారు.

'డిపాజిట్లను ఆకర్షించండి'

న్యూఢిల్లీ, ఆగస్టు 19: డిపాజిట్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా బ్యాంకులు తీవ్రంగా కృషి చేయాలని ప్రభుత్వరంగ బ్యాంకుల అధిపతులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. బ్యాంకుల పనితీరుపై సోమవారం ఢిల్లీలో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. గడిచిన కొన్ని నెలలుగా రుణ వితరణ కంటే డిపాజిట్లలో వృద్ధి 300-400 బేసిక్ పాయింట్లు తక్కువగా నమోదైందని, ఈ రెండింటి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి తీవ్రంగా కృషి చేయాలని ఆమె సూచించారు.

విమాన చార్జీలకు రెక్కలు

ఈ పండుగ సీజన్‌లో భారీగా పెరిగిన టికెట్ ధరలు
ముందస్తు బుకింగ్‌లతో ఒక్కసారిగా డిమాండ్
ముంబై-హైదరాబాద్ రూట్‌లో 21 శాతం పైకి
హైదరాబాద్-తిరువనంతపురం మధ్య 30 శాతం అప్



న్యూఢిల్లీ, ఆగస్టు 19: విమాన చార్జీలు పెరుగుతున్నాయి. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా ఇప్పటికే ఏకంగా 25 శాతం వరకు టికెట్ ధరలను వివిధ విమానయాన సంస్థలు పెంచేశాయి. ఒక్కసారిగా పెరిగిన ముందస్తు బుకింగ్‌లే కారణం. ఈ క్రమంలోనే వన్-వే టికెట్ సగటు ధర దీపావళికి ఆయా ప్రధాన మార్గాల్లో 10 నుంచి 15 శాతం వరకు పెరిగింది. ఇక ఓనమ్ పండుగకైతే కేరళ వెళ్లేవారు 20 నుంచి 25 శాతందాకా అధిక చార్జీలను చెల్లించాల్సిన పరిస్థితి వస్తున్నది. ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో వివరాల ప్రకారం ఢిల్లీ-చెన్నై నాన్‌స్టాప్ విమానం ఎకానమీ క్లాస్ టిక్కెట్ సగటు ధర అక్టోబర్ 30-నవంబర్ 5 మధ్య 25 శాతం ఎగిసి రూ.7,618గా ఉంటున్నది. గత ఏడాది నవంబర్ 10-16 నడుమ రూ.5,713గానే ఉండటం గమనార్హం. అలాగే ముంబై-హైదరాబాద్ రూట్‌లో టికెట్ ధర 21 శాతం ఎగబాకి రూ.5,162 పలుకుతున్నది. ఢిల్లీ-గోవా, ఢిల్లీ-అహ్మదాబాద్ మార్గాల్లో ధరలు రూ.5,999, రూ.4,930గా ఉంటున్నాయి. నిరుడుతో చూస్తే 19 శాతం ఎక్కువ. ఇతర మార్గాల్లోనూ టికెట్ రేట్లు 1 నుంచి 16 శాతం మేర పెరిగిపోయాయని చెప్తున్నారు. గత ఏడాది ఆగస్టు 20-29 మధ్య ఓనమ్ పండుగ జరిగినప్పటితో చూస్తే ఈ ఏడాది సెప్టెంబర్ 6-15 మధ్య ఓనమ్ సమయంలో హైదరాబాద్-తిరువనంతపురం విమాన టికెట్ ధర 30 శాతం ఎగిసి రూ.4,102కి చేరింది. ముంబై-కాలీకట్ ఫ్లైట్ చార్జీ కూడా ఇంతే స్థాయిలో పెరిగి రూ.4,448గా నమోదైంది.

తగ్గిన బెంగళూరు-హైదరాబాద్ చార్జీ

మరోవైపు కొన్ని మార్గాల్లో విమాన చార్జీలు కనిష్ఠంగా 1 శాతం, గరిష్ఠంగా 27 శాతం తగ్గాయి. వాటిలో అత్యధికంగా ముంబై-అహ్మదాబాద్ టికెట్ ధర 27 శాతం క్షీణించి రూ.2,508గా ఉన్నది. అలాగే ముంబై-ఉదయ్‌పూర్ ఫ్లైట్ చార్జీ 25 శాతం పడిపోయి రూ.4,890కి దిగింది. బెంగళూరు-హైదరాబాద్ విమాన చార్జీ 23 శాతం తగ్గి రూ.3,383కు, ముంబై-జమ్ము టికెట్ రేటు 21 శాతం పతనమై రూ.7,826కు వచ్చాయి.

ఢిల్లీ-చెన్నై, ముంబై-బెంగళూరు, ఢిల్లీ-హైదరాబాద్ వంటి రద్దీ మార్గాల్లో వన్-వే చార్జీలు సగటున రూ.4,000-5,000 మధ్య ఉన్నాయి. పండుగల దృష్ట్యా నిరుడుతో పోల్చితే 10-15 శాతం పెరిగాయి. ఓనమ్ పండుగకైతే ఈసారి కేరళ వెళ్లేవారు చాలా చాలా ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. సెప్టెంబర్ రెండో వారంలో చాలామంది టిక్కెట్ బుక్ చేసుకుంటున్నారు. నిరుడుతో పోల్చితే రెట్టింపైంది. కొచ్చిన్, కాలీకట్, తిరువనంతపురం మార్గాల్లో విమాన చార్జీలు 20-25 శాతం ఎగిశాయి.

-రజ్నీశ్ కుమార్, ఇక్సిగో గ్రూప్ కో-సీఈవో

రాబోయే పండుగ సీజన్‌లోనైతే కొన్ని రూట్లలో టికెట్ ధరలు దాదాపు 6-35 శాతం పడిపోవచ్చంటున్నారు. ఈ రూట్లలో డిమాండ్ పెంచేందుకేనని చెప్తున్నారు.

విమాన ప్రయాణీకుల రద్దీ..

ఈ ఏడాది జూలైలో గత ఏడాదితో పోల్చితే దేశీయంగా విమాన ప్రయాణీకుల రద్దీ 7.3 శాతం పెరిగింది. 1.29 కోట్లకు పైగా విమానాలెక్కారు. అయితే ఈ ఏడాది జూన్‌తో చూస్తే మాత్రం జూలైలో ప్రయాణీకులు తగ్గారు. నాడు 1.32 కోట్ల ప్రయాణీకులు నమోదయ్యారు. ఇక ఇండిగో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. మార్కెట్ వాటా జూలైలో 62 శాతానికి ఎగిసింది. ఎయిర్ ఇండియా 14.3 శాతానికి తగ్గింది. ఆకాశ ఎయిర్ 4.7 శాతానికి, ఏఐఎక్స్ కనెక్ట్ 4.5 శాతానికి, స్పైస్‌జెట్ 3.1 శాతానికి, అలయన్స్ ఎయిర్ 0.9 శాతానికే పరిమితమయ్యాయి. అయితే విస్తారా 10 శాతానికి పెరిగిందని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) తెలిపింది. ఇక ఈ ఏడాది జనవరి-జూలైలో దేశీయ ఎయిర్‌లైన్స్‌ల్లో ప్రయాణీకుల సంఖ్య 92.33 కోట్లుగా ఉన్నది. పోయినసారి 88.19 కోట్లే. జూలైలో విమానాల ఆలస్యంతో 3 లక్షలకుపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



సిట్రాయిన్ నయా కారు

రూ.7.99-13.62 లక్షల ధరల శ్రేణిలో..

చెన్నై, ఆగస్టు 19: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ సిట్రాయిన్..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను పరిచయం చేసింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో బాసల్ట్ పేరుతో నయా కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.7.99 లక్షల నుంచి రూ.13.62 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నది. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. ఈ కారుపై రెండేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. దేశవ్యాప్తంగా ఉన్న 85 షోరూంలలో ఈ కారు ముందస్తు బుకింగ్‌లు ఆరంభించిన సంస్థ..వచ్చే నెల తొలి వారం నుంచి డెలివరీ చేయనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 1.2 లీటర్ జెన్ 3 ప్యూర్‌టెక్ 110 టర్బో ఇంజిన్‌తో తయారైన ఈ కారు 6 స్పీడ్ ఆటోమేటిక్, మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో తయారు చేసింది. భద్రత ప్రమాణాలు మెరుగుపర్చడంలో భాగంగా ఈ కారులో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది.

KAYNES TECHNOLOGY

23న కేన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్ ప్రారంభం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కుదిరిన ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ): ప్రముఖ సెమీ కండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీ..తెలంగాణలో ఏర్పాటు చేయతలపెట్టిన అడ్వాన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్(ఏఈయూ) తరలిపోతున్నదన్న వార్తలను కంపెనీ సీఈవో రఘు ఫణికర్ కొట్టిపారేశారు. కొంగర్‌కలాన్ వద్ద రూ.2,800 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌ను ఈ నెల 23న ప్రారంభించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించినట్లు చెప్పారు. ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్టింగ్(ఓఎస్ఏటీ) యూనిట్ ఇండియన్ సెమీకండక్టర్ మిషన్ పరిశీలనలో ఉన్నదని, ఐఎస్ఎం అనుమతి రాగానే ఈ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఫణికర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ భారీ పెట్టుబడితో రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకుగాను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్‌లో రంగారెడ్డి జిల్లా కొంగర్ కలాన్‌లో యూనిట్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత మార్చిలో సంస్థ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. దీంతో ఈ యూనిట్ గుజరాత్‌కు తరలివెళ్లనున్నట్టు అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. గుజరాత్‌లోని సనంద్ వద్ద రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఓఎస్ఏటీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు, కొంగర్‌కలాన్ వద్ద చేపట్టిన ప్రాజెక్టును ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్(ఈఎంఎస్) యూనిట్‌గా మార్చివేస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

అదానీ చేతికి రిలయన్స్ పవర్ ప్లాంట్!

ఒప్పందం విలువ రూ.3 వేల కోట్ల స్థాయిలో..



న్యూఢిల్లీ, ఆగస్టు 19: దేశీయ కుబేరుల్లో ఒకరైన గౌతమ్ అదానీ మరో విద్యుత్ ప్లాంట్‌ను చేజిక్కించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు విద్యుత్ యూనిట్లను కైవసం చేసుకున్న ఆయన..తాజాగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్స్ ప్లాంట్‌ను కొనుగోలు చేసేయోచనలో ఉన్నారు. ఒప్పందం విలువ రూ.2,400 కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. రుణాలు చెల్లింపులు విఫలంకావడంతో రిలయన్స్ పవర్‌కు చెందిన 600 మెగావాట్ల బుతిబోరి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ వద్ద ఉన్నది. విదర్భ ఇండస్ట్రీస్ పవర్ లిమిటెడ్ పేరుతో నాగపూర్ వద్ద ఉన్న ఈ విద్యుత్ ప్లాంట్ కొనుగోలుకు సంబంధించి సీఎఫ్ఎం అసెట్ రీకన్‌స్ట్రక్షన్‌తో అదానీ పవర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రముఖ మీడియా సంస్థ మింట్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఒక్కో మెగావాట్ ధర రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో ఈ ప్రాజెక్టు విలువ రూ.6 వేల కోట్ల స్థాయిలో ఉండగా, ప్రస్తుతం ఈ ప్లాంట్ మూతపడటంతో దీని విలువ సగానికి సగం పడిపోయింది.

వెనక్కి తగ్గిన సజ్జన్ జిందాల్

దేశీయ వ్యాపారవేత్త సజ్జన్ జిందాల్ కూడా రిలయన్స్ పవర్‌కు చెందిన ఈ ప్లాంట్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపినప్పటికీ ప్రస్తుతం వెనుకంజవేశారు. కంపెనీ విలువ అత్యధికంగా ఉండటం, నిర్వహణ సమస్యలు అధికంగా ఉండటంతో ఆయన వెనక్కి తగ్గినట్లు తెలుస్తున్నది. దీంతో ఈ యూనిట్ రేసులోకి మళ్లీ అదానీ వచ్చారు. ముంబైలో విద్యుత్‌ను సరఫరా చేయడానికి గతంలో రిలయన్స్ పవర్ ఈ విద్యుత్ ప్లాంట్‌నే వినియోగించేది. ఆ తర్వాతి క్రమంలో ముంబై డిస్ట్రిబ్యూషన్ బిజినెస్‌ను అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ చేతికి వెళ్లడంతో ఈ యూనిట్ నిరూపయోగంగా మారిపోయింది. దేశవ్యాప్తంగా ఒకవైపు విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో అదానీ గ్రూపు తన థర్మల్ విద్యుత్ కెపాసిటీని పెంచుకునే పనిలో పడింది. దీంట్లో భాగంగా మూతపడిన, ఎన్‌సీఎల్‌టీ కింద ఉన్న విద్యుత్ ప్లాంట్లను చౌకగా కొనుగోలు చేయడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది.

సెబీ చీఫ్‌పై మళ్లీ ఆరోపణలు!

న్యూఢిల్లీ, ఆగస్టు 19: అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై మరోసారి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ బ్లాక్‌స్టోన్‌తో సంబంధాలు కలిగివున్నట్లు ది మార్నింగ్ కంటెక్స్ తన కథనంలో వెల్లడించింది. దేశీయ కార్పొరేట్ సంస్థల్లో మెజార్టీ వాటాను కొనుగోలు చేయడానికి పరోక్షంగా బ్లాక్‌స్టోన్‌కు సహాయ సహకారాలు అందించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తన కథనంలో పేర్కొంది. బ్లాక్‌స్టోన్ సంస్థ గడిచిన నాలుగేండ్లలో భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టడంతోపాటు పలు కంపెనీల్లో ప్రమోటర్‌గా మారింది. ప్రైవేట్ పెట్టుబడులు అనుమతించడానికి నియంత్రణ మండళ్లు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, బ్లాక్‌స్టోన్ పెట్టుబడులపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండానే అనుమతినిచ్చినట్లు ఆరోపిస్తున్నది.

ధరలు తగ్గుతున్నాయ్: ఆర్బీఐ

ముంబై, ఆగస్టు 19: ధరలు తగ్గుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అంటున్నది. ఈ నెలలో తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, వంటనూనెల ధరలు బాగా తగ్గినట్టు తాము గుర్తించామని 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' పేరిట సోమవారం విడుదల చేసిన బులెటిన్‌లో ఆర్బీఐ పేర్కొన్నది. గత నెల జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.5 శాతానికి దిగొచ్చిన విషయం తెలిసిందే. అంతకుముందు నెల జూన్‌లో 5.1 శాతంగా ఉన్నది. టోకు ద్రవ్యోల్బణం కూడా తగ్గింది. ఈ క్రమంలో ఆగస్టులోనూ ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గబోతున్నాయన్నట్టు ఆర్బీఐ సంకేతాలివ్వడం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. దీంతో ఇది ఇలాగే కొనసాగితే అక్టోబర్ నెలలో జరిపే ద్రవ్యసమీక్షలోనైనా ఆర్బీఐ వడ్డీరేట్లకు కోతపెట్టే అవకాశాలుంటాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతున్నది.

ఆస్కీ డీజీగా రమేశ్‌కుమార్ బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కీ) డైరెక్టర్ జనరల్‌గా ఏపీ క్యాడర్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్ రమేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర విభజన సమయంలో, 2009నుంచి 2016వరకు ఏపీ, తెలంగాణ గవర్నర్‌కు ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో టీటీడీ కార్యనిర్వహణాధికారిగా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా, వివిధ శాఖలకు ముఖ్యకార్యదర్శిగా వ్యవహరించారు.

అంగన్‌వాడీ.. అగమ్యగోచరం

- **నెలనెలా వేతనాలందక వేదన**
- **ఒకటో తారీఖు జీతం వట్టిమాటే!**
- **8 నెలలుగా అప్‌గ్రేడేషన్ పెండింగ్**
- **అయోమయంలో టీచర్లు, హెల్పర్లు**
- **చిన్నారులకు అందని యూనిఫామ్స్**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అగమ్యగోచరంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్నిశాఖల ఉద్యోగులకు ఒకటో తారీఖునే వేతనాలిస్తున్నామని కాంగ్రెస్ సర్కార్ చెబుతున్న మాటలు ఉత్తవేనని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొంటున్నారు. వేతనాల కోసం నెలనెలా ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు యూనిఫామ్స్ పంపిణీ కాలేదు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడేషన్ (2023, సెప్టెంబర్ 12న) చేపట్టింది. తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ఆగిపోయింది. ఎన్నికలు పూర్తయ్యి 8 నెలలు దాటినా, కేంద్రం ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా పరిగణిస్తున్నామని పేర్కొన్నా అప్‌గ్రేడేషన్ ప్రక్రియ ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. కేసీఆర్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 30శాతం పీఆర్సీని అంగన్‌వాడీ సిబ్బంది అందుకున్నారు. కేసీఆర్ పాలనలో కేవలం ఏడేండ్ల (2015 నుంచి 2021 వరకు)లోనే దేశంలో ఎక్కడా లేని విధంగా అంగన్‌వాడీ టీచర్లకు 325శాతం, ఆయాలకు 354శాతం వేతనాలు పెంచిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

కేసీఆర్ హయాంలో అంగన్‌వాడీలకు పెరిగిన వేతనాలు ఇలా..

సంవత్సరం	అంగన్‌వాడీ టీచర్లు	మినీ అంగన్‌వాడీ/ హెల్పర్లు (రూ.ల్లో)
2015, మార్చి 11	4,200-7,000	2,200-4,000
2017, ఫిబ్రవరి 27	7,000-10,500	4,500-6,000
2021,ఆగస్టు 18	10,500-13,650	6,000-7,800

కేంద్రం ససేమిరా అన్నా..

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాక ముందు అంగన్‌వాడీల వేతనాల్లో కేంద్రం వాటా 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 10 శాతం మాత్రమే ఉండేది. మోదీ సర్కార్ వచ్చాక కేంద్రం వాటా 60 శాతానికి తగ్గించింది. రాష్ట్ర వాటాను 40 శాతానికి పెంచింది. పెరిగిన వేతనాల ప్రకారం కేంద్రం వాటా 60 శాతం ఉండాలి. కానీ, టీచర్ల వేతనాల్లో 19శాతం, సహాయకుల వేతనాల్లో కేవలం 17 శాతమే అందిస్తామని చెప్పింది. అయినా అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చెల్లించాలని కేసీఆర్ పట్టుదలతో ఇప్పించారని అంగన్‌వాడీలు చెబుతున్నారు.

కలుషితాహారం తిని నలుగురు విద్యార్థులు మృతి

- **చికిత్స పొందుతున్న మరో 23 మంది**
- **ఏపీలోని అనకాపల్లిలో ఘటన**

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కలుషితాహారం తిని నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మరో 23 మంది తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. బాధిత విద్యార్థుల కుటుంబసభ్యులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కైలాసపట్నంలోని ఓ అనాథాశ్రమానికి చెందిన పాఠశాలలో 86 మంది విద్యార్థులు ఉన్నారు. ఆదివారం ఉదయం కలుషిత ఆహారం తిని 27 మంది అనారోగ్యానికి గురయ్యారు. వాంతులు, విరేచనాలు కావడంతో సిబ్బంది హుటాహుటిన దవాఖానకు తరలించారు. విద్యార్థుల్లో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండగా, చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులు జాషువా, భవాని, శ్రద్ధ, నిత్య మృతి చెందినట్టు డాక్టర్లు వెల్లడించారు.

అక్టోబర్ 4 నుంచి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమలలో 9 రోజులు వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): తిరుమలలో అక్టోబర్ 4 నుంచి 12వరకు తొమ్మిది రోజులపాటు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఏడాది పొడవునా 450 ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఇందులో బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్ఠత ఉన్నది. అక్టోబర్ 3న ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉదయం, రాత్రి వేళ్లల్లో ఒక్కో వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం భారీ ఏర్పాట్లు చేస్తున్నది. గరుడ వాహనసేవకు లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నది.

తిరుమలలో నకిలీ టికెట్ల ముఠా అరెస్టు

ఏపీ టూరిజం ప్యాకేజీ ముసుగులో టీటీడీ నకిలీ టికెట్లను విక్రయిస్తున్న ముఠా గుట్టును టీటీడీ విజిలెన్స్ అధికారులు రట్టుచేశారు. ఏపీ టూరిజం పేరుతో చెన్నైకి చెందిన ట్రావెల్స్ ఏజెంట్, టీటీడీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఏపీ టూరిజం ఉద్యోగి ముఠాగా ఏర్పడి ప్రతి రోజు 30-40 మంది భక్తులను టికెట్లు లేకుండానే దర్శనాలకు పంపిస్తున్నట్టు గుర్తించింది. వీరిపై నిఘా ఉంచిన టీటీడీ విజిలెన్స్ అధికారులు ఐదుగురు సభ్యులున్న ముఠాలో ముగ్గురిని అరెస్టు చేశారు.

ప్రభుత్వ ప్లీడర్ల తొలగింపు సబబే

ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా కోర్టుల్లో నియమితులైన పలువురు ప్రభుత్వ ప్లీడర్లను గడువు పూర్తికాకముందే తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ ప్లీడర్లను తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి సోమవారం చేసిన వాదనతో జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఏకీభవిస్తూ.. వారిని తొలగించడం సబబేనని తేల్చారు. ప్రభుత్వ ప్లీడర్లను తొలగింపునకు సంబంధించి గత నెల 26న జారీ అయిన జీవో 354ను రద్దు చేయాలంటూ 21 మంది దాఖలు చేసిన పిటిషన్లను డిస్మిస్ చేశారు.

ఆ అధికారం ఆర్డీవోలకు లేదు

భూ రికార్డుల సవరణపై హైకోర్టు స్పష్టీకరణ



హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): భూములకు సంబంధించిన రికార్డులను తమంతట తాముగా సవరించే అధికారం ఆర్డీవోలకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మెదక్ జిల్లా న్యాలకల్ మండలంలోని 23, 24 సర్వే నంబరల్లో 50 ఎకరాల భూములను తలాబ్ చెరువు భూములుగా పేర్కొంటూ ఆర్డీవో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది. ఆ భూములకు సంబంధించి గతంలోని ఎంట్రీలను రెవెన్యూ రికార్డుల్లో పునరుద్ధరించడంతోపాటు పట్టాదారుల స్వాధీనంలో ఉన్నట్టు ఎంట్రీలను సవరించాలని ఆర్డీవోను ఆదేశించింది. ఆ భూములపై ఏమైనా సందేహాలుంటే తాజాగా జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జేఎన్టీయూహెచ్‌లో ముగిసిన 'సైబర్ సెక్యూరిటీ'

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్)లో 4 వారాలుగా నిర్వహిస్తున్న 'సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ సర్టిఫికేషన్'' ప్రోగ్రామ్ సోమవారంతో ముగిసింది. జేఎన్టీయూహెచ్ డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్(డీఈఐఎస్), సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ సంయుక్తంగా హంట్ మెట్రిక్స్ ఇండియా సంస్థతో కలిసి ''సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ సర్టిఫికేషన్'' అంశంపై జూలై22 నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్ నిర్వహిసున్నది. తెలుగు రాష్ట్రాల నుంచి 46 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురికి ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పించారు. కార్యక్రమంలో హంట్ మెట్రిక్స్ ఇండియా సంస్థ ప్రతినిధులు అయూబ్, భాస్కర్, జెఎన్టీయూ సీవోఈ ప్రొఫెసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్‌లో బీఫార్మసీ కోర్సులు

జేఎన్టీయూహెచ్‌లో ఈ ఏడాది బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులు ప్రారంభం కానున్నాయి. యూనివర్సిటీ ఫార్మసీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్ శోభారాణి ప్రకటనలో వెల్లడించారు. బీ ఫార్మసీలో 60సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎం ఫార్మసీలో ఫార్మ సూటిక్స్, ఫార్మ సూటికల్ ఎనాలిసిస్, ఫార్మ సూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాగ్నసీ విభాగాల్లో 15 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన అనంతరం ప్రఖ్యాత ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా కల్పిస్తామని వెల్లడించారు.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో భుజంగరావుకు బెయిల్



నాంపల్లి కోర్టులు, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న అదనపు ఎస్పీ భుజంగరావుకు 15 రోజులపాటు మధ్యంతర బెయిల్ లభించింది. ఆయన ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం ఈ నెల 31 వరకు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ నాంపల్లిలోని 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జి రమాకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 వేల చొప్పున ఇద్దరి జమానత్‌లను కోర్టుకు సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోర్టు అనుమతి లేకుండా హైదరాబాద్‌ను వీడరాదని, బెయిల్ గడువు ముగియగానే కోర్టు ఎదుట హాజరు కావాలని భుజంగరావుకు స్పష్టం చేశారు.

అత్యాచార బాధితురాలి వాంగ్మూలాన్ని
ఇంటి వద్దే నమోదు చేయాలి: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): మలక్‌పేటలోని వసతి గృహంలో అత్యాచారానికి గురైన అంధ బాలిక వాంగ్మూలాన్ని ఆమె ఇంటి వద్దనే నమోదు చేయాలని హైకోర్టు సోమవారం ఆదేశించింది. బాధితురాలిని మేజిస్ట్రేట్ వద్దకు పిలిపించడం కంటే ఆమె ఇంటివద్దనే వాంగ్మూలం తీసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని దర్యాప్తు అధికారికి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మేజిస్ట్రేట్‌ను బాలిక ఇంటివద్దకే తీసుకెళ్లి వాంగ్మూలం నమోదు చేయించాలని స్పష్టం చేశారు.

4 మెడికల్ కాలేజీల అప్పీల్‌పై రేపు విచారణ

హైదరాబాద్, ఆగస్ట్ 19 (నమస్తే తెలంగాణ): జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) నుంచి అనుమతులు లభించని 4 ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవితవ్యం బుధవారం తేలనున్నది. ఈ ఏడాది 8 మెడికల్ కాలేజీలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా.. ఇటీవల ఎన్ఎంసీ 4 కాలేజీలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. యాదాద్రి భువనగిరి, మెదక్, కుత్బుల్లాపూర్, మహేశ్వరం మెడికల్ కాలేజీలకు అనుమతులు రాలేదు. దీంతో ఎన్ఎంసీ సూచించిన మేరకు లోటుపాట్లను సవరించినట్టు అధికారులు చెప్తున్నారు. ఈ మేరకు మరోసారి ఎన్ఎంసీకి అప్పీల్ చేయడంతో ఈ నెల 21న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, 4 కాలేజీల ప్రిన్సిపాళ్లు మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఆయా మెడికల్ కాలేజీల భవితవ్యం ఎన్ఎంసీ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది.


ఆగని అన్నదాతల నిరసనలు



తీరని రుణం.. రైతన్న రణం


రుణమాఫీపై రైతుల నిరసనలు హోరెత్తుతున్నాయి. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చారు. రుణమాఫీ ఎందుకు కాలేదని అధికారులను నిలదీశారు. బ్యాంకుల ఎదుట నిరసన ప్రదర్శనలు చేశారు. ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మండల కార్యాలయాలకు బాటపట్టి, అధికారులకు ఫిర్యాదులు చేశారు. అర్హత ఉన్నా తమకు ఎందుకు మాఫీ కాలేదంటూ గోడు వెళ్లబోసుకున్నారు. జగిత్యాల జిల్లా రాఘవపేటలో రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఆర్మూరు, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు సమావేశమై ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చారు.

• జగిత్యాల జిల్లా రాఘవపేటలో రిలే దీక్షలు



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేటలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న రైతులు. 400 మందికి రుణమాఫీ కాలేదని రైతులు తెలిపారు. నెలరోజుల్లోగా రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని ఏడీఏ రైతులకు హామీ ఇచ్చారు.

• పండుగ పూట.. మండల కేంద్రానికి పోరుబాట



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో తమకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు. పండుగ ఉన్నా 200మందికి పైగా రైతులు ఏవోకు ఫిర్యాదులు చేశారు.

• జగిత్యాల డీఏవోకు మల్లాపూర్ రైతుల వినతి



రూ.2 లక్షల లోపు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి వాణికి వినతిపత్రం ఇస్తున్న మల్లాపూర్ గ్రామ రైతులు

• ఆదిలాబాద్ ప్రజావాణికి అన్నదాతల వెల్లువ



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఇంద్రవెల్లి మండల రైతులు పెద్దఎత్తున తరలివచ్చి వినతిపత్రాలు అందజేశారు.



నాకు రూ.1.80 లక్షలున్నా మాఫీగాలే!

నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నాలుగేండ్ల క్రితం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.80 లక్షలు లోన్ తీసుకున్నా. నాకు మూడు విడుతల్లోనూ రుణమాఫీ కాలేదు. రుణమాఫీపై సర్కారు మోసపూరిత ప్రకటనలు చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నది. భవిష్యత్తులో ఈ కాంగ్రెస్ సర్కారుకు రైతులు తగిన గుణంపాఠం చెప్పాలి. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి.

-కొలుగూరి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, కట్కూరు (సిద్దిపేట జిల్లా)

• సీఎం దిష్టిబొమ్మ దహనం



సిద్దిపేట జిల్లా అక్కెనపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. అనంతరం సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు.



కేసీఆరే నయం.. కాంగ్రెస్ సాయమే అందకపాయే!

నాకు ఆరెకరాలు భూమి ఉన్నది. రూ.2.50 లక్షల లోన్ ఉన్నది. మూడు విడుతల్లోనూ నాకు రుణమాఫీ కాలే. నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉండి పని చేసిన. కేసీఆర్ ప్రభుత్వమే నయం. అప్పుడు ఒక్కసారే రూ.80 వేలు మాఫీ వస్తే మళ్లా రుణం తీసుకున్న. అప్పుడు ఇట్లా బ్యాంకులు, వ్యవసాయ అధికారుల సుట్టూ తిరుగుడు లేకుండె.

-సాకి యాకయ్య, కొరిపల్లి గ్రామం, పెద్దవంగర(మహబూబాబాద్)

• సొసైటీ ఆఫీసుకు తాళం వేసి పాల్దాలో నిరసన



నిజామాబాద్ జిల్లా పాల్దా సొసైటీ కార్యాలయం గేటుకు తాళం వేసి రైతులు నిరసన తెలిపారు. పంట రుణాలు మాఫీ చేయాలని కోరుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

• అయిజ రైతువేదిక వద్ద నిరసన



జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని రైతువేదిక వద్ద బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు




ఒకరికొచ్చింది.. ఇంకొకరికి రాలే!

నాకు అశ్విని, అఖిల ఇద్దరు కూతుళ్లు. చెరి రెండెకరాల చొప్పున వ్యవసాయ భూమి, పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయి. అశ్విని పేరును రూ.60 వేలు, అఖిల పేరును రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. అశ్విని రూ.60 వేలనే మాఫీ చేశారు. అఖిల పేరుపై ఉన్న రూ.1.20 లక్షలు మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే రాదని అంటున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు.

- మోదిపట్ల రాములు, తానేదార్‌పల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ జిల్లా

• రైతులకు బోథ్ ఎమ్మెల్యే పరామర్శ



పోలీసులు అరెస్టు చేసిన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామ రైతులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

• రుణమాఫీకి అర్గుల్‌లో పోరుబాట



నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో రైతులు సమావేశమయ్యారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల రైతులు పాల్గొని, రుణమాఫీ కోసం ఐక్యపోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు.

సగం మంది రైతులకు మాఫీ కాలేదు



సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మూడు విడుతలు పెట్టిండ్రు. ఊళ్లల్లో మాత్రం సగం మందికి కూడా రుణమాఫీ జరగలేదు. 3 లక్షలలోన్ తీసుకున్నా. రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదు.

-జిల్లెల గాల్‌రెడ్డి, రైతు, కట్కూరు (సిద్దిపేట జిల్లా)

నేను కాంగ్రెస్ కార్యకర్తనే.. అయినా రుణమాఫీ కాలే



నాకు ఐదున్నరెకరాల భూమి ఉన్నది. 2.20 లక్షల లోన్ ఉన్నది. నెల కింద 14 వేలు మిత్తి కట్టి రెన్యువల్ కూడా చేసిన. మూడో విడతలో రుణమాఫీ లిస్టులో నా పేరు రాలే. నేను కాంగ్రెస్ కార్యకర్తనే. కాంగ్రెస్ ప్రభుత్వంల రుణమాఫీ పరిస్థితి గిట్లుండె. మా ఊర్లో చాలామందికి రుణమాఫీ కాలే.

- కలుకోటి వెంకట్‌రెడ్డి, కొరిపల్లి, పెద్దవంగర (మహబూబాబాద్)

• సిండికేట్ బ్యాంకు ఎదుట రైతుల నిరసన



నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌లోని సిండికేట్ బ్యాంకు ఎదుట రైతులు రుణమాఫీ చేయనందుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. పోలీసులు వారించినా వినకుండా రుణమాఫీ చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు.

• ధన్నూర్ (బి)లో రైతుల నిరసన



తమకు రుణమాఫీ కాలేదని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూరు (బి) గ్రామంలో రైతులు నిరసన ప్రదర్శన చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసించారు.



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేటలో రైతుల రిలే నిరాహారదీక్ష శిబిరం వద్దకు వచ్చి మాట్లాడుతున్న ఏడీఏ లావణ్య. ఆ తర్వాత రైతులకు రాఖీలు కట్టి రైతుల దీక్షలను విరమింపజేశారు. నెలరోజుల్లోగా రుణమాఫీ చేస్తామంటూ వారికి హామీ ఇచ్చారు.

• హైవేపై వెల్మల్ రైతుల రాస్తారోకో



నిజామాబాద్ జిల్లా పరిధిలోని నందిపేట-నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న నందిపేట మండలం వెల్మల్ గ్రామ పరిధిలోని రైతులు. ఈ సందర్భంగా తమకు రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినదించారు. రుణమాఫీ చేయని ప్రభుత్వ వైఖరిని నిరసించారు.

అన్నాచెల్లెళ్ల బంధానికి రాఖీ ప్రతీక: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రాఖీ పండుగను పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని కోకాపేటలోని నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై అభిమానం, ప్రేమతో రాఖీలు కట్టిన సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల బంధానికి రాఖీ పండుగ ప్రతీక అని, ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళల శ్రేయస్సు, భద్రత కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

అండగా నిలిచిన అన్నకు ఆప్యాయంగా..!

- కేటీఆర్‌కు రాఖీ కట్టిన మహిళాలోకం
- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన ఆడబిడ్డలు
- రాఖీకట్టిన రుద్రరచన, జోహాన్‌ఖాన్ తల్లి, కృతిక



కేటీఆర్‌కు బొట్టుపెట్టి రాఖీ కడుతున్న బీఆర్‌ఎస్ మహిళానేతలు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత పదేండ్లలో వ్యక్తిగతంగా, మంత్రిగా వేల మందికి అనేక సందర్భాల్లో తనకు తోచిన సాయం, సహకారం అందించారు. ఈ నేపథ్యంలో కొందరు రాఖీ పండుగను పురస్కరించుకొని సోమవారం బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో కేటీఆర్ నివాసానికి వచ్చి మరీ రాఖీ కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. జగిత్యాలకు చెందిన అనాథ విద్యార్థిని రుద్రరచన ఇంజినీరింగ్ సీటు సాధించింది. ఆమె ఆర్థిక ఇబ్బందులను తెలుసుకొని చదువు కోసం కేటీఆర్ పూర్తి ఖర్చులు భరించారు. ప్రస్తుతం ఆమె కాగ్నిజెంట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. కేటీఆర్ చేసిన సాయానికి కృతజ్ఞతగా గతేడాది ఆమె తన 3 నెలల జీతాన్ని సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చింది. ఈసారి ఆమె కేటీఆర్‌ను కలిసి రాఖీ కట్టి తన ప్రేమను చాటుకున్నది.

- హైదరాబాద్ బోరబండకు చెందిన ఐదేండ్ల జోహాన్‌ఖాన్ పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కేటీఆర్.. చికిత్సకు సాయమందించారు. తన కొడుకుకు భవిష్యత్తును అందించారని జోహార్‌ఖాన్ తల్లి కేటీఆర్ నివాసానికి వచ్చి రాఖీ కట్టారు.
- హైదరాబాద్‌కు చెందిన ఐదేండ్ల బాలిక కృతిక.. వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడితే కేటీఆర్ ఆమె ఆపరేషన్లకు సాయం అందించారు. ఆమె కేటీఆర్‌కు రాఖీ కట్టి ధన్యవాదాలు తెలిపింది.
- ముస్లిం మహిళలు సైతం కేటీఆర్‌కు రాఖీ కట్టేందుకు పోటీపడ్డారు.

తరలివచ్చిన ఆడబిడ్డలు

మాజీమంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, హరిప్రియానాయక్, తుల ఉమ, గండ్ర జ్యోతి, గుజ్జ దీపిక, ముక్తవరం సుశీలారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, కేటీఆర్‌కు రాఖీ కట్టారు. ప్రతి సోదరికి శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, తన సోదరి కవిత రాఖీ కట్టే పరిస్థితి లేకపోవటంపై ఆవేదన చెందారు.

నీకు ఏ కష్టమొచ్చినా నేను అండగా ఉంటా

కవితను తలచుకుంటూ కేటీఆర్ ఉద్విగ్న పోస్ట్

రాఖీ పండుగ సందర్భంగా తన సోదరి కవితను తలచుకుంటూ కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. 'ఈ రోజు నువ్వు రాఖీ కట్టలేకపోవచ్చు. కానీ, నీకు ఏ కష్టమొచ్చినా నేను అండగా ఉంటా' అని పేర్కొంటూ గతంలో కవిత తనకు రాఖీ కట్టిన ఫొటోను, కవిత పిడికిలి ఎత్తిన ఫొటోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

రాజీవ్ విగ్రహం తీసేస్తం

మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ సర్కారు నిర్మించిందని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించేలా సచివాలయం ఎదురుగా ఒక ఐలాండ్‌ను క్రియేట్ చేశామని, దశాబ్ది ఉత్సవాల్లోనే అక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సచివాలయానికి అంబేద్కర్ పేరును పెట్టామని, ఆ మహనీయుడికి ఘనమైన నివాళి అర్పించేలా అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తుచేసేలా అమరజ్యోతి స్మారకాన్ని నిర్మించామన్నారు.

తెలంగాణ అస్థిత్వానికి కాంగ్రెస్ అవమానం

కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు మాజీ సీఎం అంజయ్య పేరుతో ఉన్న పార్కు కాస్తా లుంబిని పార్కు అయ్యిందని, అదే అంజయ్య పార్కు ఎదురుగా ఆయనను అవమానించిన రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు.

పదేండ్లలో పేర్ల మార్పుపై ఆలోచంచలేదు

బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో ఏనాడూ పేర్ల మార్పుపై ఆలోచించలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందుకే ప్రభుత్వ పథకాలు, ప్రాంతాలకు కాంగ్రెస్ నాయకుల పేర్లు ఉన్నా వాటిని మార్చే ప్రయత్నం చేయలేదని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, రాజీవ్‌గాంధీ ట్రిపుల్‌ఐటీ, రాజీవ్ గాంధీ ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్-కరీంనగర్ రహదారికి రాజీవ్ రహదారి, అంతర్జాతీయ విమానాశ్రయానికి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం.. ఇలా ఎన్ని పేర్లున్నా వాటిని తాము మార్చలేదని చెప్పారు. కానీ తెలంగాణ తల్లిని అవమానించిన తర్వాత బాధతో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తరలిస్తామని చెప్తున్నామని వివరించారు. ఢిల్లీకి గులాములుగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ పౌరుషం కలిగిన బిడ్డగా చెప్తున్నానని.. ఆ విగ్రహాలను మార్చే దిశగా ఆలోచన చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ పేర్లతో ఉన్న పథకాలు, ప్రాంతాల పేర్లను కూడా మారుస్తామని తెలిపారు. హైదరాబాద్ విమానాశ్రయానికి తెలంగాణ ప్రముఖుడి పేరు పెడతామని వెల్లడించారు. ముంబై విమానాశ్రయానికి ఛత్రపతి శివాజీ, బెంగళూరు విమానాశ్రయానికి కెంపెగౌడ అని పేర్లు ఉన్నాయని.. తెలంగాణకు సంబంధం లేని రాజీవ్‌గాంధీ పేరున్నా తాము తొలగించలేదని గుర్తుచేశారు.

కాంగ్రెస్ పాలనలో అఘాయిత్యాలు

ఎనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళల మీద జరిగిన అఘాయిత్యాలు ఇప్పుడు గుర్తుకు వచ్చినందుకు మంచిదేనని కేటీఆర్ అన్నారు. కొల్లాపూర్‌లో చెంచు మహిళ, షాద్‌నగర్‌లో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినా ప్రభుత్వం దున్నపోతుపై వానపడ్డట్టు వ్యవహరించిందని, మహిళా మంత్రులు స్పందించలేదని మండిపడ్డారు. తమ మాజీ మంత్రులు షాద్‌నగర్‌కు వెళ్లాకే పోలీసులను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇంకా ఎన్నో అఘాయిత్యాలు, అత్యాచారాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి హోం మంత్రి దిక్కులేరని ధ్వజమెత్తారు. కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్య ఘటనపై ఢిల్లీలో డాక్టర్లు నిందితుడికి తెలంగాణ తరహా శిక్ష విధించాలని అడుగుతున్నారని, దటీజ్ కేసీఆర్ అని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బిక్షమయ్యగౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, అంజనేయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు పూలదండ కూడా వేయని సీఎం రేవంత్

కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఏనాడు అనడని, మహనీయుడు అంబేద్కర్‌కు కనీసం పూలదండ వేయడని, విగ్రహానికి ప్రముఖ రోజుల్లో లైటింగ్ ఏర్పాటు చేయని కుసంస్కారి అని కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద మెప్పు కావాలంటే.. రాహుల్ దగ్గర మార్కులు కొట్టేయాలనుకుంటే.. గాంధీభవన్ లోనో, రేవంత్ ఇంట్లోనో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టుకొంటే తమకు అభ్యంతరం లేదని స్పష్టంచేశారు.

పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన భేష్!

కొనియాడిన శ్రీలంక మంత్రి సతాశివన్

- హైదరాబాద్‌లో కేటీఆర్‌తో ప్రత్యేక భేటీ
- రాజధానిని అక్షయపాత్ర చేశారని కితాబు
- తెలంగాణ ప్రగతిపై శ్రీలంక పార్లమెంట్‌లో చర్చ
- భేటీ సమయంలో నెమరు వేసుకున్న శ్రీలంక మంత్రి



కేటీఆర్‌ను కలిసిన శ్రీలంక మంత్రి సతాశివన్ వియలందేరన్

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లలో అద్భుత ప్రగతి సాధించిందని శ్రీలంక వాణిజ్య, పర్యావరణ శాఖల మంత్రి సతాశివన్ వియలందేరన్ కొనియాడారు. సోమవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 2014లో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేవలం పదేండ్లలోనే సాధించిన అద్భుత ప్రగతి గురించి గతంలో తాను శ్రీలంక పార్లమెంట్‌లో ప్రస్తావించిన అంశాన్ని కేటీఆర్‌తో పంచుకున్నారు. హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జి పరిసర ప్రాంతాల అభివృద్ధిని సింగపూర్‌ను తలపించేలా ఉన్నదని ప్రశంసించారు. ఐటీ, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన తీరును సతాశివన్ అభినందించారు. ఓవైపు ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరిగిపోతుంటే పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌ను అవకాశాల అక్షయపాత్రగా మార్చిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణలో ఓవైపు ఐటీ, మరోవైపు తయారీరంగం, ఇంకోవైపు ఫార్మా రంగాలకు ఏకకాలంలో పెద్దపీట వేసి పారిశ్రామిక రంగాన్ని మెరుపువేగంతో పరుగులు పెట్టించడం అరుదైన విషయమని కొనియాడారు. హైదరాబాద్ వంటి నగరాలే ఏ దేశానికైనా ఆర్థిక ఇంజిన్లని, వీటిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉం టుందని చెప్పారు. తాను చెన్నైలో పర్యటించానని, తమిళనాడు కంటే తెలంగాణ పోలీసులకే ఎక్కువ వేతనాలు అందుతున్నాయనే విషయాన్ని అక్కడి పోలీస్ అధికారి తనకు చెప్పిన విషయాన్ని సతాశివన్ గుర్తుచేశారు.

పదేండ్లపాటు యజ్ఞంలా ప్రగతి: కేటీఆర్

తెలంగాణలో గత పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనను ఓ యజ్ఞంలా సాగించామని, అందుకే అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు సాధించగలిగామని భేటీ సందర్భంగా శ్రీలంక మంత్రి సతాశివన్‌కు కేటీఆర్ వివరించారు. రాష్ట్రానికి గుండెకాయ వంటి హైదరాబాద్‌లో సంపదను సృష్టించి సంక్షేమం రూపంలో పల్లెపల్లెనా పేదలకు పంచామని చెప్పారు. పారిశ్రామిక రంగానికే కాదు పర్యావరణానికీ సమప్రాధాన్యం ఇచ్చామని, తెలంగాణలో 7.7 శాతం గ్రీన్ కవర్‌ను పెంచడం దేశంలోనే అరుదైన రికార్డు అని గుర్తు చేశారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం మానవ చరిత్రలోనే మూడో అతిపెద్ద ప్రయత్నమని వెల్లడించారు. చిన్న వయసులోనే శ్రీలంక ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఎదిగిన సతాశివన్‌ను కేటీఆర్ అభినందించారు. భేటీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, సీనియర్ నేత దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

గౌడన్నలను అవమానించిన సీఎం

- ఉద్దేశపూర్వకంగానే పాపన్న జయంతికి గైర్హాజరు
- క్షత్రియసభకు వెళ్లిన సీఎం ఇక్కడికి ఎందుకు రాలేదు?
- గౌడన్నలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదు
- మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్నమాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకాకపోవడం రాష్ట్రంలోని గౌడన్నలను అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. గౌడన్నలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి సీఎం సమయం ఇచ్చి చివరి నిమిషంలో హాజరుకాకపోవడంతో గౌడ గుండెలు మండిపోతున్నాయని చెప్పారు. ఆదివారం ఉదయం ఎలాంటి ఇతర కార్యక్రమాలు లేకపోయినా కూడా ఉద్దేశ పూర్వకంగానే హాజరుకాలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. సీఎం హాజరుకాకపోవడం బహుజనులందరిని అవమానపర్చడం, కించపర్చడమేనని అన్నారు. సీఎంకు క్షత్రియ సభకు హాజరుకావడానికి సమయం ఉంటుంది, కానీ గౌడ్‌లు పూజించే సర్వాయి పాపన్న జయంతికి హాజరుకావడానికి సమయం ఉండదా అని ప్రశ్నించారు. గౌడ్‌లకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఇంతవరకు అమలుకాలేదని చెప్పారు. గౌడలకు అందిస్తున్న మోకు కూడా బీఆర్‌ఎస్ హయాంలోనే తయారు చేసిందని తెలిపారు. గౌడన్నలు ప్రమాదవశాత్తు చనిపోతే అందించే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని పెంచుతామని ప్రకటించారని, వైన్స్‌లో గౌడ్‌లకు రిజర్వేషన్లను 25 శాతానికి పెంచుతామన్నారని, కానీ ఇంతవరకు అమలు చేయడంలేదని మండిపడ్డారు. శాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీది సంకుచిత సర్కార్ అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్వాయి పాపన్న జయంతికి హాజరుకాకపోవడం బలహీనవర్గాలకు చేసిన అతి పెద్ద గాయమని వ్యాఖ్యానించారు. క్షత్రియ సభకు హాజరై రీల్ హీరోలు కృష్ణంరాజు, ప్రభాస్, రామ్‌గోపాల్ వర్మలను సీఎం పొగిడారని, కానీ రియల్ హీరో సర్దార్ పాపన్న జయంతికి హాజరుకాలేదని మండిపడ్డారు. రేవంత్‌కు ఆత్మసాక్షి లేదు, సామాజిక స్పృహకూడా లేదని అన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెంచుతున్నారని, కల్లు దుకాణాలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ వైఖరిలో మార్పు రాకుంటే అగ్గిబరాటలవుతామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇంజినీరింగ్ సీట్లు పెరిగితే బడుగు బలహీనవర్గాలు చదువుకుంటారన్న ఉద్దేశంతో అడ్డుపుల్లలు వేస్తుందని అన్నారు. సీపీఎస్‌ఈలో సీట్లు పెరగకుండా కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. సీఎస్‌ఈలో సీట్లు పెంచకుంటే ఉన్నత విద్యామండలిని ముట్టడిస్తామని ఆయన ప్రకటించారు.

గురుకులాల్లో 36మంది చనిపోయారు

- 800 మంది అనారోగ్యానికి గురయ్యారు
- ఇకనైనా మెస్ చార్జీలను పెంచండి
- డిప్యూటీ సీఎం భట్టికి ఆర్ కృష్ణయ్య వినతి

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు లేక, కలుషిత ఆహారం బారినపడి 36మంది విద్యార్థులు ఇప్పటికే చనిపోయారని, 800మంది అనారోగ్యానికి గురయ్యారని, ఇకనైనా మెస్‌చార్జీలను పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం నేతలు రామకృష్ణ, రాజేందర్, రామ్మూర్తితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సెక్రటేరియట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అమ్మాయిలకు పాకెట్‌మనీ రూ.1000 ఇవ్వాలని, గురుకులాలు, హాస్టళ్లలో వసతులను మెరుగుపరచాలని విజ్ఞప్తిచేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

వక్ఫ్ బిల్లుకు బీఆర్‌ఎస్ వ్యతిరేకం

- మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తున్నదని మాజీ మంత్రి మహముద్ అలీ వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలుచేయడమే కాకుండా వక్ఫ్ బోర్డు భూములను రక్షించామని గుర్తు చేశారు. బీజేపీ తెచ్చిన బిల్లును దేశంలోని అన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ ఎన్నో ఏండ్లు అధికారంలో ఉన్నాయని, కానీ ముస్లింల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లిం మంత్రి ఒక్కరు కూడా లేరన్నారు. కేసీఆర్ మైనార్టీలకు డిప్యూటీ సీఎం రెవెన్యూ, రెండోసారి హోం శాఖ వంటి కీలక పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. నలుగురు బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తారని తెలిపారు. జేపీసీకి తమ పార్టీ అభిప్రాయాలు చెప్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ సలీం మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో కలెక్టర్‌కు అధికారం ఇచ్చారని, వక్ఫ్ ప్రాపర్టీకి అల్లానే యజమాని అని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కూడా బిల్లును వ్యతిరేకించాలని కోరారు.

పెండ్లిమడుగు..మాఫీ మళ్లీ అడుగు

- గ్రామంలో 70 శాతం మంది రుణమాఫీకి దూరం
- 553 మందిలో 200 మందికే లబ్ధి



స్పీకర్ ఇలాకాలో రైతుకు ధోకా!

వికారాబాద్, ఆగస్టు 19, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షలలోపు రుణమాఫీ పూర్తయిందని చెబుతు న్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రుణమాఫీ పూర్తైందని ప్రగాల్భాలు పలుకుతున్నా.. రుణమాఫీ కోసం రైతులు వ్యవసాయాధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇలాకాలోనూ రైతులు రుణమాఫీ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామంలో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతుల్లో 70 శాతం మంది మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులు 583మంది ఉండగా, వీరిలో 200లలోపు మంది రైతులకే రుణాలు మాఫీ అయ్యాయి. మిగతా రైతులు అర్హులైనా రుణమాఫీకి దూరం కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. పెండ్లిమడుగులో రూ.2 లక్షలకుపైన రుణాలున్న రైతులు 20మంది వరకు ఉన్నారు. రేషన్‌కార్డు లేదని, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతోనే రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నట్టు రైతులు చెబుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలకు వెళ్తే వివరాలు తీసుకుంటున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని పెండ్లిమడుగు రైతులు పేర్కొంటున్నారు. రేషన్‌కార్డు మెలిక పెట్టి తమకు అన్యాయం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.25 వేలున్నా మాఫీ కాలేదు



నాకున్న ఎకరన్నరపై 25 వేల రుణం తీసుకున్నా. మొదటి విడతలోనే మాఫీ కావాల్సింది. రేషన్‌కార్డు లేక మాఫీ కాలేదు. వ్యవసాయాధికారులను అడిగితే కుటుంబ నిర్ధారణ కాలేదని చెప్పారు. మా అమ్మ, నాన్న పేరిట 2 లక్షల రుణం తీసుకోగా, ప్రస్తుతం 2.03 లక్షలు అయ్యింది. పైన డబ్బు చెల్లిస్తేనే మాఫీ అవుతుందని చెబుతున్నారు.

- నారెగూడెం విఠల్ రెడ్డి, పెండ్లిమడుగు, వికారాబాద్

అధికారుల నిర్లక్ష్యంతోనే..



నాకున్న రెండెకరాల 24 గుంటల భూమిపై రూ.22 వేల రుణం తీసుకున్నాను. కానీ రుణ మాఫీ కాలేదు. వ్యవసాయాధికారులను వెళ్లి అడగగా రెన్యూవల్ చేసుకోలేదని సమాధానం చెబుతున్నారు. రెన్యూవల్ చేసుకున్నప్పటికీ సొసైటీ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంతోనే నేను తీసుకున్న రుణం మాఫీ కాలేదు.

-దుర్గంచెరువు బందిరెడ్డి, పెండ్లిమడుగు, వికారాబాద్

కేసీఆర్ మాఫీ చేసిండ్రు...



కేసీఆర్ ఉన్నప్పుడు రూ.30 వేల రుణం మాఫీ అయ్యింది. ఏటా రెన్యూవల్ చేసుకోవడంతోపాటు మళ్లీ కొత్తగడి సొసైటీ బ్యాంకులో 30 వేల రుణం తీసుకున్నా. ఇరవై రోజులుగా ఆఫీసులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా. వ్యవసాయాధికారులను అడిగి తే రెన్యూవల్ చేసుకోలేదని సమాధానం చెప్తున్నారు.

- ఎం.జంగయ్య, పెండ్లిమడుగు, వికారాబాద్

జీవో 29ని రద్దు చేయాలి

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ములుగులో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగురూరల్, ఆగస్టు19: గ్రూప్-1 మెయిన్ అభ్యర్థులకు తీరని అన్యాయం చేసే జీవో నంబర్ 29ని తక్షణమే రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఓపెన్ క్యాటగిరీ పోస్టులకు 1:50 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాలో ఎంత మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల వర్గాలకు చెందిన వారు ఉన్నారో ప్రభుత్వం బయటపెట్టాలని నిలదీశారు. జీవో నంబర్ 46 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి





బానోత్ శ్రీను(ఫైల్) బానోత్ షమీన(ఫైల్)

కారేపల్లి, ఆగస్టు 19: విద్యుదాఘాతంతో దంపతులు మృతిచెందిన ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బస్వాపురంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బస్వాపురం గ్రామానికి చెందిన బానోతు శ్రీను(42), షమీన(40) 20 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కూతురు ఉంది. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే సోమవారం ఉదయం షమీన బట్టలను ఇంటి ఎదుట ఉన్న ఇనుప తీగ(దండెం)పై ఆరేస్తుండగా.. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడికక్కడే పడిపోయింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న షమీన అప్పుడప్పుడు స్పృహతప్పి పడిపోతూ ఉండేది. గమనించిని ఆమె భర్త శ్రీను.. షమీన అలాగే పడిపోయిందనుకొని తన భార్యను లేపేందుకు యత్నించాడు. దీంతో అతడికి కూడా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. గమనించిన శ్రీను స్నేహితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ దంపతులను వెంటనే ఇల్లెందు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కుమార్తె ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు ఎస్సై రాజారాం తెలిపారు.

నీరుగారిన 'మహాలక్ష్మి' ఆశలు

- రాఖీ రోజున ప్రకటిస్తారని భావించిన మహిళలకు నిరాశ
- 8 నెలలైనా ఎందుకు అమలు చేయడం లేదు
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హామీల్లో భాగంగా నెలకు రూ.2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకాన్ని రాఖీ పండుగనాడు ప్రకటిస్తారని ఎదురుచూసిన మహిళాలోకానికి నిరాశే ఎదురైందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మహిళాలోకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా నిరాశపర్చారని ఒక ప్రకటనలో విమర్శించారు. ఉచిత బస్సు తప్ప ఏ హామీ ఇంతవరకు అమలు కాలేదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకాన్ని వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తయినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పథకం కోసం లక్షలాది మంది మహిళలు ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి త్వరగా అమలు చేయాలని కోరారు. విద్యార్థులకు ఇస్తామన్న స్కూటీల పథకం అమలు కాలేదని, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, అమలుపై అనేక ఆంక్షలు విధించారని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు పింఛను కోసం ఎదురుచూస్తున్నారని, జనవరిలో దరఖాస్తులు తీసుకొని, ఇంతవరకు వాటి ఉసే ఎత్తడంలేదని విమర్శించారు. మరోవైపు రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, మానభంగాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. శాంతిభద్రతలు అదుపు తప్పాయని, హోంశాఖ సీఎం వద్దే ఉన్నందున, సత్వరమే స్పందించాలని డిమాండ్ చేశారు. మహిళా హాస్టళ్లు, గురుకులాల్లో నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో అనేక మంది దవాఖానల పాలవుతున్నారని, కొందరు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

ఈసీఐఎల్ ఉద్యోగులకు రూ.10 లక్షల గ్రాట్యుటీ

గరిష్ఠ పరిమితి ప్రకారమే చెల్లించాలన్న హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 2007 నుంచి 2010 మధ్య రిటైర్డ్ ఉద్యోగులకు గరిష్ఠ పరిమితి ప్రకారం రూ.10 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. అప్పిలేట్ అథారిటీ ఉత్తర్వులకు అనుగుణంగా రూ.10 లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై సంస్థ వేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం కొట్టివేసింది. గ్రాట్యుటీ సీలింగ్‌ను రూ.3.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్ 2010 మే 24 నుంచి అమల్లోకి వచ్చిందని, కనుక ఈసీఐఎల్ ట్రస్ట్ నిబంధనల ప్రకారం రూ.3.5 లక్షల గ్రాట్యుటీ చెల్లించడమే సబబని సంస్థ న్యాయవాది చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది.